ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ప్రకాశం
శుక్రవారం 7, జూన్ 2024

ఒంగోలు లోక్‌సభ పరిధిలో టీడీపీ కూటమి అసెంబ్లీ, పార్ల మెంట్ అభ్యర్థుల మధ్య క్రాస్ ఓటింగ్ జరిగింది. క్రాస్ ఓటింగ్ కూడా అధికంగా జరగటం, అందునా టీడీపీ అసెంబ్లీ అభ్యర్థుల కన్నా మాగుంటకు ఓట్లు తక్కువ రావడం గమనార్హం. ఈ అంశం ఇటు టీడీపీ శ్రేణుల్లోనే కాక యావత్తు రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది. అసెంబ్లీ అభ్యర్థులకు వచ్చిన ఓట్ల కన్నా 25వేలకు పైగా ఓట్లు మాగుంటకు తక్కువ వచ్చాయి. అన్ని అసెంబ్లీ స్థానాల్లో మాగుంట అంతోఇంతో వెనుకబడగా పశ్చిమ ప్రాంత నియోజకవర్గాల్లో కూడా తక్కువ వచ్చాయి. ఇటు టీడీపీ కన్నా అటు వైసీపీ శ్రేణులే ఎక్కువగా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ టమే మాగుంట అధిక్యత తగ్గటానికి కారణంగా ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థులకన్నా మాగుంటకు
అన్నిచోట్లా తగ్గిన అధిక్యత
తర్జనభర్జన ప్రారంభం
వైసీపీ శ్రేణులే అటుఇటు వేసినట్లు అంచనా

ఒంగోలు లోక్‌సభలో భారీగా క్రాస్ ఓటింగ్





(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఒంగోలు పార్లమెంట్ స్థానంలో భారీగా క్రాస్ ఓటింగ్ జరిగింది. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ అభ్యర్థులకు వచ్చిన స్థాయిలో ఎంపీ అభ్యర్థి మాగుంటకు రాకపోవడం జిల్లాలో చర్చనీయాంశ మైంది. ఎన్నికల నోటిఫికేషన్‌కు కొద్దిరోజుల ముందుగా మాగుంట వైసీపీని వీడి టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. తన కుమారుడి రాఘవరెడ్డిని పోటీలో దించాలని మాగుంట భావించగా చివరి క్షణంలో చంద్రబాబు జోక్యం చేసుకొని మాగుంటనే రంగంలో దించారు. మాగుంటకు మద్దతుగా పలు నియోజకవర్గాల్లో వైసీపీ నుంచి కొందరు ముఖ్యులు మరికొందరు సానుభూతిపరులు టీడీపీలో చేరారు. ఇంకొందరు వైసీపీలోనే ఉండి మాగుంటకు సహ కరిస్తారని అంచనా వేశారు. తీరా ఎన్నికల ఫలితాలను చూస్తే టీడీపీ అసెంబ్లీ అభ్య ర్థుల కన్నా మాగుంటకు తక్కువ ఓట్లు వచ్చాయి. లోక్‌సభ పరిధిలోని ఐదు చోట్ల టీడీపీ అభ్యర్థులు గెలుపొం దగా వారికి రమారమీ 84వేల పైచిలుకు ఆధిక్యత లభిం చింది. ఎర్రగొం డ పాలెం, దర్శిలో స్వల్ప ఆధిక్యతతోనే వైసీపీ అభ్య ర్థులు గెలుపొందారు. ఆ రెండుచోట్ల వైసీపీ అసెంబ్లీ అభ్యర్థులకు సుమారు 8వేల ఆధిక్యత మాత్రమే లభించింది. ఆ ఆధిక్యతను తీసేసినా ఐదు నియోజకవర్గాల్లో గెలుపొందిన టీడీపీ అసెంబ్లీ అభ్యర్థులకు సుమారు 75వేల ఓట్ల ఆధి క్యత కనిపిస్తోంది. అయితే లోక్‌సభ అభ్యర్థి మాగుంట 55వేల ఓట్ల ఆధిక్యతతో మాత్రమే గెలుపొం దారు. అన్నీ నియోజక వర్గాల్లో ఈవీఎం ఓట్లు, ఉద్యో గుల ఓట్లు, సర్వీసు ఓట్లు కలిపిన జాబి తాల తుది నివేది కలు ఇంకా బయ టకు తీయనప్పటికీ గెలుపొందిన టీడీపీ అభ్యర్థుల ఆధిక్యత కన్నా మాగుంటకు సుమారు 25వేల ఓట్ల ఆధిక్యత తగ్గింది.

అసలు కారణం అదేనా?

ఈ క్రాస్ ఓటింగ్‌కు రెండు రకాల కార ణాలు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రధానంగా మార్కాపురం, గిద్దలూరు, కని గిరి నియోజకవర్గాల్లో వైసీపీలోని రెడ్డి సామాజికవర్గం ఓటర్ల నుంచి టీడీపీ కూటమి అసెంబ్లీ అభ్యర్థులకు ఓట్ల బదిలీ జరిగిన విషయం జగమెరిగిన సత్యం. మార్కాపురం, కనిగిరిలో తమ సామాజికవర్గం వారికి టికెట్ ఇవ్వలేదన్న ఉక్రోషం వైసీపీలోని రెడ్డి నాయకుల్లో వ్యక్తమైంది. దానికితోడు టీడీపీ నుంచి రెడ్డి సామాజికవర్గం రంగంలో ఉండటం ఇద్దరు స్థానికంగా బలమైన ప్రజాసంబం ధాలు కలిగి ఉండటం, ముందు నుంచి ఆ సామాజికవర్గ వైసీపీ ఓటర్లపై దృష్టిసా రించి పనిచేశారు. గిద్దలూరులోనూ స్థానికంగా ఉన్న తమ వారికి టికెట్ ఇవ్వలేదనే అసంతృప్తి వైసీపీలోని ఆ సామాజిక నేతల్లో వ్యక్తమైంది. దానికి తోడు టీడీపీ అభ్యర్థికి బలమైన బంధుత్వం ఏర్పడింది. దీంతో ఈ మూడు నియోజకవర్గాల్లోని రెడ్డి ఓటర్లు అసెంబ్లీకి టీడీపీకి వేసి ఒక్క ఓటయినా వైసీపీకి వేయాలన్న ఆకాం క్షతో పార్లమెంట్ వైసీపీకి వేసినట్లు తేటతెల్లమవుతోంది. అందుకు కొన్ని ప్రాంతాల్లో స్పష్టమైన సంకేతాలు కూడా బహిరంగంగా కనిపిం చాయి.

అన్నిచోట్లా తగ్గిన ఆధిక్యత

ఏడు నియోజకవర్గాల్లోనూ టీడీపీ కూటమి అసెంబ్లీ అభ్యర్థుల కన్నా మాగుంటకు తక్కువ ఓట్లు వచ్చాయి. ఒంగోలులో దామచర్ల కన్నా సుమారు 3,500 ఓట్లు, కొండపిలో సుమారు 4,669 ఓట్లు, మాగుంటకు తగ్గాయి. అలాగే కనిగిరిలో మాగుంట కన్నా అసెంబ్లీ నుంచి గెలుపొం దిన డాక్టర్ ఉగ్రకు 8,500 ఓట్లు అధికంగా వచ్చాయి. ఇక మార్కాపు రంలో కందుల కన్నా సుమారు 6,900 ఓట్లు, గిద్దలూరులో అశోక్‌రెడ్డి కన్నా సుమారు 7వేల ఓట్లు మాగుంటకు తక్కువగా వచ్చాయి. టీడీపీ ఓడిన దర్శిలో కేవలం 50 ఓట్లే మాగుంటకు తక్కువగా రాగా, ఎర్రగొం డపాలెంలో మాగుంటకు 5వేల ఓట్లు తగ్గడం గమనార్హం.

చేసింది వారా.. వీరా?

ఒంగోలు, కొండపిల్లో కూడా అసెంబ్లీ అభ్యర్థుల కన్నా మాగుంటకు ఓట్లు తగ్గటంపై రసవత్తర చర్చ జరుగుతోంది. క్రాస్ ఓటింగ్‌కు టీడీపీ శ్రేణులు కూడా పాల్పడ్డారా? అనే అనుమానం కొందరు వ్యక్తం చేస్తు న్నారు. కొత్తగా టీడీపీకి బదిలీ అయిన ఓటర్లే అటుఇటు వ్యవహరించా రన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇంతకన్నా వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న వామపక్ష భావజాల, కాంగ్రెస్ పార్టీ అభిమాన ఓటర్లు, అసెంబ్లీలో టీడీపీకి ఓటు వేసి పార్లమెంట్‌లో బీజేపీని గుర్తు చేసుకొని ఓటు వేయలేక వైసీపీకి లేక కాంగ్రెస్‌కు ఓటు వేయటం ద్వారా మాగుంట ఆధిక్యత తగ్గి ఉండవచ్చని భావిస్తున్నారు. ఏది ఏమైనా విశ్లేషకుల అంచనాలకు అతీతంగా అసెంబ్లీ అభ్యర్థుల కన్నా మాగుంటకు ఓట్లు తగ్గటం చర్చనీయాంశంగా మారింది.

కలెక్టర్, ఎస్పీలను కలిసిన ఎమ్మెల్యే స్వామి

ఒంగోలు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : కొండపి ఎమ్మెల్యే డాక్టర్ స్వామి గురు వారం కలెక్టర్, ఎస్పీలను మర్యాదపూర్వకంగా కలిశారు. తొలుత కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్‌ను ప్రకాశం భవన్‌లోని ఆయన చాంబర్‌లో కలిసిన స్వామి కొండపి నియోజకవర్గంలో పలు గ్రామాల్లో తక్షణం పరిష్కరించాల్సిన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల సమయంలో నిబంధన లకు విరుద్ధంగా కొంతమంది ఉద్యోగులు వ్యవహరించినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని కూడా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయానికి వెళ్లి ఎస్పీ గరుడ్ సమి త్‌సునీల్‌ను కలిశారు. ఎన్నికల సమయంలో తన నియోజకవర్గంతో పాటు జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో పనిచేసిన పోలీసు అధికారుల తీరుపై వారి మధ్య కొంతసేపు చర్చ జరిగినట్లు తెలిసింది. అలాగే కౌంటింగ్ అనంతరం జిల్లాలో కొన్నిచోట్ల స్థానిక పోలీస్ అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారని ఎస్పీ దృష్టికి స్వామి తీసుకెళ్లినట్లు సమాచారం.

టీచర్ల బదిలీలు నిలిపివేత

నిబంధనలకు విరుద్ధంగా ఉత్తర్వులు
ఎన్నికల ముందు 95మందికి ఆర్డర్లు



ఒంగోలు(విద్య), జూన్ 6: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు ప్రభుత్వం నుంచి బదిలీ ఉత్తర్వులు పొందిన ఉపాధ్యాయులకు షాక్ తగి లింది. వాటి అమలును ప్రభుత్వం నిలిపివే సింది. ఈ మేరకు పాఠశాల విద్యా ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ గురువారం ఉత్త ర్వులు జారీచేశారు. దీంతో టీచర్ల బదిలీలు నిలిచిపో యాయి. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు టీచర్ల బది లీల కౌన్సెలింగ్ నిబంధనలను విరుద్ధంగా సుమారు 1,400 మంది టీచర్లు ప్రభుత్వం నుంచి నేరుగా ఆర్డర్లు పొందారు. వీరిలో జిల్లాలో సుమారు 95 మంది టీచర్లు ఉన్నారు. బదిలీల కౌన్సెలింగ్‌లో తాము కోరుకునే స్థానాలు దక్కవన్న భయంతో ఈ ఉపాధ్యాయులు ముందుగానే ప్రభుత్వం నుంచి ఆర్డర్ పొందారు. కొందరు వ్యక్తిగత బదిలీ, మరికొందరు పరస్పర బదిలీ ఉత్తర్వులు పొందారు. బదిలీలు పొందిన వారిలో కొందరు ప్రధానోపాధ్యాయులు, స్కూలు అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు ఉన్నారు. రాజకీయ నాయకులు, అప్పటి ప్రజాప్రతి నిధుల సిఫార్సులతో ఈ బదిలీలకు శ్రీకారం చుట్టారు. బదిలీ కోసం ఒక్కో టీచర్ నుంచి రూ.4లక్షల వరకు వసూలు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ బదిలీల వ్యవహారాల్లో పాఠశాల విద్యాశాఖ కార్యాలయం లోని ఒక అధికారి కీలకంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ బదిలీల్లో ఒక్కొక్క స్థానానికి ఇద్దరు, ముగ్గురికి కూడా ఉత్తర్వులు ఇచ్చారు. వాటిపై తదుపరి నిర్ణయం తీసుకునేంత వరకు బదిలీ ఉత్త ర్వులు నిలిపివేయమని విద్యాశాఖ ఆర్‌జేడీలు, డీఈవోలకు పాఠశాల విద్యా కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ విషయంపై డీఈవో సుభద్రను వివరణ కోరగా బదిలీ ఉత్తర్వులు నిలివేయాలని ఉత్త ర్వులు వచ్చిన మాట వాస్తవమేనని ధ్రువీకరించారు.

బాలిక దారుణహత్య

నిద్రిస్తుండగా గొంతుకోసి ఘాతుకం
అర్ధవీడులో పట్టపగలే ఘటన

మెయిన్‌లో...





గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంల బాక్సులను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

హమ్మయ్యా!

ప్రశాంతంగా పూర్తయిన ఎన్నికల ప్రక్రియ
ఊపిరిపీల్చుకున్న అధికార యంత్రాంగం
గోడౌన్‌కు చేరిన ఈవీఎంలు
మూడు మాసాల తర్వాత ఉపశమనం
ముగిసిన ఎన్నికల కోడ్

ఒంగోలు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): దాదాపు మూడు మాసాల కాలం ఎన్నికల విధుల్లో మునిగి తేలిన అధికారులు ఎట్టకేలకు కాస్తంత రిలాక్స్ అయ్యారు. కొద్ది పాటి సంఘటనలు మినహా జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగానే సాగగా ఓట్ల లెక్కింపు అనంతరం ఈవీ ఎంలను ఒంగోలులోని గోడౌన్‌లకు కూడా చేర్చారు. గురువారం ఉదయం భాగ్యనగర్‌లోని ఈవీఎంలను భద్రపరిచే గోడౌన్‌కు వాటన్నింటిని చేర్చే పనిని పూర్తి చేసి రాజకీయ పార్టీల వారి సమక్షంలో కలెక్టర్ సీల్ వేశారు. దీంతో ఎన్నికల ప్రక్రియ పూర్తికాగా కోడ్ కూడా గురువారంతో ముగిసింది. దీంతో యంత్రాంగం ఊపిరిపీ ల్చుకుంది. ఎన్నికల నిర్వహణ కత్తిమీద సామువంటిది. ఈసారి సాధారణ ఎన్నికలు మరింత క్లిష్టంగా మారాయి. రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి పనిచేస్తే వారి సూచనలు, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అను గుణంగా మొత్తం యంత్రాంగం, ఉద్యోగులు పనిచేశారు. అలా కలెక్టర్, ఎస్పీ స్థాయి నుంచి అటెండర్ల వరకు 20వేల మంది ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ఈసారి ఎన్నికల విధుల్లో ఉన్నారు. దాదాపు ఆరు నెలల క్రితం నుంచే రెవెన్యూ, పోలీస్ అధికారులు నిర్దిష్ట ప్రణాళికాబద్ధంగా ఈ పనులు ప్రారంభించగా మార్చి తొలి వారం నుంచి పూర్తిగా ఇదే పనిలో నిమగ్నమయ్యారు. ఎన్నికల ప్రక్రి యలో ఎక్కడ ఏ చిన్న తప్పు జరిగినా మొత్తం గందరగోళమయ్యే అవకాశం ఉంటుంది. దీంతో యంత్రాంగం అప్రమ త్తంగా పనిచేసే ప్రయత్నం చేశారు.

ఈసీ ఆగ్రహానికి గురైన అధికారులు

మూడు మాసాల పాటు సాగిన ఈ ప్రక్రి యలో కొందరు అధికారులు, ఉద్యోగులు ఏకప క్షంగా పనిచేసి ఎన్నికల సంఘం ఆగ్రహానికి గురయ్యారు ఎస్పీ పరమేశ్వరరెడ్డిపై బదిలీ వేటుపడగా పలువురు ఇతర అధికా రులను బదిలీ చేశారు. అక్కడక్కడా ప్రచార సమయంలోనూ, పోలింగ్ రోజున ఘర్షణలు చోటుచేసుకున్నాయి. వాటివల్ల ప్రక్రియకు అవాంతరాలు కలుగుతున్నాయన్న ఆందోళన ఉన్నతాధికారులలో కనిపించినా అటు పోలింగ్, ఇటు కౌంటింగ్‌లను విజయవంతంగా పూర్తిచేయడంలో సఫలమయ్యారు. పోలింగ్ సమయంలో జరిగిన ఘటనల నేపథ్యంలో కౌంటింగ్ వేళ అలాం టివి జిల్లాలో జరగకుండా నియంత్రించడంలో జాగ్రత్తలు తీసుకొని సక్సెస్ అయ్యారు. కిందిస్థాయి అధికారులలో కొంతమేర లోటుపాట్లు ఉన్న ఉన్నతాధికారులైన కలెక్టర్, ఎస్పీలు అప్రమత్తంగానే పనిచేశారు. మొత్తంగా ఎన్నికల నిర్వహణ ప్రక్రియ పెద్దగా ఆటంకాలు, ఇబ్బందులు లేకుండా సాగిపోవడంతో జిల్లా యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఈనెల 4న కౌంటింగ్ జరగ్గా అర్ధరాత్రికి ఫలితాలు ప్రకటించారు. ఆ వెంటనే ఈవీఎంలు, వీవీ ప్యాట్లను ఒంగోలులోని గోడౌనకు గురువారం తెల్లవారుజామునకు చేర్చగా కలెక్టర్ దినేష్‌కుమార్ దగ్గరుండి పర్యవే క్షించారు. మార్చి 16 నుంచి అమలులోకి వచ్చిన ఎన్నికల కోడ్ గురువారంతో ముగిసింది. దీంతో ఎన్నికల ప్రక్రియ పూర్తయింది.

డీఎల్‌పీవో కార్యాలయంలో
ఉద్యోగినులపై లైంగిక వేధిపుల్లో మరోకోణం
నివేదిక ఇవ్వని త్రిసభ్య కమిటీ సభ్యులు
రాజీచేయాలని బాధితురాలి బంధువులపై ఒత్తిడి

విచారణపై నీలినీడలు

మార్కాపురం, జూన్ 6: మార్కాపురం డివిజనల్ పంచాయతీ కార్యాలయంలో మహిళా ఉద్యోగినిపై వేధిపులకు సంబంధించిన విచా రణపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఆ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసే శ్రీనివాసులు మహిళా ఉద్యోగులను లైంగికం గా వేధిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ విషయంపై బాధితురాలు స్థానిక అధికారికి ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించలేదు. చర్యలు తీసుకోవాల్సిన సదరు ఉన్నతాధికారి సైతం లైంగిక వేధింపులు ప్రారంభించారు. దీంతో బాధితురాలు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. స్పందించిన అధికారులు ప్రాథమిక విచారణ అనంతరం మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న సీనియర్ అసిస్టెంట్ జి.శ్రీనివాసులును సస్పెండ్ చేశారు. గతంలో పనిచే సిన ప్రదేశాలలో ఆయన వ్యవహారశైలిని కూడా ఆధారంగా చేసుకున్నారు. డీఎల్పీవో నాగేశ్వరరావుపై బాధితురాలు చేసిన ఆరోపణల మేరకు సమగ్ర విచారణ చేయాలని ముగ్గురు సభ్యులతో కలెక్టర్ దినేష్‌కుమార్ కమిటీని ఏర్పాటు చేశారు. వారంలోపు నివేదిక ఇవ్వాలని విచారణ కమిటీ సభ్యులు మార్కాపురం ఎంపీడీవో తోట చందన, సీడీపీవో సుశీలా దేవి, ఏపీడీ నిర్మాలాదేవిలను ఆదేశించారు.

కలెక్టర్‌కు అందని విచారణ నివేదిక

మార్కాపురం డీఎల్‌పీవో నాగేశ్వరరావు తన కార్యాలయంలో పనిచేసే మహిళా ఉద్యోగిపై చేసిన లైంగిక వైధింపులపై త్రిసభ్య కమిటీ విచారణపై నీలినీడలు కమ్ముకున్నాయి. సమగ్ర విచారణ జరిపి 7 రోజుల్లో నివేదిక ఇవ్వాలని గత నెల 25న కలెక్టర్ దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఆదేశాల మేరకు మే 31న త్రిసభ్య కమిటీ సభ్యులు డీఎల్‌పీవో కార్యాల యంలో విచారించారు. విచారణ పూర్తి చేసి 7 రోజులు గడుస్తున్నా, నేటికీ ఆ నివేదికను కలెక్టర్‌కు సమర్పించలేదు. దీనిపై ఎంపీడీవో చందనను వివరణ కోరగా నివేదిక సిద్ధం చేస్తున్నాం, త్వరలో సమర్పిస్తామని తెలిపారు.

బంధువులపై ఒత్తిడి

లైంగిక వేధింపుల విషయంలో బాధితురాలు కంభం పట్టణంలో నివాస ముంటుంది. వారి బంధువులలో ఒక వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగం చేసి ఉద్యోగ విరమణ చేసి కంభంలో తన ఇంట్లో ఉంటున్నాడు. ఆయన వద్దకు డీఎల్ పీవో నాగేశ్వరరావు ఆయనకు పరిచయాలు ఉన్న వ్యక్తుల ద్వారా రాజీకి రావాలని ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. ఫిర్యాదును వెనక్కు తీసుకునేట్లు బాధితురాలిని ఒప్పిస్తే డబ్బులు ఇచ్చేందుకు కూడా సిద్ధమేనని రాయబారం పంపినట్లు తెలిసింది.



మార్కాపురం డీఎల్పీవో కార్యాలయం

రాజీ పడితే మంచిది: బాధితురాలికి విచారణ బృంద సభ్యురాలు సూచన

రాజీ పడితే నీకు మంచిది. మా విచారణలో నీ దగ్గర ఉన్న ఆధారాలు బలహీనంగా ఉన్నాయి. నిన్ను పట్టుకున్నట్లు వీడియోలు లేవు. అని త్రిసభ్య కమిటీలోని ఒక సభ్యురాలు బాధితురాలిని హెచ్చరించినట్లు తెలిసింది. అందుకు సమాధానంగా బాధితురాలు ఆఫీసులో ఎక్కడైనా సీసీ కెమెరాలు ఉంటాయా? వీడియోలు తీసుకోవడానికి ఇదేమైనా శుభకార్యమా? అని సమాధానం చెప్పినట్లు తెలిసింది.

సింగరాయకొండలో పార్టీ కార్యాలయానికి
టూలెట్ బోర్డు తగిలించిన యజమాని
అద్దె కుర్చీలు, షామియానాలను షాపులకు చేర్చిన నాయకులు
సురేష్ క్యాంపు కార్యాలయం కూడా మూత
చడీచప్పుడు లేకుండా హైదరాబాద్‌కు మారిన మకాం

అయోమయంలో వైసీపీ కేడర్

కొండపి/సింగరాయకొండ, జూన్ 6 : ఎన్నికల సందర్భంగా కొండపి నియోజకవర్గంలో మంత్రి ఆదిమూలపు సురేష్ ఏర్పాటు చేసిన క్యాంపు కార్యాలయంతో పాటు ఆరు మండలాల్లో వైసీపీ కార్యాలయాలు ఒక్కసారిగా మూతపడడంతో ఆ పార్టీ నేతలు డీలాపడ్డారు. సురేష్ గుట్టుగా హైదరాబాద్‌కు మకాం మార్చ డంతో పార్టీని ఎలా నడపాలంటూ వారు గాబరాపడుతు న్నారు. గ్రామాల్లో తమ పట్టు జారిపోతుందని ఆందోళన చెందుతున్నారు. గతేడాది డిసెంబర్‌లో కొండపి వైసీపీ ఇన్ చార్జిగా బాధ్యతలు స్వీకరించిన ఆదిమూలపు సురేష్ సింగ రాయకొండ కేంద్రంగా తన ఎన్నికల కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. మంత్రి హోదాలో తన క్యాంపు కార్యాలయాన్ని కూడా ఇక్కడే ప్రారంభించారు. ఫలితాలు వచ్చి సురేష్ ఓడిపోయిన మూడో రోజే సింగరాయకొండలో ఉన్న వైసీపీ మండల పార్టీ కార్యాలయానికి టూలెట్ బోర్డు పెట్టడం ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. అదేవిధంగా కొండపి, జరుగుమల్లి, టంగుటూరు, మర్రిపూడి, పొన్నలూరులలో కూడా వైసీపీ నాయకుల, అభిమానుల ఇళ్లను అద్దెకు తీసుకుని ఎన్నికల కార్యక లాపాలను నిర్వహించారు. కొండపిలో ఇంటి యాజమానికి కరెంటు బిల్లులు మినహా మిగతా అద్దె చెల్లించారు. తాజాగా ఖాళీ అయిన ఎన్నికల కార్యాల యాల స్థానంలో ఇంటి యజమానులు తిరిగి టూలెట్ బోర్డులు ఏర్పాటు చేస్తు న్నారు.

వలస ఓటర్ల చార్జీలు అదనపు భారం...

ఇదిలా ఉండగా ఎన్నికల సందర్భంగా వలస ఓటర్లకు రానుపోను చార్జీలు కలిపి ఒక్కో ఓటుకు రెండు వేల చొప్పున వైసీపీ గ్రామ నాయకులకు వైసీపీ అభ్యర్థి సురేష్ ఇచ్చారు. దూర ప్రాం తాల ఓట ర్లకు రెండు వేల చొప్పున ఇవ్వగా, జిల్లా పరిధిలోని ఇతర గ్రామాల్లో ఉండే వారికి చార్జీల కింద కొంత నగదును గ్రామాల నాయకులు చెల్లిం చారు. దూర ప్రాంత ఓటర్లకు రెండు వేలు చార్జీలకు సరిపోకపోవ డంతో మరో ఐదు వందల నుంచి వెయ్యి రూపాయల వరకు ఆయా గ్రామాల వైసీపీ నాయకులే సొంతంగా చెల్లించారు. అలా ప్రతి గ్రామంలో రూ.3లక్షలు చార్జీల రూపంలో సొంత డబ్బులు ఖర్చుచేశా మని వైసీపీ నాయకులు వాపోతున్నారు. పోలింగ్ ముగిశాక ఆ విషయం సురేష్‌కు చెప్పడంతో చార్జీలకు తాను ఇచ్చేది రెండు వేలే నని తెగేసి చెప్పడంతో వారు కంగుతిన్నారు. నాయకులు గ్రామాల్లో తమ పట్టు జారకుండా ఉండేందుకు రెండు వేలకు కొంత డబ్బులు కలిసి వలస ఓటర్లకు చెల్లించారని తెలిసింది. ఓటమి అనంతరం వైసీపీ నేతలకు మొహం చాటేసి చడీచప్పుడు కాకుండా మంత్రి మకాం మార్చేయడతో ఖర్చుపెట్టిన వైసీపీ నేతలు తలలు పట్టుకుం టున్నారు.



అంకెల్లో చూపిన అభిమానం..!

ఎమ్మెల్యేగా దామచర్లకు పట్టం కట్టిన ప్రజలు

తొలిసారిగా ఒంగోలులో 34,026 ఓట్లతో భారీ మెజారిటీ

టీడీపీ కూటమికే అండగా నిలిచిన నియోజకవర్గ ఓటర్లు



అభిమానులకు అభివాదం చేస్తున్న దామచర్ల జనార్దన్(ఫైల్)

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 6 : 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఒంగోలు నియోజకవర్గ ప్రజలు తమ అభిమానాన్ని అంకెల్లో చూపించారు. ఊహించని విజయం అందించి టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్‌కు ఎమ్మెల్యేగా పట్టం కట్టారు. అధికారంలో ఉండీ, అనేక సంక్షేమ పథకాలు అందించామని చెప్పుకూంటూ ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినా వైసీపీని ఓడించారు. పోలింగ్ జరిగిన రోజు నుంచి నియోజకవర్గంలో గెలుపు, ఓటమిలపై భిన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ ఎన్నికలు ప్రధాన వైసీపీ, టీడీపీ పార్టీలకు కంటిమీద కునుకులేకుండా చేశాయి. ఎవరికి వారే గెలుపు ధీమా వ్యక్తం చేయడంతోపాటు, మెజారిటీపైనా కూడికలు, తీసివేతలతో ధైర్యంగా ఉన్నారు. మరోవైపు గెలుపుపై భారీగానే బెట్టింగ్‌లు జరిగాయి. అయితే ఓటర్లు తమ ఓటును అభివృద్ధికే ప్రాధాన్యత ఇచ్చినట్లు ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఇదే విషయంపై ఆంధ్రజ్యోతి పోలింగ్ రోజున నిర్వహించిన సర్వేలో కూడా స్పష్టం అయ్యాయి. ఇదిలా ఉంచితే, తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థి గెలుపు ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపగా, ఇది పార్టీ విజయం కంటే ప్రజా విజయమని శ్రేణులు వెల్లడిస్తున్నారు. ప్రత్యేకించి ఒంగోలు నగరంలోని అర్బన్ ప్రాంతాల్లో టీడీపీ కూటమికి ఓట్లు పోలయ్యాయని, అయితే శివారు కాలనీల్లో వైసీపీకి అనుకూలంగా ఓట్లు పడ్డాయని అందరూ అంచనాలు వేశారు. తొలి నుంచి ఒంగోలు రూరల్ టీడీపీకే ఆధిక్యత దక్కుతుందని భావించినప్పటికీ, గెలుపు, ఓటమిలను నిర్ధేశించేది కొత్తపట్నం మండల ఓటర్ల తీర్పు అని అందరూ చర్చించారు. ఎలాగైనా గెలుపు ఖాయమంటూ వైసీపీ ధీమా వ్యక్తం చేయగా, మరోవైపు భారీగా కాకపోయినా ఎంతోకొంత మెజారిటీతో టీడీపీ గెలుపు సాధిస్తుందని మొదటి నుంచి తెలుగు తమ్ముళ్లు భావించారు. అయితే ఈనెల 4న జరిగిన ఓట్లు లెక్కింపు పూర్తి కాగా, వెలువడిన ఫలితాలు అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తాయి. రాష్ట్రవ్యాప్తంగా సైకిల్ స్పీడ్ పెంచడంతోపాటు, జతగా నిలిచిన జనసేన, బీజేపీ కూటమితో అటు రాష్ట్రంలోనూ, ఇటు జిల్లాలోనూ ఊహించని విజయం సొంతమైంది. అందులో ఒకటైన జిల్లా కేంద్రం ఒంగోలు నియోజకవర్గంలో టీడీపీకి భారీ మెజారిటీ రావడంతో గెలుపు ఆశించిన వైసీపీనేతలకు భంగపాటు ఎదురైంది. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో దామచర్ల జనార్దన్‌కు 34,026 మెజారిటీ సాధించడంతో నగరంలో టీడీపీ కూటమి శ్రేణులు సంబరాల్లో మునిగి తేలుతున్నారు. ఎక్కడికక్కడ, గ్రామ, మండల, నగరంలో డివిజన్‌లలో భారీగా కేక్ కటింగ్‌లతో, బాణసంచాలతో తమ అభిమానాన్ని చాటుతుండగా, ఓటర్లు అభివృద్ధికే అండగా నిలబడటం సర్వత్రా హర్షం వ్యక్తం అవుతున్నది.

కాగా నియోజకవర్గంలో మొత్తం 2,40,242 ఓట్లు ఉండగా, 2,40,143 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 19 రౌండ్లు ఓట్లు లెక్కింపు జరిగింది. మొదటి రౌండ్‌లో వైసీపీకి 35 ఓట్లు, చివరి 19 రౌండ్‌లో 60 ఓట్లు మాత్రమే మెజారిటీ లభించింది. మిగిలిన 17 రౌండ్లలో అధిక మెజారిటీతో సైకిల్ దూసుకెళ్లింది.

నియోజకవర్గం వారీగా పోలైన ఓట్ల వివరాలు

ప్రాంతం	టీడీపీ	వైసీపీ	మెజారిటీ
ఒంగోలు టౌన్	85,126,	57,637	27,489
ఒంగోలు రూరల్	10,608	7,881	2,727
కొత్తపట్నం మండలం	20,174	17,276	2,898
పోస్టల్ బ్యాలెట్లు			912
మొత్తం	1,15,908	82,794	34,026

ఒంగోలు నియోజకవర్గంలో ఆధిక్యత వివరాలు ఇలా ఉన్నాయి..

రౌండ్	టీడీపీ	వైసీపీ	మెజారిటీ
1.	350	385	35(వైసీపీ)
2.	4792	4145	647(టీడీపీ)
3.	5860	5035	825(టీడీపీ)
4.	5655	5100	555(టీడీపీ)
5.	6750	4644	2106(టీడీపీ)
6.	6982	5171	1811(టీడీపీ)
7.	6414	3630	2784(టీడీపీ)
8.	7164	4520	2644(టీడీపీ)
9.	6182	5492	690(టీడీపీ)
10.	7950	4056	3894(టీడీపీ)
11.	7156	3203	3953(టీడీపీ)
12.	6784	4310	2474(టీడీపీ)
13.	6159	3954	2205(టీడీపీ)
14.	6515	4685	1830(టీడీపీ)
15.	5478	4987	491(టీడీపీ)
16.	6455	5056	1399(టీడీపీ)
17.	5126	4409	717(టీడీపీ)
18.	5316	3717	1599(టీడీపీ)
19.	2612	2672	60(వైసీపీ)

దొడ్డవరంలో తాగునీటికి అవస్థలు

విద్యుత్ బిల్లులు కట్టలేదని ఫీజులు తీసుకెళ్లిన సిబ్బంది ● ట్యాంకర్లతో నీరు కొనుగోలు చేస్తు గ్రామస్థులు ● ప్రజలపై ఆర్థికభారం

మద్దిపాడు, జూన్ 6: మద్దిపాడు మండలం దొడ్డవరంలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులుపడతుఉన్నారు. పైలెట్ ప్రాజెక్టుకు సంబంధించి విద్యుత్ బిల్లులు చెల్లించపోవడంతో సంబంధిత అధికారులు ఫీజులు తీసుకెళారు. దీంతో గ్రామంలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ఎవరికి వారు ట్యాంకర్లతో నీరు కొనుక్కోవాల్సిన దుస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. దొడ్డవరం-తెల్లపాడు గ్రామానికి 2002 సంవత్సరంలో పైలెట్ తాగునీటి ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్ యనమదల భరద్వాజ పైలట్ ప్రాజెక్టు చైర్మన్‌గా విధులు నిర్వహించారు. ఆయన చైర్మన్‌గా ఉన్న సమయంలో ప్రతిరోజు నీటిని అందించారు. తాగునీటికి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారు. ఆయన అనారోగ్యం కారణంగా ఆ పైలెట్ ప్రాజెక్టు బాధ్యతను గ్రామ పంచాయతీకి అప్పజెప్పారు. దొడ్డవరం సర్పంచ్ పూనూరు సుబ్బారావుకు బాధ్యతలు అప్పజెప్పి రూ.1,75,000 బకాయిలు కూడా చెల్లించామని చెప్పారు. అప్పటి నుంచి బాధ్యతలు చేపట్టిన సర్పంచ్ పూనూరు సుబ్బారావు సంవత్సరకాలం పాటు నీటికి ఇబ్బందులు లేకుండా చేశారని ప్రజలు అంటున్నారు. ఇంటికి రూ.150 చొప్పున తాగునీటికి పన్ను వసూలు చేశారు. అయితే అప్పటి నుంచి ఇప్పటివరకు విద్యుత్ బిల్లులో దాదాపు రూ.20లక్షల బకాయి పెట్టారు. దానిలో రూ.9 లక్షలు విద్యుత్ బకాయి చెల్లించారు. మిగతా బిల్లులు చెలించకపోవడంతో విద్యుత్ అధికారులు కరెంటు సరఫరాను నిలిపివేశారు. గ్రామ కార్యదర్శి అజయ్ కీర్తి, సర్పంచ్ పూనూరు సుబ్బారావు, వార్డుమెంబర్ భీమవరపు వెంకట్రావు బాధ్యతగా పైలెట్ ప్రాజెక్టు వ్యవహారం నడపుతామని ప్రజలకు చెప్పినట్లు తెలిపారు. తాగునీరు సరపరా అందక ఇబ్బందులు పడుతున్న అధికారులు ఎవరూ దానిపై కన్నెత్తి కూడా చూడలేదు. దొడ్డవరంలో 4 వేల మంది జనాభా ఉన్నారు. దాదాపు 1300 నీటి కనెక్షన్లు ఉన్నాయి. దాదాపు నెలకు రూ.2లక్షల మేరకు నిధులు సమకూరుతాయి. విద్యుత్ సరపరాకు రూ.లక్ష బిల్లు వస్తుంది. పైపలైన్ మరమ్మతులు అన్నీ కూడా చేయాల్సి ఉంటుంది. మొత్తం విద్యుత్ బకాయిలు చెల్లిస్తేనే పునరుద్ధరణ జరుగుతుందని విద్యుత్ ఏఈ సుబ్బారెడ్డి తెలిపారు. నీటి సరపరా ఆగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రమ్ము నీరు రూ.150 కొనుగోలు చేయాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం ఎంపీడీవో శ్రీహరి దృష్టికి తీసుకువెళ్లగా ఉన్నతాధికారులు సమస్యను వివరించి విచారణ చేపడతామని తెలిపారు.



మంచినీటి పథకం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు(ఫైల్)

మొక్కులు..విజయోత్సవాలు..!

ఎన్నికల్లో టీడీపీ విజయంపై తెలుగుమహిళలు, నాయకుల సంబరాలు

ఒంగోలు(కార్పొరేషన్), జూన్ 6: ఒంగోలు ఎమ్మెల్యేగా దామచర్ల జనార్దన్, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి విజయం సాధించడంతో స్థానిక కొత్తమామిడిపాలెం టీడీపీ శ్రేణులు మొక్కులు తీర్చుకుని సంబరాలు జరుపుకున్నారు. గురువారం స్థానిక రామాలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి అనంతరం కేక్ కట్ చేసి సంతోషాలను పంచుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అంజయ్య మాస్టర్, బూత్ కన్వీనర్ మేదరమెట్ల రవిచంద్రతోపాటు, శిరీషా, సృజన, లక్ష్మి, ప్రసన్న, పద్మ, సురేష్, లక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో..

నాగులుప్పలపాడు: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడంతో తెలుగు మహిళలు తమ మొక్కులు చెల్లించుకొన్నారు. ఉప్పుగుండూరుకు బెల్లం వెంకటకృష్ణాంబ గురువారం గ్రామంలోని గంగమ్మ హోటల్ కూడలి వద్ద తెలుగు మహిళలు, స్థానిక నాయకులతో కలిసి సాయిబాబా ఆలయంలో 108 టెంకాయలు కొట్టి మొక్కు చెల్లించుకొన్నారు. ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు కాట్రగడ్డ చంద్రబాబు, కనగాల శ్రీనివాసరావు బి.సెల్వం, తెలగతోటి జాన్సన్, బెల్లం సీతారామయ్య, రామకృష్ణ, పోట్లూరి నాగమల్లేశ్వరావు, మనిముక్కు భాస్కర్, కుంచాల నాగరాజు, జనసేన నాయకులు పెంట్యాల కోటి, పెంట్యాల శ్రీనివాసరావు, బాలిశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అలాగే ఉప్పుగుండూరు క్రిస్టియన్ కాలనీలో కొలకలూరి నాగార్జున ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు విజయోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పార్టీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్ హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కాట్రగడ్డ చంద్రబాబు, ఐటీడీపీ మండలాధ్యక్షుడు బెల్లం వెంకటేశ్వర్లు, మెట్టు సుబ్బయ్యనాయుడు, స్వర్ణ కిషోర్, గద్దల రమేష్, కత్తి పవన్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక గుడిలో..

టంగుటూరు: టంగుటూరు చెల్లెమ్మతోట తెలుగు మహిళలంతా వినాయక గుడిలో బుధవారం రాత్రి పొద్దుపోయాక మొక్కులు తీర్చుకున్నారు. వీరంతా సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఒక్క రోజున ఇదే గుడిలో ఈఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలు విజయం సాధించి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని మొక్కారు. వారి కోరిక ఫలించడంతో వారంతా బుధవారం రాత్రి ముందుగా అనుకున్నట్లే వినాయక గుడికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజల్లో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కామని విజయకుమార్, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, తెలుగు మహిళ నాయకురాలు తోకల భారతి పాల్గొన్నారు.



కొత్తమామిడిపాలెం మొక్కులు తీర్చుకుంటున్న నాయకులు



ఉప్పుగుండూరులో టెంకాయలు కొడుతున్న తెలుగుమహిళలు



ఉప్పుగుండూరు క్రిస్టియన్‌కాలనీలో కేక్ కట్ చేస్తున్న మనోజ్‌కుమార్



టంగుటూరులో నాయకుల పూజలు

గోదాములకు ఈవీఎంల తరలింపు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 6 : జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో సంబంధిత ఈవీఎంలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఒంగోలు నగరం మామిడిపాలెంలోని ఈవీఎం గోడౌన్‌లో భద్రపర్చినట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. జిల్లాలో ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి కావడంతో సంబంధిత ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్లను ఈవీఎంల గోడౌన్‌కు తరలించగా గురుఎవారం కలెక్టర్ దినేష్‌కుమార్, రాజకీయపార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ముగిసిన నేపథ్యంలో జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎం మిషన్లను భద్రపర్చినట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌లను కూడా జిల్లా ట్రెజరీ స్ట్రాంగ్ రూములకు తరలించి భద్రపర్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఒంగోలు, దర్శి ఆర్వోలు సుబ్బారెడ్డి, లోకేశ్వరరావు, రాజకీయ పార్టీల నాయకులు కాలేషాబేగ్, రసూల్, రాజశేఖర్, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైశ్య కార్పొరేషన్ చైర్మన్.. రాజకీయాల నుంచి తప్పుకో..!

● 12వ డివిజన్ కార్పొరేటర్ అంబూరి శ్రీను



ఒంగోలు(కార్పొరేషన్), జూన్ 6: ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వస్తుందని, ప్రత్యేకించి తాను నివసించే 12వ డివిజన్‌లో టీడీపీ కూటమికి ఒక్క ఓటు మెజారిటీ వచ్చినా శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని చాలెంజ్ చేసిన వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ మాట నిలబెట్టుకోవాలని 12వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ అంబూరి శ్రీను డిమాండ్ చేశారు. ఓట్లు లెక్కింపునకు ముందు మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరీ కుప్పం ప్రసాద్ బహిరంగంగా సవాల్ విసిరారని పేర్కొన్నారు. అయితే ఓట్లు లెక్కింపు ప్రక్రియ పూర్తయిందని, 12వ డివిజన్‌లో మొత్తం మూడు పోలింగ్ బూతులు ఉండగా, బూత్ నెం.128లో టీడీపీకి (592), వైసీపీకి (341) ఓట్లు రాగా టీడీపీ 251 మెజారిటీ సాధించిందన్నారు. అలాగే బూత్ నెం.129లో టీడీపీకి (616), వైసీపీకి (359) ఓట్లు రాగా, టీడీపీ మెజారిటీ 257 సాధించిందన్నారు. బూత్ నెం. 130లో టీడీపీకి (801), వైసీపీ (314) ఓట్లు రాగా టీడీపీ కూటమి 487 మెజారిటీతో డివిజన్ ప్రజలు గెలిపించారని చెప్పారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి రాష్ట్రవ్యాప్తంగా గెలుపు పట్టం కట్టారని, ప్రస్తుతం 12వ డివిజన్‌కు సంబంధించి ప్రసాద్ రాజీనామా చేసి రాజకీయాల నుంచి ఎప్పుడు తప్పుకుంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.

కొండపిలోని అతిథిగృహానికి మరమ్మతులు

● పోలింగ్‌కు ముందు రూ.5లక్షల ఖర్చు
● అప్పటి నుంచి వేసిన తాళాలు
● ప్రారంభించనున్న కొత్త ప్రభుత్వం



మండల పరిషత్ అతిథిగృహం

కొండపి, జూన్ 6 : గత ఏడాది డిసెంబరులో కొండపి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టిన అప్పటి మంత్రి ఆదిమూలపు సురేష్ రెండు నెలల తర్వాత పంచాయతీరాజ్ జిల్లా అధికారులకు కొండపిలోని మండల పరిషత్ అతిథి గృహానికి నిధులు కేటాయించి మరమ్మతులు చేయాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో వెంటనే పంచాయతీరాజ్ అధికారులు ఐదు లక్షల రూపాయలు మండల పరిషత్ గ్రాంటుకు కేటాయించి మరమ్మతులు చేశారు. అతిథి గృహాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఫర్నీచర్, ఏసీలు కూడా కొత్తవి కొనుగోలు చేసి ఏర్పాటు చేశారు. అతిథిగృహం మరమ్మతులు పూర్తయ్యే సమయానికి ఎన్నికల కోడ్ వచ్చింది. దీంతో ఆ అతిథి గృహంలోకి మంత్రి కాలుకూడా పెట్టలేదు. కోడ్ సమయంలో ఎన్నికల ప్రత్యేక అధికారులు కూడా వినియోగించలేదు. ప్రస్తుతం తాళాలు వేశారు. త్వరలోనే అతిథి గృహాన్ని కొత్త ప్రభుత్వం వినియోగించుకోనుందని అధికార పార్టీకి చెందిన టీడీపీ నాయకులు తెలిపారు.

అవీ..ఇవీ..

ఎంపీ మాగుంటకు అభినందనల వెల్లువ



ఎంపీ మాగుంటను పూలదండతో సత్కరిస్తున్న అభిమానులు

ఒంగోలు(కలెక్టరేట్) జూన్ 6: ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ తరుఫున ఎంపీగా గెలుపొందిన మాగుంట శ్రీనివాసులురెడ్డిని పలువురు ఘనంగా సత్కరించారు. స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో గురువారం ఒంగోలు నగరంతో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు మాగుంటను మర్యాదపూర్వకంగా కలిశారు. పూలదండలతో సత్కరించారు. మరో వైపు ఈ సారి ఎన్నికల్లో జిల్లావ్యాప్తంగా విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించిన యువనేత మాగుంట రాఘవరెడ్డిని కూడా పలు ప్రాంతాల నుంచి వచ్చిన పార్టీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

జిల్లాలో 17.4 మి.మీ వర్షపాతం

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 6: జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. గురువారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 17.4 మి.మీ వర్షపాతం నమోదైంది. యర్రగొండపాలెంలో 64.2, త్రిపురాంతకం 48.8, హనుమంతునిపాడు 46.2, పీసీపల్లి 34.0, కురిచేడు 32.0, పుల్లలచెరువు 30.8, తర్లుబాడు 28.4, మద్దిపాడు 28.2, దర్శి 26.2, వెలిగండ్ల 25.2, దొనకొండ 24.0, చీమకుర్తి 19.4, తాళ్ళూరు 17.2, సీఎస్‌పురం 12.4, సంతనూతలపాడు 11.8, కొనకనమిట్ల 11.4, నాగులుప్పలపాడులో 10.8 మి.మీ వర్షం కురిసింది. మిగిలిన మండలాల్లో కొద్దిపాటి జల్లులు పడ్డాయి.


వైద్యశాఖ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలి



కమిషనర్ కృష్ణవేణికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 6: అర్హత లేకపోయినా సదరం సర్టిఫికెట్లు తెచ్చుకొని వెహికిల్ లైసెన్సు లేకుండానే మోటార్ వాహనాలను నడుపుతున్న వైద్యశాఖ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని నవ్యాంధ్ర దివ్యాంగుల హక్కుల సేవా సమితి నాయకులు ఫిర్యాదు చేశారు. గురువారం గుంటూరులో రీజియన్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కృష్ణవేణిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఒంగోలులోని వైద్యఆరోగ్యశాఖ ప్రధానకార్యాలయంలో అకౌంటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రాజేష్ తప్పుడు సదరం సర్టిఫికెట్ తెచ్చుకున్నారని ఫిర్యాదు చేశారు. అందుకు సంబంధించిన ఆధారాలను అందజేశారు. డ్రైవింగ్ లైసెన్సు లేకపోయినా నిత్యం ట్రాఫిక్‌లో వాహనాలు నడుపుతున్నారని, దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అందువల్ల తప్పుడు సర్టిఫికెట్‌తో వాహనం నడుపుతున్న రాజేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాలేషా, దూపాటి రమణయ్య, సాయికుమార్, రహిం పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న డీఈవో సుభద్ర

ఒంగోలు(విద్య), జూన్ 6: ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాల ద్వారా తమ వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని డీఈవో సుభద్ర కోరారు. మైనంపాడులోని డైట్‌లో గురువారం ప్రారంభమైన ఎఫ్‌ఎల్‌ఎన్ జ్ఞాన ప్రకాష్ శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. డీఆర్పీలు శిక్షణలో చురుకుగా పాల్గొని తద్వారా మూడు స్థాయిల్లో జరగబోయే శిక్షణ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. డైట్ సీనియర్ అధ్యాపకులు సోమా సుబ్బారావు మాట్లాడుతూ అసిస్టెంట్ టాల్‌పై శిక్షణ పొందిన డీఆర్పీలు మండల స్థాయిలో టీచర్లకు ఆరు రోజుల పాటు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈ శిక్షణలో 114 మంది డీఆర్పీలు హాజరయ్యారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎంవో రమేష్, ఎంఈవోలు శివాజీ, బాలాజీ, జిల్లా కో ఆర్డినేటర్ ఎం.సుబ్బారావు, ఎం.రవీంద్రప్రసాద్, నర్మదాదేవి, సంజీవరావు, పావని, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ మూల్యాంకనం ప్రారంభం

ఒంగోలు(విద్య), జూన్ 6: పదో తరగతి అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఒంగోలులోని డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో గురువారం ప్రారంభమైంది. తెలుగు, ఇంగ్లీషు, హిందీ, ఫిజికల్ సైన్స్ బయలాజికల్‌కు సంబంధించి వివిధ జిల్లాల నుంచి 9వేల జవాబు పత్రాలు మూల్యాంకానికి ఇక్కడకు వచ్చాయి. పేపర్లు దిద్దేందుకు 13మంది చీఫ్ ఎగ్జామినర్లు, 70మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 26మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు. ఆదివారం వరకు ఈ మూల్యాంకనం గడువు ఇవ్వగా ఒక రోజు ముందుగానే మూల్యాంకనం ముగుస్తుందని డీఈవో సుభద్ర తెలిపారు. కాగా గణితం సబ్జెక్టు జవాబుపత్రాల మూల్యాంకనం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ జవాబుపత్రాలు ఆన్‌లైన్ ట్యాబ్‌ల ద్వారా మూల్యాంకనం చేస్తారు. అందుకు సంబంధించి జవాబుపత్రాలను స్థానిక డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో ప్రత్యేకంగా స్కానింగ్ చేస్తారు. ముల్యాంకనానికి 50 మంది గణితం స్కూలు అసిస్టెంట్లను ఎంపిక చేసి వివరాలను డీఈవో వెబ్‌సైట్‌లో ఉంచారు.

ఓపెన్‌స్కూల్ పరీక్షలకు 66 మంది గైర్హాజరు

ఒంగోలు(విద్య), జూన్ 6 : జిల్లాలో జరుగుతున్న ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు గురువారం 66మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 500మంది హాజరు కావాల్సి ఉండగా 434 మంది పరీక్ష రాశారు. ఇంటర్ గణిత పరీక్షకు 408కి గాను 358 మంది హాజరు కాగా, 50 మంది గైర్హాజరయ్యారు. హిస్టరీ పరీక్షకు 92కి 70 మంది హాజరు కాగా 6 మంది గైర్హాజరయ్యారు. పదో తరగతి గణితం పరీక్షకు 483 మందికి గాను 394 మంది హాజరు కాగా, 89 మంది గైర్హాజరయ్యారైనట్లు ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శివకుమార్ తెలిపారు.

24నుంచి టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 6: ఒంగోలులోని రూట్‌సెట్ సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రామీణ ప్రాంత నిరుద్యోగ మహిళలకు ఈనెల 24 నుంచి వచ్చేనెల 23వతేదీ వరకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పొందాలనుకునే మహిళలు 18నుంచి 45 ఏళ్ళమధ్య ఉండాలని, శిక్షణతో పాటు భోజనం, వసతి ఉచితంగా అందించనున్నారు. వివరాలకు 9573363141, 9492583484 సెల్ నంబర్లలో సంప్రదించాలని నిర్వహకులు కోరారు.

మైనార్టీ విద్యార్థుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సంతనూతలపాడు, జూన్ 6: 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి వివిధ జిల్లాల్లోని మైనార్టీ గురుకుల విద్యాలయాల్లో నేరుగా 5వ తరగతి, అలాగే 6, 7 ,8 తరగతులకు సంబంధించి మిగిలి ఉన్న సీట్ల ఖాళీలకు, మైనార్టీ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల విద్యాలయాల జిల్లా కన్వీనర్ డి.నాగేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాల కోసం విజయవాడ మైనార్టీ బాలికల గురుకుల విద్యాలయం సెల్-8712625036, 8712625038(గుంటూరు), 8712625045 (నెల్లూరు), అలాగే గుంటూరు బాలుర మైనార్టీ జూనియర్ కళాశాల సెల్-8712625073, చిత్తూరు, వాయల్‌పాడు బాలికల మైనార్టీ జూనియర్ కళాశాల సెల్- 8712625077 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

పంచాయతీరాజ్ వ్యవస్థకు మంచిరోజులు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 6: ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వంలో రానున్న రోజుల్లో పంచాయతీరాజ్ వ్యవస్థకు మంచి రోజులు రానున్నాయని సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీరభద్రాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీరాజ్, స్థానిక సంస్థలు నిర్వీర్యం అయ్యాయన్నారు. చంద్రబాబు నాయకత్వంలో స్థానికసంస్థలు స్థానిక ప్రభుత్వాలుగా చాంబర్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ సహకారంతో గుర్తించబడతాయన్న ధీమాను వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ శ్రీకాకుళం ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆ జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు శంకర్, అనంతపురం ఎమ్మెల్యేగా దగ్గుమాటి ప్రసాద్, విజయనగరం ఎంపీగా ఎన్నికైన పంచాయతీరాజ్ చాంబర్ కార్యదర్శి అప్పలనాయుడు విజయం సాధించడం పట్ల శుభాకాంక్షలు తెలిపారు.

ప్రత్యేక అవసరాల పిల్లలు భవితకు బాటలు

మద్దిపాడు, జూన్ 6: ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి వారిని భవిత కేంద్రాల్లో చేర్పించే పనుల్లో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. వేర్వేరు కారణాలతో చదువుకు దూరంగా ఉంటున్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. ఈనెల 9వ తేదీ వరకు ఈ సర్వే కొనసాగుతుందని ఎంఈవో ఆంజనేయులు గురువారం తెలిపారు. తల్లిదండ్రులకు అవగాహన లేక బిడ్డల భవిష్యత్‌పై నిర్లక్ష్యం వహిస్తున్నారని, వారిని ఒప్పించి భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఎవరు గెలిచినా..మీదే గెలుపు..!

ఆంధ్రజ్యోతి కూపన్ల పోటీలో జిల్లా స్థాయి విజేతల గుర్తింపు

మొదటి స్థానంలో నిలిచిన మార్కాపురం వాసి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారనే విషయంపై ప్రజల నాడి తెలుసుకునేందుకు ఆంధ్రజ్యోతి నిర్వహించిన కూపన్ల పోటీలో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో మార్కాపురానికి చెందిన ఎం.గుల్జార్ నిలిచారు. ఇటు జిల్లా స్థాయిలోనూ, అటు రాష్ట్ర స్థాయిలోనూ విజేత ఎవరో ఊహించాలో చెప్పాలంటూ ఆంధ్రజ్యోతిలో కూపన్లు ప్రచురించిన సంగతి తెలిసిందే. జిల్లా స్థాయిలో విజేతలన గుర్తించేందుకు వచ్చిన కూపన్లలో కచ్చితమైన ఫలితాలను ముందుగానే పేర్కొన్న కూపన్లను గురువారం సాయంత్రం త్రోవగుంట వద్ద ఉన్న ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో డ్రా తీశారు. పెద్ద సంఖ్యలో వచ్చిన కూపన్లలో సరైన ఫలితాలను చూచించిన కూపన్లను ఎంపిక చేశారు. జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలు టీడీపీకి, రెండు స్థానాలు వైసీపీకి దక్కనున్నాయని అనేక మంది వారి కూపన్లలో పేర్కొన్నారు. కొందరు మాత్రం ప్రస్తుతం టీడీపీ ఏ స్థానాల్లో గెలిచేది, వైసీపీ ఏ స్థానాల్లో గెలిచేది స్పష్టంగా గుర్తించారు. అలా అన్ని స్థానాలను కచ్చితంగా గుర్తించిన కూపన్ల నుంచి నలుగురిని డ్రా ద్వారా ఎంపిక చేశారు. బ్రాంచ్ మేనేజర్ ఐవీ.సుబ్బారావు తీసిన డ్రాలో మొదటి విజేతగా మార్కాపురంలోని గోర్లగడ్డ ప్రాంతానికి చెందిన ఎం.గుల్జార్ నిలిచారు. రెండో స్థానంలో ముగ్గురి ఎంపిక చేసేందుకు తీసిన డ్రాలో మార్కాపురానికే చెందిన బి.రాజేష్, కనిగిరిలోని సుభాష్ రోడ్డు ప్రాంతానికి చెందిన బచ్చలి వెంకటనాగలక్ష్మి, పెద్దారవీడు మండలం ఎస్.కొత్తపల్లికి చెందిన తిరుమలరెడ్డి లక్ష్మీదేవి నిలిచారు. మొదటి విజేతకు రూ.10వేలు, రెండో స్థానంలో నిలిచిన ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఇవ్వనున్నట్లు బీఎం సుబ్బారావు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో విజేతలను గుర్తిస్తూ వచ్చిన కూపన్ల డ్రా విజయవాడ కార్యాలయంలో జరుగుతుందని, అందులో తొలి స్థానంలో నిలిచిన వారికి రూ.లక్ష, రెండో స్థానంలో నిలిచిన వారికి రూ.50వేలు, ఆ తర్వాత స్థానంలో నిలిచిన ఐదుగురికి రూ.10 వేల చొప్పున అందించనున్నట్లు తెలిపారు. ఈ డ్రా కార్యక్రమంలో ఎడిటోరియల్ ఇన్‌చార్జి ఆళ్ల శ్రీనివాసులు, ఏసీఎం రమణ, సాంకేతిక విభాగం ఇన్‌చార్జి రామకోటేశ్వరరావు, ప్రొడక్షన్ ఇన్‌చార్జి ఉమా తదితరులు పాల్గొన్నారు.



విజేత కూపన్‌ను చూపిస్తున్న బీఎం ఐవీ.సుబ్బారావు

ఎమ్మెల్యే స్వామికి పలువురి సన్మానం

కొండపి, జూన్ 6 : కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని పొన్నలూరు, కొండపి, జరుగుమల్లి మండలాలకు చెందిన పలుగ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గురువారం తూర్పునాయుడుపాలెంలోని ఆయన స్వగృహంలో కలిసి శాలువాలు కప్పి, పూలమాలలతో సన్మానించారు. పొన్నలూరు మండల పార్టీ అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, పలు గ్రామాల నాయకులు కలిశారు. కొండపికి చెందిన ఆది ఆంధ్ర కాలనీవాసులు, కొండపికి చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు స్వామిని కలిశారు. జరుగుమల్లి మండలానికి చెందిన పలు గ్రామాల నాయకులు కూడా స్వామిని సన్మానించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావును ఒంగోలులో కలిశారు.



ఎమ్మెల్యే స్వామిని కలిసి అభినందిస్తున్న పొన్నలూరు నాయకులు

మద్యం మత్తులో లైన్‌మన్ వీరంగం

మద్దిపాడు, జూన్ 6: ప్రజలకు సేవలందించాల్సిన ప్రభుత్వ ఉద్యోగి మద్యం మత్తులో కారుతో మద్దిపాడు సర్వీస్ రోడ్‌లో వీరంగం సృష్టించాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇనమనమెళ్లూరు సచివాలయంలో ఎ.సీతారామ్ లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం 5గంటల సమయంలో మద్యం మత్తులో మద్దిపాడు సర్వీస్ రోడ్‌లో అడ్డదిడ్డంగా కారును నడుపుతూ వాహనదారులను భయాందోళనకు గురిచేశాడు. స్థానిక కొష్టాలుసెంటర్ వద్ద టైలర్ షాప్ వద్దకు అర్ధనగ్నంగా వెళ్లి తనకు దుస్తులు కుట్టాలని, కొలతలు తీసుకోమని గొడవ చేశాడు. ఈ సంఘటనపై ఎస్సై మహేష్‌కు స్థానికులు సమాచారం అందించటంతో అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కారులో హల్‌చల్ చేస్తున్న సీతారామ్

ఎమ్మెల్యే బీఎన్‌కు అభినందనల వెల్లువ

నాగులుప్పలపాడు, జూన్ 6 : ఎమ్మెల్యేగా బీఎన్. విజయ్‌కుమార్ గెలుపొందడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు అభినందనలు తెలిపేందుకు బారులు తీరుతున్నారు. మండల పరిధిలోని ఉప్పుగుండూరు, ఓబన్న పాలెం, మద్దిరాలపాడు గ్రామాలకు చెందిన నాయకులు గురువారం ఒంగోలులోని బీఎన్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి బొకేలు అందించి శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఓబన్నపాలెం సర్పంచ్ పోలినేని వెంకటేశ్వర్లు, కట్టా వెంకటేశ్వర్లు, కట్టా అంజయ్య, గుమ్మడి సాయిబాబు, షేక్ ఖాజావలి, సర్పంచ్ స్వర్ణ అనురాధ, పెనుబోతు సునీల్, నెప్పల శివకృష్ణ, తాళ్లూరి ఆంజనేయులు, కనగాల శ్రీనివాసరావు, బి.సెల్వం, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



బీఎన్‌కు బొకే ఇస్తున్న ఎన్‌జీపాడు నాయకులు

జయంత్‌బాబు ఆధ్వర్యంలో..

మద్దిపాడు: మండలంలోని దొడ్డవరం, నందిపాడు, పెద్దకొత్తపల్లి, లింగంగుంట, మల్లవరం, వెల్లంపల్లి గ్రామాల టీడీపీ నాయకులు గురువారం పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్ బాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌ను కలిసి అభినందించారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ రావూరి వెంకటేశ్వర్లు, పోతినేని శ్రీనివాసరావు, నర్రా సురేష్, వడ్డంపూడి శ్రీనివాసరావు, అడక స్వాములు, సురేంద్రబాబు, నాగన్నపాలెం సర్పంచ్ కాకర్ల విజయ్‌కుమార్, పోతుల శ్రీరామమూర్తి, మండవ ప్రతాప్, కొర్రపాటి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల పాదయాత్ర

నాగులుప్పలపాడు, జూన్ 6 : ఎమ్మెల్యేగా బీఎన్.విజయ్‌కుమార్ గెలుపొందడంతో బి.నిడమనూరు అంబేడ్కర్‌కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్తలు గురువారం శింగరకొండకు పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో గారపాటి చిరంజీవి, గారపాటి శ్రీను, చిరంజీవి, రామకృష్ణ, బాలకృష్ణ, పైడి రామాంజనేయులు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



శింగరకొండకు బయలుదేరిన నాయకులు

తిరుమలలో దామచర్ల కుటుంబం



కుటుంబసభ్యులతో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 6 : ఒంగోలు ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలుపొందిన దామచర్ల జనార్దన్ గురువారం తిరుమలలోని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించడంతోపాటు ప్రజల ఆశీర్వాదాలు అందుకున్న దామచర్ల విజయం సాధించిన అనంతరం కుటుంబసభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు.

వర్షంతో రైతుల్లో ఆనందం

- పచ్చిరొట్ట ఎరువుల పంటల సాగుకు సమాయత్తం

టంగుటూరు, జూన్ 6 : మండలంలో గురువారం భారీ వర్షం కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గంటన్నరపాటు ఏకబిగిన భారీ వర్షం పడగా.. మరికొన్ని గంటలపాటు మోస్తరు వర్షం కొనసాగింది. ఈ వర్షానికి టంగుటూరు చుట్టుపక్కల పొలాలన్నీ పదునయ్యాయి. ప్రస్తుతం రైతులంతా పచ్చిరొట్ట ఎరువు పంటలు, నువ్వును సాగు చేయాలని చూస్తున్నారు. ఇప్పటికే గత నెలలో పడిన వానల ఆధారంగా కొంతమేర పొలాల్లో నువ్వు చల్లారు. ప్రస్తుతం ఈవర్షం వాటికి ఎంతో అనుకూలం. నువ్వు పంట అనుకూలంగా వస్తే కోసుకోవడం లేదంటే పచ్చిరొట్ట ఎరువుగా దున్నేందుకు సిద్ధ పడి సాగుకు సన్నద్ధమయ్యారు. ఇక పచ్చిరొట్ట ఎరువుల పంటలైన జనుము, పిల్లిపెసర సాగు ఎప్పుడెప్పుడా అని రైతులు ఎదురు చూస్తున్నారు. గత నెలలోనే జనుము విత్తనాలు ప్రభుత్వం సబ్సిడీ ధరలకు రైతులకు మండలమంతా విస్తారంగా పంపిణీ చేశారు. మొత్తం 100 క్వింటాళ్ల జనుము విత్తనాల పంపిణీ జరిగింది. ఇంకా అవసరమైతే ప్రభుత్వం నుంచి జనుము విత్తనాలు తెప్పించి సబ్సిడీ ధరలకు పంపిణీ చేసేందుకు వ్యవసాయ సిబ్బంది సిద్ధంగా ఉన్నట్లు ఏవో స్వర్ణలత చెప్పారు. పిల్లిపెసర 10 క్వింటాళ్ల విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేశామన్నారు. సబ్సిడీ ధరలకు రైతులకు పంపిణీ జరిగిన జనుము, పిల్లిపెసర విత్తనాలను పొలాల్లో చల్లేందుకు రైతులు సిద్ధపడుతున్నారు. ప్రస్తుత వర్షంతో రైతులు ఆనందపడుతున్నారు. గురువారం మధ్యాహ్నం సుమారు 6.5సెంమీ వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయ శాఖ సమాచారం తెలిపింది.



కాకుటూరివారిపాలెంలో పదునైన పొలాలు

బెట్టింగులతో నిండా మునిగారు..

- భారీగా కోల్పోయిన వైసీపీ అభిమానులు
- తొలుత పందేలకు వెనుకంజ
- జగన్ ప్రకటన, ఆరా సర్వే అనంతరం ముందుకు..
- ఫలితాల ప్రకటన తర్వాత లబోదిబో

కొండపి, జూన్ 6 : సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అభిమానులు ఈసారి పందేలు కాసి భారీగా నష్టపోయారు. మొదటి నుంచి ఫలితాలపై అనుమానంగానే ఉన్నప్పటికీ పోలింగ్ అనంతరం జగన్ ప్రకటనలు, ఆరా మస్తాన్ సర్వేతో పెద్దమొత్తంలో పందేలు కాశారు. ఇప్పుడు వీరంతా నిండా మునిగి లబోదిబోమంటున్నారు. టీడీపీ కూటమి వైపు వివిధ రకాలు పందేలు వేసిన వారంతా గెలిచారు. గ్రామాల వారీగా వేసిన పందేలు కూడా కూటమి అభిమానులకే వచ్చాయి. రాష్ట్రంలో అధికారంలోకి టీడీపీ కూటమి వస్తుందని, ఒంగోలు ఎంపీ స్థానాన్ని టీడీపీ కైవసం చేసుకుంటుందని, కొండపి ఎమ్మెల్యేగా స్వామి మెజారిటీ 5వేలకు మించదన్న విషయమై బెట్టింగ్‌లు నడిచాయి. వీటన్నింటినీ టీడీపీ అభిమానులు గెలుచుకున్నారు. కోట్ల రూపాయల్లో వైసీపీ అభిమానులు పందేల రూపంలో పోగొట్టుకున్నారు. కొండపి మండలంలో వైసీపీకి తలకాయగా ఉండే గ్రామంలో అభిమానులైన మహిళలు వైసీపీ అధికారంలోకి వస్తుందని దాదాపు రూ.2 కోట్లకుపైగా పందేలను తమ భర్తలను ప్రోత్సహించి వేయించినట్లు తెలిసింది. ఈగ్రామంలో పందేలు వేసిన వారంతా నిండా మునిగారు. మండలంలోని కొండపి, పెట్లూరు, అనకర్లపూడి, పెరిదేపి, ముప్పవరం, వెన్నూరు, కట్టుబడివారిపాలెం గ్రామ పంచాయతీల్లో బూత్‌లు, గ్రామ పంచాయతీల వారీగా మెజారిటీలపై వైసీపీ అభిమానులు వేసిన అన్ని పందేలను టీడీపీ అభిమానులు గెలుచుకున్నారు. మండలాల వారీగా మెజారిటీపై బెట్టింగ్‌లు కాచిన వైసీపీ అభిమానులు అన్ని చోట్లా పందేలు కోల్పోయారు.

చీమకుర్తిలో టీడీపీకి 7,640 ఓట్ల భారీ మెజార్టీ

వైసీపీ కంచుకోటలు బద్దలు ● అంచనాలు తారుమారు ● మున్సిపాలిటీలో 3,986.. రూరల్‌లో 3,654 ఓట్లు టీడీపీకి ఆధిక్యం

చీమకుర్తి, జూన్ 6: సంతనూతలపాడు నియోజకవర్గంలో టీడీపీ విజయదుందుభి మోగించింది. కూటమి అభ్యర్థిగా బరిలో దిగిన బీఎన్.విజయ్‌కుమార్ ఘనవిజయం సాధించారు. వైసీపీకి కంచుకోటగా ఉన్న చీమకుర్తి మున్సిపాలిటీ, మండలంలోని గ్రామాల్లో టీడీపీకి భారీ మెజార్టీ రావడం విశేషం. మున్సిపాలిటీ పరిధిలోని 24 పోలింగ్ కేంద్రాల్లో 3,986 ఓట్ల మెజార్టీ లభించింది. అలాగే మండలంలోని 25పంచాయతీల పరిధిలో 3,654ఓట్ల మెజార్టీతో మొత్తం చీమకుర్తి మండలంలో 7,640 ఓట్ల ఆధిక్యం దక్కింది. కాగా బాపట్ల లోక్‌సభ టీడీపీ అభ్యర్థి తేనేటి కృష్ణప్రసాద్‌కు చీమకుర్తి మండలంలో 7,519 ఓట్ల మెజార్టీలభించింది. వైసీపీకి కంచుకోటలాంటి చీమకుర్తిలో ఆ పార్టీ నాయకుల అంచనాలను టీడీపీ తలకిందులు చేసింది. కాగా 2019లో చీమకుర్తి మండలంలో వైసీపీకి 5612ఓట్ల మెజార్టీ రాగా, నేడు ఈ ఫలితాలు పూర్తిగా తారుమారయ్యాయి. చీమకుర్తి పట్టణంతోపాటు 20 పంచాయతీల్లో టీడీపీకి మెజార్టీ రాగా కేవలం చంద్రపాడులో(122), దేవరపాలెంలో(81), ఇలపావులూరులో(32), నేకునంబాదులో(27)మాత్రమే వైసీపీకి మెజార్టీ లభించింది. గత ఎన్నికల్లో వైసీపీకి భారీ మెజార్టీ వచ్చిన బండ్లమూడి, పల్లామల్లి, మంచికలపాడు, నాయుడుపాలెం, ఆర్ఎల్.పురం, చినరావిపాడు గ్రామాల్లో ఈసారి టీడీపీకి భారీ మెజార్టీ లభించటం విశేషం.

అసెంబ్లీకి గ్రామాల వారీగా టీడీపీకి లభించిన ఆధిక్యత వివరాలు ..

చీమకుర్తిటౌన్- 3986, నిప్పట్లపాడు-167, పల్లామల్లి-178, బూదవాడ-418, నాయుడుపాలెం-167, గాడిపర్తివారిపాలెం-73, తొర్రగుడిపాడు-34, బండ్లమూడి-161, ఎర్రగుడిపాడు-21, మంచికలపాడు-253, చీమలమర్రి-129, మైలవరం-114, పులికొండ-134, ఆర్ఎల్‌పురం-216, చినరావిపాడు-122, బూసరపల్లి-250, మువ్వావారిపాలెం-176, మర్రిపాలెం-43, కేవీపాలెం-353, ఏలూరివారిపాలెం-212, గోనుగుంట-358, గుడిపూడివారిపాలెం-140, జీఎల్‌పురం-193, పిడతలపూడి-93, రామచంద్రాపురం-9 ఓట్లు టీడీపీకి మెజార్టీ వచ్చాయి.

చీమకుర్తిలో మిన్నంటిన సంబరాలు



చీమకుర్తి అంబేడ్కర్‌నగర్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయఢంకా మోగించటంతో చీమకుర్తి పట్టణంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో సంబరాలు మిన్నంటాయి. పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌లో అభిమానులు తమ మొక్కులను తీర్చుకున్నారు. నాయకులు యడ్లపల్లి రామబ్రహ్మం, కాట్రగడ్డ రమణయ్య, గంగుల శివపార్వతి, బత్తుల రమణలు పాల్గొన్నారు. కాగా చీమకుర్తి పట్టణానికి చెందిన పరాల శ్రీను నారా చంద్రబాబునాయుడు సీఎం కావాలని, బీఎన్.విజయ్‌కుమార్ గెలుపును కాంక్షిస్తూ శ్రీశైలంలో చండీయాగం నిర్వహించారు.

టీడీపీ శ్రేణుల విజయోత్సవాలు

- కేకులు కట్ చేసి అభిమానం చాటుకున్న కార్యకర్తలు
- ముస్లిం మైనారిటీ వర్గాల్లోనూ గెలుపు సంబరం



కంభంలో కేకు కట్ చేస్తున్న టీడీపీ శ్రేణులు

కంభం, జూన్ 6 : రాష్ట్రంలో టీడీపీ కూటమి అభ్యర్థులు ఘనవిజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు విజయోత్సవ సంబరాలు చేసుకున్నాయి. ముఖ్యంగా వైసీపీ రాక్షసపాలన పోయి టీడీపీ అఖండ మెజారిటీతో గెలుపొందిన సందర్భంగా మండలంలోని టీడీపీ నాయకులు మూడు రోజులుగా బాణాసంచా కాలుస్తూ, సంబరాలు చేసుకున్నారు. గురువారం కంభం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో టీడీపీ ఎస్ఆర్ఐ విభాగం నాయకులు సయ్యద్ రఫి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ కేక్‌ను కట్ చేశారు. బస్టాండ్ ఆవరణలో లడ్డు, మిఠాయిలు పంచిపెట్టారు. రఫి మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాలలో పూర్తిగా వెనుకబడిందన్నారు. రాష్ట్రాన్ని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు గాడినపెట్టి ప్రజల కష్టాలు తీరుస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు సయ్యద్ అనీస్‌అహమ్మద్, రాష్ట్ర మైనారిటీసెల్ నాయకులు దాదా, టీడీపీ నాయకులు కొత్తపల్లి శ్రీనివాసులు, కేతం శ్రీనివాసులు, ఎస్సీసెల్ నాయకులు గోన చెన్నకేశవులు, ఎన్‌టిఆర్‌గౌస్, బిజ్జాల కిశోర్, సోమయ్య, రమణ, ఫయాజ్, పాల్గొన్నారు.



మార్కాపురంలో కార్యకర్తలకు కేకు తినిపిస్తున్న మౌలాలి

ప్రజాసంక్షేమమే టీడీపీ ధ్యేయం

పొదిలి : ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయమని ముస్లిం మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ రసూల్ మహమ్మద్ అన్నారు. టీడీపీ పాలనలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందన్నారు. వైసీపీ పాలన దుర్మార్గం, దోపిడితోనే సాగిందని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. రాజధాని లేని రాష్ట్రంగా చేశాడన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలేయడంతో సుమారుగా 20 ఏళ్లు వెనక్కు పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. వాటన్నిటి నుంచి రాష్ట్రాన్ని కాపాడేందుకు ప్రజలు జూన్ 4న చంద్రబాబు నాయుడికి స్పష్టమైన తీర్పును ఇచ్చారన్నారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ముస్లిం మైనారిటీలు టీడీపీని ఆదరించడంతో అభినందించారు. చంద్రబాబునాయుడి సారధ్యంలోనే ఏపీ అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు.

కార్యకర్తల కృషి ఫలితంతో టీడీపీ విజయం

మార్కాపురం : సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించడానికి ముఖ్యకారణం కార్యకర్తల కృషే నని పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ మౌలాలి అన్నారు. స్థానిక పట్టణ పార్టీ కార్యాలయంలో గురువారం 13వ బ్లాకుకు చెందిన తెలుగు యువత కార్యకర్తలు కేక్ కత్తి రించి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మిఠాయి లు పంచారు. పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో కార్యకర్తలు మనోధైర్యాన్ని కోల్పోకుండా శక్తివంచన లేకుండా పనిచేశారని మౌలాలి అన్నారు. టీడీపీ కార్యకర్తలు క్రమశిక్షణ కలిగిన సైనికుల్లాంటివారిని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు మేడికొండ వెంకటేశ్వర్లు, పూసల ప్రసాద్, వెంకటరెడ్డి, వేణుకుమార్, నరేంద్ర, విజయ్ పాల్గొన్నారు.



పొదిలిలో టీడీపీ శ్రేణుల విజయోత్సవం

న్యాయవాదుల ఆధ్వర్యంలో సంబరాలు

పొదిలి : టీడీపీ అఖండ విజయం సాధించిన సందర్భంగా పట్టణంలోని 8వ వార్డు టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీకేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. రాష్ట్ర టీడీపీ లీగల్‌సెల్ కార్యదర్శి ఎస్ఎం బాషా ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పసుపు రంగులు చల్లుకుంటూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. తమ అభిమాన నాయకుడు చంద్రబాబునాయుడు మళ్లీ ముఖ్యమంత్రిగా, కందుల నారాయణరెడ్డి ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలుపొంది అసెంబ్లీలో అడుగుపెడుతున్న సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలుపుతూ కేక్‌కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు.

ముస్లింలు అండగా నిలిచారు : హుస్సైన్‌బేగ్



మార్కాపురం వన్ టౌన్ : రాష్ట్రంలోని ముస్లింలు అంతా ఏక పక్షంగా ఉండి టీడీపీకి అండగా నిలిచారని ఆంధ్రప్రదేశ్ మైనార్టీల హక్కుల పరిరక్షణ సమితి మార్కాపురం డివిజన్ అధ్యక్షులు మొఘల్ జాబిర్ హుస్సేన్‌బేగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ ఘన విజయం సాధించడంలో మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి కీలక పాత్ర పోషించిందని, సమితి రాష్ట్ర అధ్యక్షు లు ఫారుక్ షుబ్లి ముఖ్యభూమిక పోషించారని అన్నారు. రాష్ట్రంలో రాక్షస, అవినీతి పాలనను అంతం చేసి ప్రజాపాలన వచ్చేలా ప్రజలంతా ఏకమయ్యారని అన్నారు. టీడీపీతోనే రాష్ట్రంలో మైనార్టీల అభివృద్ధి సాధ్యం అన్నారు.

అవీ..ఇవీ..

పాఠశాలలకు చేరిన పాఠ్యపుస్తకాలు



పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో చంద్రమౌళి

కొమరోలు, జూన్ 6: మార్కాపురం డివిజన్ పరిధిలోని అన్ని మండలాలకు 90 శాతం పాఠ్యపుస్తకాలు చేర్చామని డిప్యూటీ డీఈవో చంద్రమౌళి అన్నారు. స్థానిక ఎంఆర్సీ కార్యాలయాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని దోర్నాల, అర్ధవీడు, పుల్లలచెరువు మండలాల్లో టీచర్ల కొరత ఉందని ఆ కొరతను త్వరలో సర్దుబాటు చేస్తామన్నారు. కొమరోలు మండలంలోని నల్లగుంట్ల ఎయిడెడ్ పాఠశాలను విద్యార్థులు లేని కారణంగా పూర్తిగా తొలగించామన్నారు. విద్యార్థులు గ్రామంలో కనీసం 20 మంది ఉంటే తల్లితండ్రులు, ఆ గ్రామ సర్పంచ్‌లు కలసి మా గ్రామంలో పాఠశాల కావాలని తీర్మానం చేసి తమ దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. గోపానిపల్లి గ్రామంలోని ఎబీఎం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఈ సంవత్సరం విద్యార్థులు రాకపోతే ఇక్కడ పనిచేస్తున్న ఏడుగురు ఉపాధ్యాయులను వేరే పాఠశాలలకు బదిలీ చేస్తామన్నారు. ఈ నెల 12న అన్ని ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమవుతాయన్నారు. ఆ లోపు ఉపాధ్యాయులు గ్రామాల్లో తిరిగి విద్యార్థులను చేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు కావడి వెంకటేశ్వర్లు, జింకా వెంకటేశ్వర్లు, బోర్రావెంకటరత్నంలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష అట్టల అందజేత

గిద్దలూరు, జూన్ 6 : పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో 20 రోజులుగా జరిగిన వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం ముగిసింది. ముగింపు సభకు డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వర్‌రావు, ఎంఈవోలు జె.వెంకటేశ్వర్లు, ఎ.వెంకటేశ్వర్లు హాజరయ్యారు. శిక్షణలో పాల్గొన్న వారికి బహుమతులు, పరీక్ష అట్టలు అందజేశారు. సెలవు రోజుల్లో ఖాళీగా ఉండకుండా శిక్షణ శిబిరంలో పాల్గొనడం ద్వారా స్పోకెన్ ఇంగ్లీషు, కథలు రాయడం, చదవడం, వివిధ రకాల ఆటల పోటీల్లో అవగాహన పెరిగినట్లు విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాచర్లలో..

రాచర్ల గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగిసింది. స్పోకెన్ ఇంగ్లీషు, మ్యూజికల్ చైర్, క్రికెట్, చదరంగం పోటీల్లో విజేతలైన వారికి గ్రంథపాలకుడు శ్రీధర్‌రెడ్డి బహుమతులు అందజేశారు.

వేసవి శిక్షణతో విద్యార్థులకు మేలు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ మధుసూదన్

మార్కాపురం వన్ టౌన్, జూన్ 6: విద్యా ర్థులకు వేసవి విజ్ఞాన శిబిరాలు ఎంతో ఉప యోగకరమని శ్రీసాధ న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కప్పగంతుల మధుసూధన్ అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో 20 రోజులుగా నిర్వహి స్తున్న వేసవి విజ్ఞాన శిబిరం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు మధుసూధన్ అందజేశారు. గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరమన్నారు. విద్యార్థులతో పుస్తకాలు చదివించటం, సమీక్ష చేయించడం, కథలు చెప్పించటం, చదరంగం నేర్పించటం మెదడుకు మేతపెట్టే ఆటలు నేర్పించటం ద్వారా వారిలో కావాల్సిన విజ్ఞానం పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త కొల్లి విజయలక్ష్మీ, గ్రంథపాలకుడు శివారెడ్డి పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

కొమరోలు, జూన్ 6: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని మండల విద్యాశాఖాధికారి బోర్రా వెంకటరత్నం అన్నారు. మండలంలోని రెడ్డిచర్ల, మల్లారెడ్డిపల్లి గ్రామాల్లోని దివ్యాంగ పిల్లలను ఐదుమందిని గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ వెంకటరత్నం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటరత్నం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల్లో చేర్పిన విద్యార్థులకు ఉచితంగా పాఠపుస్తకాలు, బట్టలు, బూట్లు, బ్యాగులను మధ్యాహ్నభోజన వసతిని కల్పిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి పేద తల్లిదండ్రులు గుర్తించి ప్రభుత్వ పాఠాలల్లో కార్పోరేట్ విద్యను ఇంగ్లీషు మీడియంలోనే బోధిస్తున్నామన్నారు. అంగవికలింగులకు ప్రత్యేక శిక్షనను ఇంటివద్దకే వచ్చి విద్యను బోధించబడుతుందన్నారు. కార్యాక్రమంలో ఐఈడీ ఎంఆర్పీ శ్రీనివాసరెడ్డి, సీఆర్పిలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

పెద్ద దోర్నాల, జూన్ 6 : గ్రంథపఠనంతో పాటు తరచూ నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలు విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందింపజేస్తాయని రేంజి అధికారి విశ్వేశ్వరరావు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆటల పోటీలు, చిత్రలేఖనం, ఇంగ్లీషులో మాట్లాడటం, కథలుచెప్పడం వంటి అంశాలో పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వీ నాగమూర్తి, పెద్దారవీడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాల సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఉడుముల కోటకు బీటలు

- 2019లో వైసీపీకి 5 వేలకుపైగా ఆధిక్యం
- 2024లో టీడీపీకి 619 ఓట్లు మెజారిటీ
- సగం పంచాయతీల్లో టీడీపీ ముందంజ

మార్కాపుం, జూన్ 6: మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని కొనకనమిట్ల మండలం ఉడుముల కుటుంబానికి కంచుకోట. రాజకీయంగా వారు ఎటువుంటే ఆ పార్టీనే ఆ మండల ప్రజలు ఆదరిస్తారు. ఆ మండలంపై ఉడుముల కుటుంబానిదే రాజకీయ పెత్తనం. కానీ 2024 సార్వత్రిక ఎన్నికలలో ఉడుముల కోటలో కందుల పాగా వేశాడు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి రాజకీయ సునామీకి ఉడుముల కోటకు బీటలు పడ్డాయి. మండలంలో మొత్తం 38572 మంది ఓటర్లున్నారు. వారిలో 35031 ఓట్లు పోలయ్యాయి. మండలంలోని 26 పంచాయతీలలో 13 పంచాయతీలలో టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డికి ఆధిక్యత లభించింది. 13 పంచాయతీలలో వైసీపీ అభ్యర్థి అన్నా రాంబాబుకు స్వల్ప మెజార్టీ వచ్చింది. కొనకనమిట్ల మండలంలో వైసీపీకి 2019 ఎన్నికలలో 5 వేలకు పైగా మెజార్టీ వచ్చింది. ఈ పర్యాయం తెలుగుదేశం పార్టీకి 619 ఓట్లు ఆధిక్యత వచ్చింది. దీంతో జగన్‌కు మద్దతు తెలుపుతున్న ఉడుముల కుటుంబం పట్ల ప్రజలలో ఉన్న వ్యతిరేకత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య



పెద్ద దోర్నాల, జూన్ 6: కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానిక ఇంద్రానగర్‌లో గురువారం చోటుచేసుకొంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇందిరానగర్‌కు చెందిన అడ్డాకుల శేఖర్(36) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా భార్యభర్తల మధ్య సఖ్యత లేదు. దీంతో భార్య పుట్టింటికి వెళ్లింది. పైగా ఆర్థికంగా కూడా గడ్డు పరిస్థితులు తోడుకావడంతో తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేశామన్నారు.

పొదిలి ఆర్టీసీ డిపోను తనిఖీ చేసిన ఆర్ఎం

పొదిలి, జూన్ 6 : సాధారణ తనిఖీల్లో భాగంగా ఆర్టీసీ ఆర్ఎం సుధాకర్‌బాబు పొదిలి డిపోను గురువారం తనిఖీ చేశారు. ముందుగా పొదిలి ఆర్టీసీ డిపోకు కేటాయించిన రెండు నూతన సూపర్ లగ్జరి బస్సులను ప్రారంభించారు. అనంతరం అన్ని డిపార్టమెంట్లకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించారు. సిబ్బంది సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానన్నారు. డిపోలో మహిళా కండక్టర్లకు కేటాయించిన విశ్రాంతగది సరిగా లేదంటూ పిర్యాదులు వచ్చాయని పరిశీలించానని గదులకు అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. అంతేకాకుండా తాగునీటి సమస్య, డిపోలో కార్గోపార్శిల్ సమస్యలు తీవ్రంగా ఉన్నట్లు పలువురు ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. అన్ని సమస్యలను పరిష్కరిస్తానని ఆయన చెప్పారు. ఆయనతోపాటు డీఎం జె సుందరరావు ఉన్నారు.

నష్టపరిహారానికి ప్రతిపాదనలు

గిద్దలూరు టౌన్, జూన్ 6 : రబీ సీజన్‌లో తక్కువ వర్షపాతం కురవడంతో నియోజకవర్గంలో సక్రమంగా పంటలు పండక రైతులు తీవ్రంగా నష్ట పోయారు. 11,301 మంది రైతులకు చెందిన 21,297 హెక్టార్లలో సాగైన వివిధ పంటలు పూర్తిగా దెబ్బతిన్నట్లు గుర్తించినట్లు సహాయ వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబం ధించి రూ.6.39 కోట్ల పంటనష్టం జరిగిందని, ఆమేరకు రైతులకు పరిహారం అందించేందుకు వీలుగా నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు బాలాజీనాయక్ పేర్కొన్నారు.

జిల్లాలో 17.4 మి.మీ వర్షపాతం

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 6: జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. గురువారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 14.7 మి.మీ వర్షపాతం నమోదైంది. యర్రగొండపాలెంలో 64.2, త్రిపురాంతకం 48.8, హనుమంతునిపాడు 46.2, పీసీపల్లి 34.0, కురిచేడు 32.0, పుల్లలచెరువు 30.8, తర్లుబాడు 28.4, మద్దిపాడు 28.2, దర్శి 26.2, వెలిగండ్ల 25.2, దొనకొండ 24.0, చీమకుర్తి 19.4, తాళ్ళూరు 17.2, సీఎస్‌పురం 12.4, సంతనూతలపాడు 11.8, కొనకనమిట్ల 11.4, నాగులుప్పలపాడులో 10.8 మి.మీ వర్షం కురిసింది. మిగిలిన మండలాల్లో కొద్దిపాటి జల్లులు పడ్డాయి. ప్రస్తుత వర్షాలతో వేసవి ఎండల నుంచి ఉపశమనం లభించింది. మరోవైపు ఖరీఫ్ సాగుకు వర్షాలు ఊతం ఇస్తున్నాయి. రైతులు సాగుకు సిద్ధం అవుతున్నారు.

ఏ ఊరిలో ఎవరి బలమెంత

కొమరోలు, జూన్ 6: కొమరోలు మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో తెలుగుదేశం పార్టీకి 12,101ఓట్లు రాగా, వైసీపీకి 13,984 ఓట్లు వచ్చాయి, మండలంలో 334 నోటాకు వేశారు. కొమరోలు మండలంలో 1886 ఓట్లు వైసీపీకి మెజార్టీ వచ్చింది. గ్రామాల వారీగా వచ్చిన ఓట్లను చూసి నాయకులు తమ గ్రామాల్లో ఆయా పార్టీల బలాబలాలను అంచనా వేసుకుంటున్నారు.

పంచాయతీ	టీడీపీ	వైసీపీ
తాటిచర్ల -	771	1298
దద్దవాడ -	1366	1309
నల్లగుంట్ల -	647	876
చింతలపల్లి -	582	1708
పుల్లారెడ్డిపల్లి		
కొమరోలు -	3346	2796
బ్రాహ్మణపల్లి-	682	582
రెడ్డిచర్ల -	941	1242
అల్లీనగరం -	764	740
సూరవారిపల్లి-	598	649
బాదినేనిపల్లి-	370	438
ఇడమకల్లు-	774	1237
ముక్తాపురం		
రాజుపాలెం-	1260	1109

అరుణాచలేశ్వరున్ని దర్శించుకున్న ఎమ్మెల్యే కందుల

మార్కాపురం, జూన్ 6: మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి గురువారం తమిళనాడులోని అరుణాచలేశ్వరున్ని దర్శించుకున్నారు. ఎమ్మెల్యేగా గెలిస్తే అరుణాచలం వెళ్లి స్వామిని దర్శించుకుని గిరిప్రదక్షిణ చేస్తానని ఆయన మొక్కుకున్నారు. మొక్కు తీర్చుకు నేందుకు పలువురు కార్యకర్తలతో కలిసి బుధవారం రాత్రి అరుణాచలం బ య) ల) దే రి ఎ ళ్ళా ం). ప్రమాదంలో కాలికి గాయమై శస్త్రచికిత్స చే ం యి ం చు కు న్న ఆయన ఆరోగ్యం సహకరించకున్నా సుమారు 14 కిలోమీటర్లు గిరి ప్రదక్షణ చేశారు. ఆయన వెంట తర్లుపాడు మండల పార్టీ కన్వీ నర్ ఉడుముల చిన్నపరెడ్డి, పలువురు కార్యకర్తలు ఉన్నారు.



అరుణాచలేశ్వరుని సన్నిధిలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి



పూజల అనంతరం కేడర్‌తో రాఘవరెడ్డి

ఆలయాల్లో రాఘవరెడ్డి పూజలు

త్రిపురాంతకం : ప్రసి ద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవార్ల ఆలయాల్లో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి కుమారుడు రాఘవరెడ్డి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రదక్షిణల అనంతరం త్రిపురాంతకేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక అభిషేకం, చినమస్తాదేవికి పూజలు, బాలాత్రిపుర సుందరదీదేవి అమ్మవారికి అర్చనలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు రాఘవరెడ్డికి స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలను, తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం స్థానిక టీడీపీ నాయకులు రాఘవరెడ్డిని కలిసి సత్కరించారు.

షిరిడిసాయిబాబా మందిరంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న ఆర్యవైశ్యులు

పొదిలి, జూన్ 6 : టీడీపీ విజయాన్ని ఆకాంక్షిస్తూ పట్టణంలోని సాయిబాబా మందిరంలో ఆ పార్టీ అభిమానులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేయడం, మార్కాపురం శాసన సభ్యునిగా కందుల నారాయణరెడ్డి మంచి మెజారిటీతో గెలుపొందడం శుభపరిణామమన్నారు. చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్ర శరవేగంగా అభివృద్ధి చెందాలని సాయినాథుని ప్రార్థించినట్లు వారు అన్నారు. అన్నప్రసాద కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతోపాటు పలువురు ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

పంచాయితీ కార్యాలయానికి పసుపురంగు



పసుపు రంగులో గణపవరం పంచాయితీ కార్యాలయం

త్రిపురాంతకం, జూన్ 6: సార్వత్రిక ఎన్నికల్లో ఘనవిజయం సాధించి రాష్ట్రంలో అధికారం మారిన నేపథ్యంలో గ్రామాల్లో టీడీపీ నాయకులు తమ అభిమానాన్ని స్థానిక ప్రభుత్వ కార్యాలయాలపై చూపుతున్నారు. ఈ నేపథ్యంలోనే మండలంలోని గణపవరం పంచాయితీ కార్యాలయానికి పసుపురంగు వేశారు. కాగా కార్యాలయానికి రంగు మార్పు విషయం స్థానిక కార్యాలయ సిబ్బందికి ఇబ్బందులు తెచ్చిపెట్టింది. గురువారం వరకు ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో కార్యాలయానికి రంగు మార్చడంపై కార్యాలయ సిబ్బందిని ఉన్నతాధికారులు సంజాయిషీ అడిగారు. దీంతో సిబ్బంది ఇబ్బందులలో పడ్డారు.

అశోక్‌రెడ్డికి అభినందనల వెల్లువ

గిద్దలూరుటౌన్, జూన్ 6 : గిద్దలూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన ముత్తుముల అశోక్‌రెడ్డికి అభినందనల వెల్లువ కొనసాగుతూనే ఉంది. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు కార్యకర్తలు నాయకులు కలసివచ్చి అశోక్‌రెడ్డికి శాలువాలు కప్పి దండలు వేసి బొకెలు ఇచ్చి శుభా కాంక్షలు తెలుపుతూనే ఉన్నారు. కనకదుర్గమ్మ ఆలయంలో తెలుగు మహిళలు కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఈసందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ అందరం కలిసి ప్రజాసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి పని చేద్దామని, అభివృద్ధికి కేరాఫ్‌గా నియోజకవర్గాన్ని మార్చుద్దామని పేర్కొన్నారు.



అశోక్‌రెడ్డికి బొకే ఇస్తున్న శుభాకాంక్షలు తెలుపుతున్న కార్యకర్తలు





అశోక్‌రెడ్డితో అభిమానులు, కనకదుర్గమ్మ ఆలయంలో కొబ్బరికాయులు కొట్టి మొక్కు తీర్చుకుంటున్న మహిళలు

ఎవరు గెలిచినా..మీదే గెలుపు..!

ఆంధ్రజ్యోతి కూపన్ల పోటీలో జిల్లా స్థాయి విజేతల గుర్తింపు

మొదటి స్థానంలో నిలిచిన మార్కాపురం వాసి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారనే విషయంపై ప్రజల నాడి తెలుసుకునేందుకు ఆంధ్రజ్యోతి నిర్వహించిన కూపన్ల పోటీలో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో మార్కాపురానికి చెందిన ఎం.గుల్జార్ నిలిచారు. ఇటు జిల్లా స్థాయిలోనూ, అటు రాష్ట్ర స్థాయిలోనూ విజేత ఎవరో ఊహించాలో చెప్పాలంటూ ఆంధ్రజ్యోతిలో కూపన్లు ప్రచురించిన సంగతి తెలిసిందే. జిల్లా స్థాయిలో విజేతలన గుర్తించేందుకు వచ్చిన కూపన్లలో కచ్చితమైన ఫలితాలను ముందుగానే పేర్కొన్న కూపన్లను గురువారం సాయంత్రం త్రోవగుంట వద్ద ఉన్న ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో డ్రా తీశారు. పెద్ద సంఖ్యలో వచ్చిన కూపన్లలో సరైన ఫలితాలను చూచించిన కూపన్లను ఎంపిక చేశారు. జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలు టీడీపీకి, రెండు స్థానాలు వైసీపీకి దక్కనున్నాయని అనేక మంది వారి కూపన్లలో పేర్కొన్నారు. కొందరు మాత్రం ప్రస్తుతం టీడీపీ ఏ స్థానాల్లో గెలిచేది, వైసీపీ ఏ స్థానాల్లో గెలిచేది స్పష్టంగా గుర్తించారు. అలా అన్ని స్థానాలను కచ్చితంగా గుర్తించిన కూపన్ల నుంచి నలుగురిని డ్రా ద్వారా ఎంపిక చేశారు. బ్రాంచ్ మేనేజర్ ఐవీ సుబ్బారావు తీసిన డ్రాలో మొదటి విజేతగా మార్కాపురంలోని గోర్లగడ్డ ప్రాంతానికి చెందిన ఎం.గుల్జార్ నిలిచారు. రెండో స్థానంలో ముగ్గురి ఎంపిక చేసేందుకు తీసిన డ్రాలో మార్కాపురానికే చెందిన బి. రాజేష్, కనిగిరిలోని సుభాష్ రోడ్డు ప్రాంతానికి చెందిన బచ్చలి వెంకటనాగలక్ష్మి, పెద్దారవీడు మండలం ఎస్.కొత్తపల్లికి చెందిన తిరుమలరెడ్డి లక్ష్మీదేవి నిలిచారు. మొదటి విజేతకు రూ.10వేలు, రెండో స్థానంలో నిలిచిన ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ఇవ్వనున్నట్లు బీఎం సుబ్బారావు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో విజేతలను గుర్తిస్తూ వచ్చిన కూపన్ల డ్రా విజయవాడ కార్యాలయంలో జరుగుతుందని, అందులో తొలి స్థానంలో నిలిచిన వారికి రూ. లక్ష, రెండో స్థానంలో నిలిచిన వారికిరూ.50 వేలు, ఆ తర్వాత స్థానంలో నిలిచిన ఐదుగురికి రూ.10 వేల చొప్పున అందించనున్నట్లు తెలిపారు. ఈ డ్రా కార్యక్రమంలో ఎడిటోరియల్ ఇన్‌చార్జి ఆళ్ల శ్రీనివాసులు, ఏసీఎం రమణ, సాంకేతిక విభాగం ఇన్‌చార్జి రామకోటేశ్వరరావు, ప్రొడక్షన్ ఇన్‌చార్జి ఉమా తదితరులు పాల్గొన్నారు.



విజేత కూపన్‌ను చూపిస్తున్న బీఎం ఐవీ.సుబ్బారావు

టీడీపీకి పట్టం కట్టిన నగర వాసులు

కనిగిరి, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి గెలుపులో కనిగిరి నగరవాసుల ఓట్లు కీలకంగా నిలిచాయి. మున్సిపాల్టీ పరిధిలో 118వ బూత్ నుంచి 146వ బూత్‌వరకు, 149వ బూత్‌నుంచి 152వ బూత్ వరకు, 168వ బూత్‌తో మొత్తం 34 బూత్‌లలో వైసీపీపై టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి విజయపథంలో దూసుకుపోయారు. మున్సిపాల్టీ పరిధలోనే డాక్టర్ ఉగ్రకు 16,200 ఓట్లు రాగా, 5930 మెజార్టీ వచ్చింది.

కూలీలకు వేసవి భత్యం ఇవ్వాలి

పామూరు, జూన్ 6: ఉపాధి పథకంలో పనిచేస్తున్న కూలీలకు వేసవి భత్యాన్ని ప్రభుత్వాలు పునరుద్ధరించాలని వ్యవసాయకార్మిక సంఘం నాయకుడు కె.మాల్యాద్రి డిమాండ్ చేశారు. మండలంలోని తూర్పుకట్టకిందపల్లి, లక్ష్మీనరసాపురం పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి పనులను పనిప్రదేశంలో పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఉపాధి కూలీలను ప్రోత్సహించే ఉద్దేశంతో గతంలో ఫిబ్రవరి నెలలో చేసిన పనికి 20 శాతం, మార్చి నెలలో 30 శాతం, ఏప్రిల్‌లో 35శాతం వేతనాన్ని పెంచి అదనపు పారితోషకంగా ఇచ్చేవారన్నారు. ప్రస్తుతం ఈ విధానాన్ని రద్దు చేయడం దారుణమన్నారు. గతంలో పలుగు, పార, తట్టలాంటి పనిముట్లను ప్రభుత్వ నిధులతో కొని ఉపాధి కూలీలకు ఇచ్చేవారన్నారు. వాటిని తిరిగి పునరుద్ధరించాలని ఆయన కోరారు.

టీడీపీ కార్యాలయంలో సంబరాలు

పీసీపల్లి, జూన్ 6: టీడీపీ నేతలు గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యేగా ఉగ్రనరసింహారెడ్డి విజయం సాధించడంతో పాటు రాష్ట్రంలో టీడీపీ ఘనవిజయం సాధించిన సందర్భంగా పార్టీశ్రేణులు సమావేశయ్యారు. నాయకులు మాట్లాడుతూ దుష్టపాలన సాగించిన వైసీపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో గ్రామాల్లో అన్నిరంగాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, వీరపనేని పెద్దన్న, కోమటిగుంట్ల వీరయ్య, బోయపాటి సుబ్బారావు, మన్నం వెంకటేశ్వర్లు, మన్నం రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

వెంగళాయపల్లిలో విజయోత్సవ ర్యాలీ

పీసీపల్లి, జూన్ 6: మండలంలోని వెంగళాయపల్లిలో గురువారం తెలుగుదేశం పార్టీ శ్రేణులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యేగా డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి విజయం సాధించడంతో రంగులు చల్లుకుంటూ ర్యాలీగా గ్రామంలో తిరిగారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వేమూరు రామయ్య, సర్పంచ్ కరణం తిరుపతయ్య, గ్రామకమిటీ అధ్యక్షుడు కరణం చంద్రయ్య, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు తిరుపతిరావు, కోమటిగుంట్ల వీరయ్య, కసిరెడ్డి ఓబుల్‌రెడ్డి, గుంటగాని జోసెఫ్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలు పదవులకు రాజీనామాలు

వెలిగండ్ల, జూన్ 6: వెలిగండ్ల మండలంలో పదవులు పొందిన వైసీపీ నాయకులు రాజీనామాలు చేస్తున్నారు. మండలంలోని రామలింగాపురం పంచాయతీకి చెందిన గజ్జల వెంకటరెడ్డి వైసీపీ మండల అధ్యక్ష పదవికి రాజీనామ చేశారు. బల్లవరం పంచాయతీలోని నరసమందాపురంకు చెందిన చిలకల వెంకటనారయణ డీలర్‌షిప్ పదవికి రాజీనామాచేసి తహసీల్దార్‌కు అందజేశారు. మరికొంత మంది వైసీపీ నాయకులు త్వరలో పదవులకు రాజీనామాలు చేస్తారని ఆపార్టీ నాయకులే గుసగుస లాడుకుంటున్నారు.

నీట్ ఫలితాల్లో సత్తాచాటిన కలవకూరి సుశ్రిత

దొనకొండ, జూన్ 6 : నీట్ ఫలితాల్లో దొనకొండ గ్రామానికి చెందిన కలవకూరి సుశ్రిత ఆల్ ఇండియా స్థాయిలో ర్యాంక్ సాధించి సత్తాచాటింది. 671 మార్కులతో ర్యాంక్ సాధించారు. సుశ్రిత తండ్రి కాంతికుమార్ దొనకొండలో తిరుమళ మిల్క్ ఏజంట్‌గా, తల్లి రూతమ్మ ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్నారు. తమ కుమార్తెకు నీట్‌లో ర్యాంక్ రావటం తమకు ఎంతో సంతోషాన్ని కల్గించిందని వారు తెలిపారు.

గ్రామ సచివాలయాల్లో నిలిచిన సేవలు



నిర్మానుష్యంగా గ్రామ సచివాలయాలు

పామూరు జూన్ 6: గ్రామ సచివాలయాల్లో పౌరసేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం ఓడిపోయి టీడీపీ గెలిచింది. ఈనేపథ్యంలో సచివాలయాల్లోని డేటా మొత్తాన్ని తరలిస్తున్నారనే సమాచారంతో అధికారులు డేటాను బ్లాక్‌చేశారు. దాంతో పలు రకాల సైట్‌లు ఓపెన్ కాకుండా నిలిచిపోయాయి. ఫలితంగా, సచివాలయ సిబ్బంది ఏమిచేసేది లేక ఖాళీగా ఉన్నారు. కరెంటు బిల్లులు, జనన, మరణ సర్టిఫికెట్‌ల కోసం దరఖాస్తులు చేసుకొన్న సైట్‌లు నిలిచిపోయాయని సిబ్బంది చెబుతుండటంతో ప్రజలు వెనుదిరుగుతున్నారు. దాంతో సచివాలయ కేంద్రాలు నిర్మానుష్యంగా మారాయి.

సమ్మర్ క్యాంప్‌లతో ప్రయోజనాలు

దొనకొండ, జూన్ 6: విద్యార్థుల్లోని సామర్థ్యంను వెలికితీసేందుకు గ్రంథాలయంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపులు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని ప్రభుత్వ కాలేజీ లెక్చరర్ విజయలక్ష్మి అన్నారు. దొనకొండ గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన కథలు చెప్పటం, చదవటం, డ్రాయింగ్ తదితర పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన రిటైర్డ్ రైల్వే ఉద్యోగి బ్రహ్మారెడ్డి, లెక్చరర్ విజయలక్ష్మి, స్వరాజ్యలక్ష్మిని గ్రంథపాలకురాలు సుమతి శాలువాలతో సత్కరించారు.

వైద్యసేవలు అందడంలేదని గ్రామస్థుల ఫిర్యాదు

వెలిగండ్ల, జూన్ 6: నాగిరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవలు సక్రమంగా అందడంలేదని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. గురువారం ఆరోగ్య కేంద్రంలో విచారణకు వచ్చిన డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సృజనకు తమగోడు వెళ్లబోసుకున్నారు.

స్థానిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు డాక్టర్ హైమావతి ఉద్యోగులను వేధిస్తున్నారని ఫిర్యాదు చేయడంతో వారు విచారణకు వచ్చారు. ఉన్నతాధికారులు వచ్చారని తెలుసుకున్న గ్రామస్థులు ఆరోగ్యకేంద్రానికి వచ్చి తాము పడుతున్న ఇబ్బందులను ఏకరువుపెట్టారు. డాక్టర్ హైమావతి ఆరోగ్య కేంద్రానికి సక్రమంగా రారని, రోగుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. సక్రమంగా వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

గోదాములకు ఈవీఎంల తరలింపు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 6 : జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో సంబంధిత ఈవీఎంలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఒంగోలు నగరం మామిడిపాలెంలోని ఈవీఎం గోడౌన్‌లో భద్రపర్చినట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. జిల్లాలో ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి కావడంతో సంబంధిత ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్లను ఈవీఎంల గోడౌన్‌కు తరలించగా గురువారం కలెక్టర్ దినేష్‌కుమార్, రాజకీయపార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ముగిసిన నేపథ్యంలో జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎం మిషన్లను భద్రపర్చినట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌లను కూడా జిల్లా ట్రెజరీ స్ట్రాంగ్ రూములకు తరలించి భద్రపర్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఒంగోలు, దర్శి ఆర్వోలు సుబ్బారెడ్డి, లోకేశ్వరరావు, రాజకీయ పార్టీల నాయకులు కాలేషాబేగ్, రసూల్, రాజశేఖర్, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ విద్యార్థుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సంతనూతలపాడు, జూన్ 6: 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి వివిధ జిల్లాల్లోని మైనార్టీ గురుకుల విద్యాలయాల్లో నేరుగా 5వ తరగతి, అలాగే 6, 7 ,8 తరగతులకు సంబంధించి మిగిలి ఉన్న సీట్ల ఖాళీలకు, మైనార్టీ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు గురుకుల విద్యాలయాల జిల్లా కన్వీనర్ డి.నాగేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

వివరాల కోసం విజయవాడ మైనార్టీ బాలికల గురుకుల విద్యాలయం సెల్ -8712625036, 8712625038(గుంటూరు), 8712625045 (నెల్లూరు), అలాగే గుంటూరు బాలుర మైనార్టీ జూనియర్ కళాశాల సెల్- 8712625073, చిత్తూరు, వాయల్‌పాడు బాలికల మైనార్టీ జూనియర్ కళాశాల సెల్- 8712625077 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

దర్శిలో టీడీపీ ఓటమిపై అంతర్మథనం



» వర్గపోరు, వెన్నుపోట్లే ప్రధాన కారణం

దర్శి, జూన్ 6: దర్శిలో టీడీపీ ఓటమికి కారణాలను ఆపార్టీ అన్వేషిస్తుంది. ఎక్కడ పొరపాటు జరిగిందో అనే విషయంపై లోతుగా ఆరా తీస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ కూటమి విజయదుందుభి మోగించినప్పటికీ దర్శిలో ఓటమి చెందటంపై అంతర్మథనం జరుగుతంది. పలు గ్రామాల్లో వర్గపోరు, పలుచోట్ల వెన్నుపోట్లు ప్రధాన కారణమని భావిస్తున్నారు. భారీగా మెజార్టీ లభిస్తుందని భావించిన గ్రామాల్లో మెజార్టీలు తగ్గటం వలనే టీడీపీ ఓటమి పాలైంది. పలుగ్రామాల్లో అధిక మెజార్టీ వస్తుందని ఆప్రాంతాలకు చెందిన టీడీపీ నాయకులు కౌంటింగ్ ముందురోజు వరకు బల్లగుద్ది చెబుతూ వచ్చారు. ఫలితాలు వెలువడిన తర్వాత ఆ గ్రామాల్లో వచ్చిన ఓట్లను చూసి టీడీపీ నాయకులు ఖంగుతిన్నారు. స్థానిక నాయకులు అంత ఆర్భాటంగా చెప్పటం వలన నమ్మి సీటు కోల్పోవాల్సి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దర్శి మండలంలోని రాజంపల్లి, తూర్పువెంకటాపురం, పోతవరం, కొత్తపల్లి, బొట్లపాలెం గ్రామాల్లో గణనీయంగా టీడీపీకి మెజార్టీ వస్తుందని భావించారు. రాజంపల్లి, తూర్పువెంకటాపురం గ్రామాల్లో ఊహించిన దానికంటే తక్కువ మెజార్టీ వచ్చింది. మిగిలిన గ్రామాల్లో టీడీపీకి బదులు వైసీపీకి ఆధిక్యత లభించింది. దీంతో దర్శి రూరల్ మండలంలో కనీసం వెయ్యి ఓట్లు మెజార్టీ టీడీపీకి వస్తుందని భావించినప్పటికీ 329 ఓట్లు వైసీపీకి మెజార్టీ లభించింది. ముండ్లమూరు మండలంలో మూడు వేల నుంచి నాలుగువేల వరకు టీడీపీకి మెజార్టీ వస్తుందని ఆ మండలానికి చెందిన టీడీపీ నాయకులు ఘంటాపథంగా చెబుతూ వచ్చారు. కౌంటింగ్ ముందురోజు వరకు వారు అదే భరోసా వ్యక్తం చేస్తుండటంతో ఆమేరకు అంచనాలు వేసుకొని టీడీపీ గెలుపు ఖాయమని టీడీపీ వర్గీయులు ధీమాతో ఉన్నారు. కౌంటింగ్ అనంతరం వచ్చిన ఓట్లు పరిశీలిస్తే ముండ్లమూరు మండలంలో కేవలం టీడీపీకి 97 ఓట్ల ఆధిక్యత మాత్రమే లభించింది. ఆ మండలంలో ఆ పార్టీ నాయకులు చెప్పిన మెజార్టీలో 50శాతం వచ్చినా టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి విజయం సాధించి ఉండేవారు. ముండ్లమూరు మండలంలో అత్యధికంగా మెజార్టీ లభిస్తుందని భావించిన సింగన్నపల్లి, కెల్లంపల్లి, బొప్పూడివారిపాలెం తదితర గ్రామాల్లో ఆశించిన మేరకు మెజార్టీ రాలేదు. వైసీపీకి స్వల్ప మెజార్టీ వస్తుందని టీడీపీ నాయకులు అంచనావేసిన పులిపాడు, మారెళ్ల, పసుపుగల్లు తదితర గ్రామాల్లో అంచనాకు మించి మెజార్టీ లభించింది. టీడీపీకి భారీ ఆధిక్యత లభిస్తుందని భావించిన గ్రామాల్లో మెజార్టీ తగ్గటం, వైసీపీకి స్వల్ప మెజార్టీ వస్తుందని భావించిన గ్రామాల్లో ఆ పార్టీకి ఎక్కువ మెజార్టీ రావటంతో ఫలితం తారుమారైందని భావిస్తున్నారు.

ముండ్లమూరు మండలంలోని టీడీపీ నాయకులు అక్కడి పరిస్థితులను సక్రమంగా అంచనా వేయలేకపోవటంతో నష్టం చేకూరుందని భావిస్తున్నారు. ఆ మండలంలో మెజార్టీ రాకపోవటంతో టీడీపీ అభ్యర్థి ఓటమికి ప్రధాన కారణమైందని ఆపార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రధానంగా ముండ్లమూరు మండలంలో టీడీపీకి స్వల్ప మెజార్టీ రావటం, దర్శి రూరల్ మండలంలో వైసీపీకి మెజార్టీ రావటంతో ఫలితం తారుమారైందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పలు గ్రామాల్లో స్థానిక నాయకుల మధ్య వర్గపోరు, మరికొన్ని గ్రామాల్లో వెన్నుపోట్లతో అంచనాలు తప్పాయని భావిస్తున్నారు. టీడీపీ ఓటమికి గల కారణాలను ఆ పార్టీ నాయకులు లోతుగా అధ్యయనం చేస్తున్నారు. పొరపాట్లు చేసిన వారిని, వెన్నుపోట్లు పొడిచిన వారిని సహించే ప్రసక్తేలేదని చెబుతున్నారు. పార్టీకి నష్టం చేకూర్చిన ప్రాంతాల్లో ప్రక్షాళన చేసేందుకు అధినాయకత్వం పూర్తి సమాచారాన్ని తీసుకుంటున్నట్లు తెలిసింది.

ఉద్యోగుల ప్రక్షాళనకు రంగం సిద్ధం

» ఎన్నికల్లో వైసీపీకి ప్రచారం చేసిన వారి వివరాలను సేకరిస్తున్న వైనం

దర్శి, జూన్ 6: వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ఆపార్టీ నాయకులతో అంటకాగిన ఉద్యో గుల పక్షాళనకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తుంది. కొన్ని శాఖల ఉద్యోగులు వైసీపీ కార్యకర్తల్లాగా ఆ పార్టీ కొ మ్ము కాస్తూ ప్రచారం కూడా చేశారు. వైసీపీకి ఓట్లు వేయమని సామాన్య ప్రజలపై కొంతమంది ఒత్తిడి చే సినట్లు సమాచారం. కొంతమంది అధికారుల తీరు బ యటకు రావటంతో టీడీపీ నాయకులు ఆ ఉద్యోగుల ను పక్షాళన చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. ఇప్ప టికే ఎవరెవరు వైసీపీకి మద్దతుగా నిలిచారన్న సమా చారం సేకరిస్తున్నారు. కొంతమంది ఉద్యోగులు బాహా టంగానే పోస్టల్ బ్యాలెట్లు కొనుగోలు చేశారు. మరికొం తమంది గ్రామాల్లో తిరిగి పరిచయం ఉన్న వారిని కలిసి వైసీపీకి ఓట్లు వేయా లని ఒత్తిడి తెచ్చారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులంతా నియంతృత్వ వైసీపీ పాలనకు వ్యతిరేకంగా టీడీపీకి మద్దతు తెలిపిన విష యం తెలిసిందే. దర్శి నియోజకవర్గంలో ఉద్యోగులు అ ందుకు భిన్నంగా వ్యవహరించారు. పోస్టల్ బ్యాలెట్లలో టీడీపీకి కేవలం 141 ఓట్లు మాత్రమే ఆధిక్యత లభిం చింది. దీంతో ఉద్యోగులు వైసీపీకి ఎలా మద్దతు పలికా రో అర్థమవుతుంది, ప్రధానంగా పలువురు పోలీసు అ ధికారులు కౌంటింగ్ రోజు వరకు వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారు. టీడీపీ వర్గీయులు ఎంచెప్పినా పట్టించుకోలేదు. జరిగిన అన్యాయం వివరించే ప్రయత్నం చేసినా వారి మొర ఆలకించలేదు. పోలీసుల అండతోనే పలుచోట్ల వైసీపీ నాయకులు దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. అదేవిధంగా రెవెన్యూ శాఖలో కొంతమంది ఉద్యోగులు వైసీపీ విజయం కోసం కృషి చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక వీఆర్వో పోతకమూరు పోలింగ్ బూత్ వద్ద వైసీపీకి ఓట్లు వేయాలని చెబుతున్న విషయాన్ని గమనించిన టీడీపీ నాయకులు ఆ వీఆర్వోపై ఆగ్రహం వ్యక్తం చేయటంతో అక్కడినుంచి చల్లగా జారుకున్నారు. పలువురు ఉద్యో గులు గ్రామాల్లో తిరిగి వైసీపీకి మద్దతుగా ప్రచారం చేశారు.

జిల్లా పరిషత్ పరిధిలో మండల పరిషత్తు, పంచా యతీ రాజ్ శాఖలో కొందరు ఉద్యోగులు పనిచేయాల్సి ఉంది. దీంతో వైసీపీ నాయకుల అండతో కొందరు ఉ ద్యోగులు అనేకమంది సిబ్బందిని బెదిరించి పోస్టల్ బ్యా లెట్ ఓట్లను సేకరించినట్లు తెలుస్తుంది. పలువురు ఉపాధ్యాయులపై కూడా బెదిరింపు అస్త్రం ప్రయోగిం చి పోస్టల్ బ్యాలెట్లు సమీకరించుకున్నారు. కొందరు ఉ ద్యోగులు బయపడి ఇష్టం లేకున్నా, మళ్లీ వైసీపీ అధి కారంలోకి వస్తే తమకు ఇబ్బంది జరుగుతుందనే భయంతో వైసీపీ నాయకులు కొందరు ఉద్యోగుల సూచ నల మేరకు పోస్టల్ బ్యాలెట్లు వేశారు. దీంతో రాష్ట్రం లో ఎక్కడాలేని విధంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు టీడీపీ కి తక్కువగా వచ్చాయని ఆపార్టీ నాయకులు భావిస్తు న్నారు. వైసీపీకి కొమ్ముకాస్తున్న ఉద్యోగులను ప్రక్షాళన చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది.

తూర్పువీరాయపాలెంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

» రెచ్చగొట్టిన వైసీపీ వర్గీయులు

» నలుగురికి గాయాలు

దర్శి, జూన్ 6: మండలంలోని తూర్పువీరాయపాలెంలో బుధవారం రాత్రి టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. వైసీపీ వర్గీయులు రెచ్చగొట్టే నినాదాలు చేస్తూ టీడీపీ వర్గీయులపై దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. దర్శిలో వైసీపీ అభ్యర్థి గెలుపొందటంతో గ్రామంలోని ఆపార్టీ నాయకులు నిబధనలకు విరుద్ధంగా ఎన్నికల కోడ్‌కు తిలోదకాలు ఇస్తూ బాణసంచా కాల్చారు. రెచ్చగొట్టే చర్యలు చేపట్టారు. దీంతో టీడీపీ వర్గీయులు అక్కడకు చేరుకుని ఎన్నికల కోడ్ అమలులో ఉండగా, బాణసంచా కాల్చటం ఏమిటని ప్రశ్నించారు. దీంతో వైసీపీ వర్గీయులు, టీడీపీ వర్గీయులపై దాడి చేయటంతో ముప్పరాజు యోగేశ్వరరావు, ఉలవా సురేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. వైసీపీ వర్గీయుల దాడిని అడ్డుకునే ప్రయత్నంలో టీడీపీ వర్గీయులు కూడా తిరగబడ్డారు. ఈ ఘర్షణలో వైసీపీ వర్గీయులు ముప్పరాజు వెంకటేశ్వర్లు, ముప్పరాజు కోటేశ్వరమ్మకు గాయాలయ్యాయి. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గొడవలు పునరావృతం కాకుండా గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటుచేశారు.



తూర్పువీరాయపాలెంలో కవాతు చేస్తున్న స్పెషల్ ఎస్పీ హిమ బిందు, పోలీసులు

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

గ్రామాల్లో ఉద్దేశపూర్వకంగా అల్లర్లు, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లాస్పెష ల్ ఎస్పీ హిమ బిందు హెచ్చరించారు. తూర్పువీరాయపాలెంలో గురువారం ఆమె పర్యటించి ఘర్షణకు కారణాలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా గ్రామంలో ప్రత్యేక పోలీసు దళాలతో కవాతు నిర్వహించారు. హిమబిందు గ్రామస్థులతో మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలు ప్రశాంతంగా ఉండాలని కోరారు. రాజకీయ కక్షలతో గొడవలకు పాల్పడితే సహించేది లేదన్నారు. నిబంధనల మేరకు అందరూ నడుచుకోవాలని సూచించారు. గతంలో కూడా పలు ఎన్నికల సందర్భంగా గ్రామంలో గొడవలు జరిగి నవిషయం తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డి, సీఐ షేక్ షమీముల్లా , ఎస్సై సుమన్, తదితరులు పాల్గొన్నారు.

సేవకుడికి పట్టం..!

» నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగిన ఉగ్ర

కనిగిరి, జూన్ 6: కనిగిరి నియోజకవర్గ ప్రజలు సేవకుడికి పట్టం కట్టారు. టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి 14,604 మెజార్టీతో విజయం సాధించారు.2019లో వైసీపీకి వచ్చిన మెజార్టీని తగ్గించి 2024 ఎన్నికల్లో 14,604 ఓట్లుతో వైసీపీ అభ్యర్థిపై గెలుపొందారు. గత పదేళ్ళుగా నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించిన డాక్టర్ ఉగ్ర చేసిన విశేష సేవకు ప్రజలు పట్టం కట్టారు.

మండలం	పోలైన ఓట్లు	టీడీపీ	వైసీపీ	మెజార్టీ
హనుమంతునిపాడు	19,782	9,603	10,179	576 (వైసీపీ)
వెలిగండ్ల	24,422	12,384	12,038	346 (టీడీపీ)
సీఎస్‌పురం	27,356	14,403	12,953	1,450 (టీడీపీ)
కనిగిరి రూరల్	32,796	15,668	17,128	1,460 (వైసీపీ)
కనిగిరి మున్సిపాల్టీ	26,458	16,194	10,264	5,930 (టీడీపీ)
పీసీపల్లి	24,743	13,733	11,010	2,723 (టీడీపీ)
పామూరు	41,264	23,318	17,946	5,372 (టీడీపీ)
మొత్తం	1,96,821	1,05,303	91,518	13,785 (టీడీపీ)
పోస్టల్ బ్యాలెట్ ఓటు	2,810	1,742	923	819 (టీడీపీ)
	1,99,631	1,07,045	92,441	14,604 (టీడీపీ)

వైద్యశాఖ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 6: అర్హత లేకపోయినా సదరం సర్టిఫికెట్లు తెచ్చుకొని వెహికిల్ లైసెన్సు లేకుండానే మోటార్ వాహనాలను నడుపుతున్న వైద్యశాఖ ఉద్యోగిపై చర్య లు తీసుకోవాలని నవ్యాంధ్ర దివ్యాంగుల హక్కుల సేవా సమితి నాయకులు ఫిర్యాదు చేశారు. గురువారం గుంటూరులో రీజియన్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కృష్ణవేణిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఒంగోలులోని వైద్యఆరోగ్యశాఖ ప్రధానకార్యాలయంలో అకౌంటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రాజేష్ తప్పుడు సదరం సర్టిఫికెట్ తెచ్చుకున్నారని ఫిర్యాదు చేశారు. అందుకు సంబంధించిన ఆధారాలను అందజేశారు. డ్రైవింగ్ లైసెన్సు లేకపోయినా నిత్యం ట్రాఫిక్‌లో వాహనాలు నడుపుతున్నారని, దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అందువల్ల తప్పుడు సర్టిఫికెట్‌తో వాహనం నడుపుతున్న రాజేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాలేషా, దూపాటి రమణయ్య, సాయికుమార్, రహీం పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ఒంగోలు(విద్య), జూన్ 6: ఉపాధ్యాయుల శిక్షణ కా ర్యక్రమాల ద్వారా తమ వృత్తి నైపుణ్యాలను పెం పొందించుకోవాలని డీఈవో సుభద్ర కోరారు. మైనంపాడులోని డైట్‌లో గురువారం ప్రారంభమైన ఎఫ్‌ఎల్‌ఎన్ జ్ఞాన ప్రకాష్ శిక్షణ కార్యక్ర మంలో ఆమె మాట్లాడారు. డీఆర్పీలు శిక్షణలో చురుకుగా పాల్గొని తద్వారా మూ డు స్థాయిల్లో జరగబోయే శిక్షణ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. డైట్ సీనియర్ అధ్యాపకులు సోమా సుబ్బారావు మాట్లాడుతూ అసిస్టెంట్ టా ల్‌పై శిక్షణ పొందిన డీఆర్పీలు మండల స్థాయిలో టీచర్లకు ఆరు రోజుల పాటు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈ శిక్షణలో 114 మంది డీఆర్పీలు హాజరయ్యా రు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎంవో రమేష్, ఎంఈవోలు శివాజీ, బాలాజీ, జి ల్లా కో ఆర్డినేటర్ ఎం.సుబ్బారావు, ఎం.రవీంద్రప్రసాద్, నర్మదాదేవి, సంజీవరావు, పావని, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

24నుంచి టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 6: ఒంగోలులోని రూట్‌సెట్ సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రామీణ ప్రాంత నిరుద్యోగ మహిళలకు ఈనెల 24 నుంచి వచ్చేనెల 23వతేదీ వరకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పొందాలనుకునే మహిళలు 18నుంచి 45 ఏళ్ళమధ్య ఉండాలని, శిక్షణతో పాటు భోజనం, వసతి ఉచితంగా అందించనున్నారు. వివరాలకు 9573363141, 9492583484 సెల్ నంబర్లలో సంప్రదించాలని నిర్వహకులు కోరారు.

టెన్త్ సప్లిమెంటరీ మూల్యాంకనం ప్రారంభం

ఒంగోలు(విద్య), జూన్ 6: పదో తరగతి అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఒంగోలులోని డీఆర్‌ఆర్‌ఎం మునిసిపల్ హైస్కూలులో గురువారం ప్రారంభమైంది. తెలుగు, ఇంగ్లీషు, హిందీ, ఫిజికల్ సైన్స్, బయలాజికల్‌కు సంబంధించి వివిధ జిల్లాల నుంచి 9వేల జవాబు పత్రాలు మూల్యాంకానికి ఇక్కడకు వచ్చాయి. పేపర్లు దిద్దేందుకు 13మంది చీఫ్ ఎగ్జామినర్లు, 70మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 26మంది స్పెషల్ అసిస్టెంట్లను నియ మించారు. ఆదివారం వరకు ఈ మూల్యాంకనం గడువు ఇవ్వగా ఒక రోజు ముందుగానే మూల్యాంకనం ముగుస్తుందని డీఈవో సుభద్ర తెలిపారు.

కాగా గణితం సబ్జెక్టు జవాబుపత్రాల మూల్యాంకనం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ జవాబుపత్రాలు ఆన్‌లైన్ ట్యాబ్‌ల ద్వారా మూల్యాంకనం చేస్తారు. అందుకు సంబంధించి జవాబుపత్రాలను స్థానిక డీఆర్‌ఆర్‌ఎం మునిసిపల్ హై స్కూలులో ప్రత్యేకంగా స్కానింగ్ చేస్తారు. ముల్యాంకనానికి 50 మంది గణితం స్కూలు అసిస్టెంట్లను ఎంపిక చేసి వివరాలను డీఈవో వెబ్‌సైట్‌లో ఉంచారు.

ఓపెన్‌స్కూల్ పరీక్షలకు 66 మంది గైర్హాజరు

ఒంగోలు(విద్య), జూన్ 6: జిల్లాలో జరుగుతున్న ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీ పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు గురువారం 66మంది విద్యార్థులు గైర్హాజర య్యారు. మొత్తం 500మంది హాజరుకావాల్సి ఉండగా 434 మంది పరీక్ష రాశారు. ఇంటర్ గణిత పరీక్షకు 408కి గాను 358 మంది హాజరు కాగా, 50 మంది గైర్హాజరయ్యారు. హిస్టరీ పరీక్షకు 92కి 70 మంది హాజరు కాగా 6 మంది గైర్హాజరయ్యారు. పదో తరగతి గణితం పరీక్షకు 483 మందికి గాను 394 మంది హాజరు కాగా, 89 మంది గైర్హాజరయ్యారైన ట్లు ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శివకుమార్ తెలిపారు.

రాజకీయాల నుంచి వైశ్య కార్పొరేషన్ చైర్మన్ తప్పుకో..!

ఒంగోలు(కార్పొరేషన్), జూన్ 6: ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వస్తుందని, ప్రత్యేకించి తాను నివసించే 12వ డివిజన్‌లో టీడీపీ కూటమికి ఒక్క ఓటు మెజారిటీ వచ్చినా శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని చాలెంజ్ చేసిన వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ మాట నిలబెట్టుకోవాలని 12వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ అంబూరి శ్రీను డిమాండ్ చేశారు. ఓట్లు లెక్కింపునకు ముందు మీడియా సమావేశం ఏర్పాటుచేసి మరీ కుప్పం ప్రసాద్ బహిరంగంగా సవాల్ విసిరారని పేర్కొన్నారు. అయితే ఓట్లు లెక్కింపు ప్రక్రియ పూర్తయిందని, 12వ డివిజన్‌లో మొత్తం మూడు పోలింగ్ బూతులు ఉండగా, బూత్ నెం.128లో టీడీపీకి 592 ఓట్లు, వైసీపీకి 341 ఓట్లు వచ్చాయన్నారు. బూత్ నెం.129లో టీడీపీకి 616 ఓట్లు, వైసీపీకి 359 ఓట్లు వచ్చాయన్నారు. బూత్ నెం. 130లో టీడీపీకి 801 ఓట్లు, వైసీపీకి 314 ఓట్లు వచ్చాయనాన్నరు. డివిజన్‌లో టీడీపీకి మెజార్టీ వచ్చిందని చెప్పారు. కుప్పం ప్రసాద్ తన రాజీనామా ఎప్పుడు చేస్తున్నారో, రాజకీయాల నుంచి ఎప్పుడు తప్పుకుంటున్నారో బహిరంగంగా తెలియజేయాలని డిమాండ్ చేశారు.






ఆ ఖాకీల్లో.. కలవరం

పోలీసులమనే విషయం మరిచారు. వైసీపీ నేతలకంటే ఎక్కువగా బరితెగించారు. రాజ్యాంగం.. ప్రజాస్వామ్యం.. కోర్టులను పట్టించుకోలేదు. ఐపీసీ కాదు.. వైసీపీ ముఖ్య మన్నట్లుగా చెలరేగారు. వైసీపీ నేతలు చెప్పడమే ఆలస్య మన్నట్లుగా కేసులు.. అరెస్టులతో చిత్రహింసలకు పాల్పడ్డారు. అన్యాయం జరిగింది అన్నా కూడా ప్రతిపక్షాలతో ముడిపెట్టి వారికి న్యాయం చేయలేదు. వైసీపీ శ్రేణులు చంపేస్తున్నాయి.. రక్షించండి అంటూ పోలీసు స్టేషన్లకు వెళ్లినా పట్టించుకోకపోగా ఊర్లు వదిలి వెళ్లిపోండనే సలహాలతో సరి పెట్టారు. మరికొందరు పోలీసులైతే వైసీపీ వారిపైనే ఫిర్యాదు చేస్తారా అంటూ ఎదురు కేసులతో హింసించారు. ఐదేళ్ల ఖాకీరాజ్యంలో సామాన్యుల నుంచి ప్రతిపక్షా నేతల వరకు కనీసం మాట్లాడేస్వేచ్ఛ కూడా లేకుండా పోయింది. కొందరు ఎస్ఐలు, సీఐలే కాదు డీఎస్పీలు, ఐపీఎస్‌ల వరకు అధికార పార్టీ నేతలఆదేశాలకు అనుగుణంగా వైసీపీ చట్టం అమలు చేసేందుకు పోటీలు పడ్డారు. సామాన్యులు పోలీస్ స్టేషన్లకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మళ్లీ వచ్చేది వైసీపీ ప్రభుత్వమే అని ధీమాతో బరితెగించిన పోలీసుల్లో కూటమి ప్రభుత్వం అధికారంలో రావడంతో కలవరం మొదలైంది.

గుంటూరు, జూన్ 6: ఐదేళ్ల ఖాకీరాజ్యానికి.. ఐపీసీకి బదులు అమలైన వైసీపీ చట్టానికి చెక్ పడింది. ఐదేళ్ల అరాచక పర్వానికి తరపడింది. టీడీపీ, జనసేన కార్యకర్తలకే గాక సామాన్య ప్రజలకు కూడాస్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు లభించాయి. వైసీపీ పాలనలో ఐదేళ్ల చట్టం, న్యాయంతో పని లేకుండా అధికార పార్టీ నేతలు ఏది చెప్తే అదే అమలు చేసిన పోలీసుల్లో కలవరం మొదలైంది. బాధితులపైనే తప్పుడు కేసులు నమోదు చేసి వేధింపులకు గురి చేసిన వారు ఇప్పుడు ఎలా తప్పించుకోవాలా అన్న మీమాంశలో పడిపోయారు. వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత అధికార పార్టీ నేతల ఆదేశాలతో కొందరు పోలీసులు వైసీపీ కార్యకర్తలు లాగా వేధింపులకు పాల్పడ్డారు. మరికొందరు అధికార పార్టీ నేతల మెప్పుకోసం అతిగా వ్యవహరించారు. అనేకమంది పోలీస్ అధికారులు మూడు సింహాలు సిగ్గుపడేలా ఐపీసీని వైసీపీగా మార్చి అరాచకాలకు పాల్పడ్డారు. ఈ జాబితాలో అనేకమంది ఎస్పీల నుంచి సీఐలు, ఎస్ఐలు, డీఎస్పీలు ఉన్నారు. అయితే వారంతా ఇప్పుడు టీడీపీ నాయకులు భావిస్తున్నట్లు భయపడటం లేదు. టీడీపీలో తమకు తెలిసిన నాయకుల ద్వారా ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. దారుణంగా అరాచకానికి పాల్పడి హిట్ లిస్టులో ఉన్న వారిలో మాత్రం కొంతవరకు కలవరం కనపడుతుంది. దీంతో వారు రాబోయే ప్రభుత్వం ఈ దఫా ఎలా వ్యవహరించబోతుందోననే ఆందోళనతో ఎదురుచూస్తున్నారు. వైసీపీ హయాంలో కీలకమైన స్థానాల్లో ఉన్నవారు టీడీపీ, వైసీపీ వారి ఫోన్లు కూడా తీయకుండా, పలు సందర్భాల్లో కనీస గౌరవం కూడా ఇవ్వకుండా ఏకవచనంతో పిలుస్తూ దారుణంగా వ్యవహరించారు.

కార్యకర్తల్లో పెల్లుబికుతున్న ఆగ్రహం

గడిచిన ఐదేళ్లలో నెలకొన్న దారుణ పరిస్థితులను తలుచుకుని టీడీపీ, వైసీపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతున్నాయి. కూటమి అభ్యర్థులు అఖండ విజయం సాధిస్తూ కౌంటింగ్ సందర్భంగా ట్రెండ్ కొనసాగుతున్న సమయంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు అటు ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, విడదల రజిని కార్యాలయాలపై దాడికి ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించినా ఏ మాత్రం వెనక్కు తగ్గలేదు. ఈ సందర్భంగా కార్యకర్తలు వ్యవహరించిన తీరు గడిచిన 5 ఏళ్లలో వారు ఎదుర్కొన్న అణచివేత ప్రస్ఫుటంగా కనిపించింది. పోలీసులు లాఠీచార్జి చేస్తామన్న కార్యకర్తలు ఏమాత్రం వెనక్కు తగ్గలేదు. ఐదేళ్ల ఈ లాఠీలు ఏమయ్యాయని, ఎక్కడ దాచి పెట్టారంటూ అధికారులను సైతం నిలదీశారు. గడచిన ఐదేళ్లు తమకు నరకం చూపించారని ఇప్పుడు కూడా తమను వేధిస్తామంటే సహించేది లేదంటూ ఎదురు తిరిగారు. తమను, సామాన్య ప్రజలను గడిచిన ఐదేళ్లలో వేధించిన ఏ పోలీస్ అధికారిని సహించేది లేదని వారికి ఎక్కడ పోస్టింగ్ ఇవ్వకపోవడమే కాక వారి వేధింపులపై సమగ్ర విచారణ జరిపి చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రానున్న కొద్ది రోజుల్లో ప్రభుత్వ పాలనలో కీలకంగా మారిన పోలీస్ శాఖలో ప్రభుత్వ వైఖరి ఎలా ఉండబోతుందనే దానిపై అటు పోలీసు వర్గాల్లోను, ఇటు టీడీపీ, జనసేన కార్యకర్తల్లోనూ ఆసక్తి నెలకొంది.



పోలీసుల్లోనూ ఐదేళ్లుగా కొందరికి నరకం

గడిచిన ఐదేళ్ల అధికార పార్టీ నేతల వేధింపులు, పోస్టింగుల్లో వివక్షతో కొందరు పోలీసులు నరకం చూశారు. కొంతమంది స్వచ్ఛందంగా వలంటరీ రిటైర్మెంట్ ఇచ్చి వెళ్లే పరిస్థితికి తీసుకొచ్చారు. పలువురిపై తప్పుడు కేసులు బనాయించారు. నిష్పక్షపాతంగా విధులు నిర్వహించే వారిని కూడా వదలకుండా పోస్టింగ్స్ ఇవ్వకుండా వీఆర్‌లో ఉంచుతూ జీతం కూడా రానివ్వకుండా వేధింపులకు గురి చేశారు. చివరకు ఎన్నికలు విధులే కాకుండా సాధారణ బందోబస్తుల్లోనూ కీలక బాధ్యతలు అప్పగించకుండా ఎన్నో రకాలుగా వేధింపులకు గురిచేశారు. ఒకరిద్దరూ నిష్పక్షపాతంగా పనిచేసే వారు ఉన్నతాధికారుల మెప్పు పొంది జీతం కోసం లూప్‌లైన్ పోస్టింగ్ తెచ్చుకున్నప్పటికీ విషయం తెలుసుకుని వారిని అక్కడ కూడా ఉండనివ్వకుండా తరిమేశారు. ఈ పరిణామాలతో ఆ వర్గం పోలీసులు తీవ్ర మానసిక ఒత్తిడికి, ఆందోళనకు, ఆవేదనకు లోనయ్యారు. అలాగే వారితో పాటు టీడీపీ నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు ఉన్న వారిని కూడా పోస్టింగ్‌కు దూరంగా ఉంచారు. ఈ విధంగా తమ సర్వీసులో ఎన్నడూ చూడని విధంగా గడిచిన ఐదేళ్లలో వారికి నరకం చూపించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మారడంతో ఈసారైనా తమకు సముచిత స్థానం వస్తుందనే ఆశతో వారు ఎదురుచూస్తున్నారు.

- ఎస్ఐల నుంచి ఐపీఎస్‌ల వరకు బరితెగింపు
- వైసీపీ చట్టం అమలు చేయడంలో పలువురు పోటీ
- కోడ్ ముందు వరకు వారు ఆడిందే ఆట.. పాడిందే పాట
- టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకునేందుకు ఎవరి ప్రయత్నాల్లో వారు
- నాడు ఇబ్బందులు ఎదుర్కొన్న పోలీసులకు సముచిత స్థానం దక్కేనా?

ఖాకీరాజ్యంలో అరాచకం

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ఐదేళ్ల వైసీపీ పాలనలో ఖాకీరాజ్యం కొనసాగింది. పల్నాడులో పరిస్థితులు దారుణంగా తయారయ్యాయి. టీడీపీలో చురుగ్గా తిరుగుతుంటే చాలు ఎస్ఐలు, సీఐలు వారిని స్టేషన్లకు పిలిపించి వైసీపీ కండువా అయినా కప్పుకోండి లేదంటే ఊరు వదిలిపెట్టి వెళ్లిపోండి అంటూ నేరుగా బెదిరింపులకు దిగారు. లేదంటే అక్రమ మద్యం, హత్యాయత్నం వంటి కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని, రౌడీషీట్లు తెరుస్తామని హెచ్చరికలు జారీ చేశారు. అంతేకాక వారి మాట వినని వారిపై హెచ్చరించినట్లుగానే తప్పుడు కేసులు బనాయించి స్టేషన్లో లాఠీ కౌన్సెలింగ్ ఇచ్చి వేధింపులకు గురి చేశారు. నెలలు తరబడి జైళ్లలో మగ్గిపోయేలా చేశారు. అంతేకాక అనేక గ్రామాల్లో టీడీపీలో చురుగ్గా పనిచేసే నాయకులు, కార్యకర్తల హత్యల వెనుక పోలీసుల ఉదాశీన వైఖరి కూడా స్పష్టంగా కనిపించింది. ఏ కారణం లేకుండానే పార్టీ నాయకులను, కార్యకర్తలను స్టేషన్‌కు పిలిపించి వేధింపులకు గురి చేశారు. అనేక గ్రామాల్లో వైసీపీ గుండాల అరాచకాలకు టీడీపీ వర్గీయులు ఊళ్ల వదిలి పెట్టి వెళ్లిపోయారు. ఇంత జరుగుతున్నా పోలీసులు ఎక్కడా వారిని కట్టడి చేయకపోగా టీడీపీ వారిపైనే వేధింపులకు పాల్పడ్డారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఇంటిపైనా, టీడీపీ కేంద్ర కార్యాలయంపైనా ఒక రోజు ముందే హెచ్చరించి యదేచ్ఛగా దాడులకు పాల్పడ్డారు. రాజధానిలో చంద్రబాబు బస్సు యాత్ర చేస్తుంటే పోలీసుల సహకారంతోనే ఆయనపై దాడికి యత్నించడం, రాళ్ళు, కర్రలతో బస్సుపై దాడి చేయడం, మాచర్లలో టీడీపీ నేతలు బోండా ఉమామహేశ్వరరావు, బుద్దా వెంకన్న, న్యాయవాది పారా కిశోర్‌లపై హత్యాయత్నం, స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా అధికార పార్టీ నేతల మాదిరిగా బరితెగించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం వంటి దుర్మార్గ చర్యల్లో పోలీసులే కీలకంగా వ్యవహరించారు. పల్నాడులో వైసీపీ నాయకుల కంటే కూడా పోలీసులను చూస్తేనే టీడీపీ కార్యకర్తలు భయాందోళనకు గురయ్యారంటే వారి పని తీరు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

వైసీపీ కార్యాలయాల్లా పోలీస్‌స్టేషన్లు

ఐదేళ్లుగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లు వైసీపీ కార్యాలయాల మారాయంటే ఆశ్చర్యం కాదు. అధికార పార్టీ బాధితులు ఫిర్యాదు చేసేందుకు వెళ్తే అప్పటికే వారు అక్కడ ఉండటం.. వారే పోలీసులకు ఆదేశాలు జారీ చేయడం వాటిని ఆయా అధికారులు అమలు చేయడం సర్వసాధారణంగా మారింది. ఇక ప్రైవేటు పంచాయతీలు చేసే కేంద్రాలుగా పోలీసు స్టేషన్లను మార్చారనే అభియోగాలు వచ్చాయి. అధికార పార్టీ ల్యాండ్ మాఫియా చెప్పిందే ఖాకీలు తూచా తప్పకుండా పాటించారు. ఇదే అదునుగా పోలీస్ స్టేషన్లలో అవినీతి తాండవించింది. కేసు నమోదు చేయాలన్నా డబ్బులు, చేయకుండా ఉండాలన్నా డబ్బులు ఉండాల్సిందే. స్టేషన్ బెయిల్ ఇవ్వాలన్నా, కోర్టులో హాజరు పరచాలన్నా డబ్బులే. పోలీసు గడప తొక్కాలంటే జేబులో డబ్బులు కట్టలైనా ఉండాలి లేదంటే అధికార పార్టీ నేతల సిఫార్సు అయినా ఉండాలి. ఐదేళ్ల ఇలా ఖాకీ రాజ్యం సాగింది.

ప్రశ్నిస్తే కేసులు.. అరెస్టులు

అధికార పార్టీని కానీ, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను గాని ప్రశ్నించినా, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా సీఐడీ అధికారులు రాత్రి, పగలు తేడా లేకుండా ఆడ, మగ చూడకుండా, వయసుతో సంబంధం లేకుండా అరెస్టులు, విచారణల పేరుతో వేధింపులకు గురి చేశారు. వెంగళరావు, దారపునేని నరేంద్ర లాంటి టీడీపీ కార్యకర్తల నుంచి రంగనాయకమ్మ అనే కామన్ మ్యాన్ వరకు గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్బంధాలు... వేధింపులకు గురయ్యారు. అధికార పార్టీ ఎంపీగా ఉన్న రఘురామకృష్ణంరాజు అరెస్టు నుంచి తప్పుడు కేసులలో టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేశ్, కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడు, ధూళిపాళ్ల నరేంద్ర, బండారు సత్యనారాయణమూర్తి, అయ్యన్నపాత్రుడు వంటి వారందరి విచారణకు గుంటూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయం వేదికగా నిలిచింది. రాజధానిలో దళిత రైతులపైనే ఎస్సీ ఎస్టీ కేసులు బనాయించి వారాల తరబడి జైళ్లలో నిర్బంధించారు. అనేక మంది వృద్ధులైన రాజధాని రైతులపై కూడా తప్పుడు కేసులు బనాయించి జైళ్లకు పంపారు. రాజధాని మహిళా రైతులపై అత్యంత కర్కశంగా లాఠీలతో విరుచుకుపడ్డారు.

సిఫార్సు బదిలీలకు చెక్

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇలాంటివి 70పైనే
- ఒక్కో బదిలీకి రూ.4 లక్షల వరకు ముడుపులు వసూలు
- పల్నాడు జిల్లా నుంచి గుంటూరుకు 40 మంది బదిలీ
- తాడేపల్లి ఎమార్సీలో చక్రం తిప్పిన ఓ ఉపాధ్యాయుడు
- అక్రమ బదిలీలపై ఆందోళనలను పట్టించుకోని అప్పటి ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వం అధికారం.. అక్రమ బదిలీల రద్దుకు ఆదేశాలు

గుంటూరు(విద్య), జూన్ 6: ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన ఉపాధ్యాయ బదిలీలను నిలిపివేస్తూ కొత్త ప్రభుత్వం బ్రేక్ వేసింది. దీంతో సిఫార్సులతో ముడుపులు ఇచ్చి బదిలీలు చేయించుకున్న ఉపాధ్యాయుల నోట్లో పచ్చివెలక్కాయ పడింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సిఫార్సు బదిలీలు దాదాపు 70పైగానే ఉన్నట్లు ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. ఇందులో అత్యధిక మంది పల్నాడు తదితర ప్రాంతాల నుంచి గుంటూరు జిల్లాలోని నాలుగు మున్సిపల్ కేంద్రాల్లోకి బదిలీలు తెచ్చుకున్నారు. ఇలా సిఫార్సు బదిలీ కోసం ఒక్కో ఉపాధ్యాయుడు రూ.2.50 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు చెల్లించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 14 వేల మంది ఉపాధ్యాయులు ఉన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యారంగాన్ని అస్తవ్యస్తం చేసింది. నాలుగేళ్లలో ఒకసారి ఏదో తూతూమంత్రంగా బదిలీలు చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. మరోవైపు యాప్‌ల పేరుతో ఉపాధ్యాయులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకువచ్చింది. దీంతో అనేక మంది స్వచ్ఛంద ఉద్యోగ విరమణతో బడికి దూరమయ్యారు. దీంతో అనేక ప్రాంతాల్లో ఉపాధ్యాయు ల కొరత తీవ్రస్థాయిలో ఏర్పడింది. అనేక పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల సమయంలో కూడా సబ్జెక్టు టీచర్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడాల్సిన వచ్చింది. ఈ నేపథ్యంలో ఏప్రిల్‌లో విడతల వారీగా దాదాపు 70పైగా సిఫార్సు బదిలీలు జరిగాయి. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్రస్థాయిలో ఆందోళన చేసినా ఫలితం లేకుండా పోయింది. ఇదే సమయంలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఈ బదిలీలకు తాత్కలికంగా బ్రేక్ పడింది. ఒక్కో బదిలీకి భారీ మొత్తంలో ముడుపులు తీసుకుని ఉత్తర్వులు ఇచ్చినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అక్రమ బదిలీలు, పరస్పర ఒప్పంద(మ్యూచువల్ బదిలీలు) తాడపల్లిలోని ఓ ఎమ్మార్సీ నుంచి ప్రారంభమయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ దాదాపు 15 ఏళ్లుగా ఉన్న ఓ ఉపాధ్యాయుడు ఇటువంటి అక్రమాలు చేయడంతో సిద్ధహస్తుడనే ఆరోపణ ఉంది. ఆయన నేరుగా విద్యాశాఖ పేషీలో చక్రం తిప్ప అక్రమ బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇప్పించే వాడని ప్రచారం ఉంది. ఈ నెల 12న పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఈలోగా కొత్త ప్రభుత్వం కొలువు దీరనుంది. ఈ క్రమంలో సిఫార్సు బదిలీలు రద్దయ్యే పరిస్థితి నెలకొంది. ఈ చర్యపై ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.



అమాత్యులు.. అయ్యేదెవరో?



- మంత్రి పదవుల రేసులో పలువురు సీనియర్లు
- జనసేన కోటాలో మనోహర్‌కి ఛాన్స్ దక్కే అవకాశం
- ఆశావహుల్లో ఆరోసారి గెలుపొందిన కన్నా, నరేంద్ర
- ఎస్సీ కోటాలో ఆ ముగ్గురిలో ఎవరి ప్రయత్నాలు ఫలించేనో

గుంటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ లేనట్లుగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. 17 నియోజకవర్గాల్లోనూ కూటమి అభ్యర్థులు గెలుపొందారు. టీడీపీ సీనియర్లు అందరూ విజేతలుగా నిలిచారు. దీంతో కూటమి ప్రభుత్వంలో మంత్రి పదవులపై అందరూ ఆశపడుతున్నారు. రాజధాని ప్రాంతమైన ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ పర్యాయం చాలామంది మంత్రి పదవులు ఆశిస్తూ ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించారు. 2014లో టీడీపీ గెలుపొందిన సమయంలో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ప్రత్తిపాటి పుల్లారావు(చిలకలూరిపేట) మంత్రి పదవిని చేపట్టి ఐదేళ్లు కొనసాగారు. అయితే ఎస్సీ కోటాలో తొలుత మంత్రి పదవి దక్కించుకున్న రావెల కిశోర్‌బాబు(ప్రత్తిపాడు) రెండున్నరేళ్లే ఉన్నారు. ఆ తర్వాత ఆయన్ను తప్పించగా నక్కా ఆనందబాబు(వేమూరు)ను అమాత్య పదవి వరించింది. రాబోయే ప్రభుత్వంలో ప్రత్తిపాటితో పాటు ఆనందబాబులు ఇద్దరూ రేసులో ఉన్నారు. ఇక పొన్నూరు నుంచి ఆరోసారి గెలిచిన ధూళిపాళ్ల నరేంద్రకుమార్ కూడా మంత్రి పదవి రేసులో ఉన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో మంత్రి అంబటి రాంబాబును ఓడించిన సీనియర్ నేత కన్నా లక్ష్మీనారాయణ కూడా మంత్రి పదవి రేసులో ఉన్నారు. ఆయనకు గతంలో వివిధ శాఖల మంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది. అలాగే రేపల్లె నుంచి మూడో సారి విజయం సాధించిన అనగాని సత్యప్రసాద్ కూడా బీసీ కోటాలో మంత్రి పదవిని ఆశిస్తున్నారు. కాగా ఈ పర్యాయం తాడికొండ, ప్రత్తిపాడు ఎస్సీ నియోజకవర్గాల నుంచి గెలుపొందిన తెనాలి శ్రావణ్‌కుమార్, బూర్ల రామాంజనేయులు కూడా మంత్రి పదవులను ఆశిస్తున్నారు. శ్రావణ్‌కుమార్ రాజధాని ప్రాంత ఎమ్మెల్యే కావడమే కాకుండా రెండో సారి గెలిచిన సీనియార్టీ కూడా తనకుందనే భావనలో ఉన్నారు. ఇక ప్రత్తిపాడు నుంచి గెలుపొందిన రామాంజనేయులు సీనియర్ ఐఏఎస్ అధికారిగా తనకున్న అనుభవం మూలంగా గెలిచింది మొదటి సారే అయినా తన పేరు కూడా పరిశీలనలో ఉంటుందనే భావనలో ఉన్నారు. ఇక గుంటూరులో తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల నుంచి గెలుపొందిన ఇద్దరు ఎమ్మెల్యేలు తొలిసారే అసెంబ్లీలోకి అడుగు పెడుతున్నప్పటికీ వారు కూడా మంత్రి పదవులు ఆశిస్తున్నారు. మంత్రి విడదల రజనీని ఓడించి 51 వేలకు పైగా మెజార్టీతో ప్రతిష్టాత్మకమైన విజయం సాధించడం మూలంగా తన పేరు కూడా పరిశీలనలో ఉంటుందని గళ్లా మాధవి ఆశలో ఉన్నారు. తూర్పు నుంచి గెలిచిన ఎండీ నసీర్ అహ్మద్ రెండు దశాబ్దాల తర్వాత నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగరవేసిన తన పేరును సామాజిక అంశం కోణంలో పరిశీలించే అవకాశం ఉందనే ఆశలో ఉన్నారు. ఇక పల్నాడు జిల్లాలో మంత్రి పదవుల రేసులో మరికొందరు సీనియర్లు ఉన్నారు. నిన్న మొన్నటి దాకా పల్నాడు జిల్లా అధ్యక్షుడుగా పనిచేసి మూడో సారి అసెంబ్లీలోకి అడుగు పెడుతున్న వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కూడా అమాత్య పదవి తనను వరిస్తుందనే ఆశలో ఉన్నారు. అలాగే గురజాల నియోజకవర్గం నుం చి నాలుగోసారి విజయఢంకా మోగించిన యరపతినేని శ్రీనివాసరావు తాను తప్పనిసరిగా సీఎం చంద్రబాబు కేబినెట్‌లో ఉంటాననే ధీమాతో ఉన్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరాచకాలకు అడ్డుకట్ట వేసి ప్రతిష్టాత్మకమైన విజయం సాధించిన మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి కూడా తాను గెలిచింది మొదటిసారే అయినా అక్కడి పరిస్థితుల దృష్ట్యా మంత్రి పదవిని చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందనే భావనలో ఉన్నారు. పైగా పల్నాడు జిల్లాలో బ్రహ్మారెడ్డే అత్యధిక మెజార్టీతో విజయం సాధించారు.

పర్చూరులో.. ఏలూరి రికార్డు

- వరుసగా మూడు పర్యాయాలు విజయం
- టీడీపీ కూటమి శ్రేణుల్లో ఆనందోత్సాహాలు
- వైసీపీ కుట్రలను ఛేదించి మరీ గెలుపు తీరాలకు

చీరాల జూన్ 6: పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచిన ఏలూరి సాంబశివరావు వరుసగా మూడో సారి గెలిచి రికార్డు సృష్టించారు. నియోజకవర్గం ఆవిర్భావం తర్వాత వరుసగా మూడు పర్యాయాలు గెలుపొందిన ఎమ్మెల్యేగా ఏలూరి రికార్డు నమోదు చేశారు. గతంలో ఎన్నడూ జరిగిన స్థాయిలో ఈ సారి ఎన్నికలకు సంబంధించి వైసీపీ ఎన్ని కుట్రలు పన్నినా వాటన్నింటిని ఛేదించుకుని మరీ ఏలూరి విజయతీరాలకు చేరారు. 21,000 ఫాం7లను సొంత పార్టీ శ్రేణుల చేత దరఖాస్తు చేయించి దొడ్డిదారిన గెలుపుకోసం ప్రయత్నించిగా వాటిని ఎదురొడ్డి నిలిచారు. తాజా ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి యడం బాలాజీపై 24,138 ఓట్లు మెజార్టీతో సాంబశివరావు గెలుపొందారు. దీంతో టీడీపీతో పాటు కూటమి భాగస్వామ్య పార్టీలైన జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి.

2014లో తొలిసారిగా..

2014లో తొలుత పర్చూరు నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఏలూరి గెలుపొందారు. ఆ ఎన్నికలో ఏలూరి 97,248 సాధించి ప్రత్యర్థి గొట్టిపాటి భరత్‌పై 10వేల పైచిలుకు ఓట్లుతో గెలుపొందారు. 2019 ఎన్నికల్లో ఏలూరి వైసీపీ అభ్యర్థి డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావుపై విజయం సాధించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక 2019 నుంచి ఎమ్మెల్యే ఏలూరిపై అనేక రకాల ఒత్తిళ్లు పెరిగాయి. అయినా శ్రేణులను కాపాడుకుంటూ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ ఏలూరి ముందుకు సాగారు. ఏలూరికి చెందిన నోవా అగ్రిటెక్ సంస్థపై కేసులు నమోదు చేశారు. గ్రానైట్ వ్యాపారులపై అధికార దందా పెరగా ఏలూరి వారికి మద్దతుగా నిలిచారు. ఈ నేపథ్యంలో చీరాలకు చెందిన ఎన్ఆర్ఐ యడం బాలాజీ వైసీపీ అభ్యర్థిగా 2024 ఎన్నికల బరిలో నిలిచారు. అయితే నియోజకవర్గంలో కూటమి శ్రేణులతో పాటు పలు గ్రామాల ప్రజలు, విపక్షాల నేతలు ఏలూరితో కలసి పనిచేసేందుకు ముందడుగు వేశారు. ఈ క్రమంలో 24,138 ఓట్లు భారీ మెజార్టీతో గెలుపొందారు.



పార్టీ శ్రేణుల మధ్య సంబరాలు చేసుకుంటున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు(ఫైల్)

ఎన్నికల నిర్వహణ ఖర్చులు చెల్లించేదెప్పుడు..?

పంచాయతీ కార్యదర్శుల ఎదురుచూపు



కొలలపూడి హైస్కూల్‌లో పోలింగ్ బూత్ వద్ద ఏర్పాటు చేసిన టెంట్లు (ఫైల్)

మార్టూరు, జూన్ 6 : ఎన్నికల నిర్వహణ సజావుగా జరిగేందుకు పోలింగ్ బూత్‌లవద్ద మౌలికవసతులను పంచాయతీ కార్యదర్శులు సొంతసొమ్ముతో ఏర్పాటు చేశారు. కాని వారికి నేటికీ అధికారులు డబ్బులు చెల్లించలేదు. ఇతర మండలాల్లో అధికారులు డబ్బులు చెల్లించారని కానీ మార్టూరు మండలంలో ఎందుకు చెల్లించలేదో తెలియడం లేదని పంచాయతీ కార్యదర్శులు లోలోపల మదనపడుతున్నారు. గత నెల 13వ తేదీన జరిగిన అసెంబ్లీ ఎన్నికలుకు సంబంధించి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి వసతులను ఏర్పాటు చేసే బాధ్యత అప్పజెప్పారు.మండలంలో 72 పోలింగ్ బూత్ లు ఉన్నాయి. గ్రామాలలో పోలింగ్ బూత్‌లు ఎక్కువగా స్కూళ్ల ఆవరణలోనే ఉన్నాయి. అయితే ఈ బూత్‌లవద్ద విద్యుత్ సౌకర్యం, షామియానాలు, బారికేడ్లు, ఓట్లు పోలింగ్ రోజున సిబ్బందికి టిఫిన్లు, భోజనం తదితర ఏర్పాట్ల కోసం ఒక్కో బూత్‌కు రూ.8వేలు కేటాయించినట్లు పంచాయతీ కార్యదర్శులు చెప్తున్నారు. ఆ బాధ్యతను బీఎల్‌వోలు, వీఆర్‌వో, వీఆర్ఏలు చేపట్టారు. మార్టూరు మండలంలో ఎంపీడీవో జోక్యంతో ఆ బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై పడినట్లు తెలిసింది. పంచాయతీ కార్యదర్శులు సొంతంగా జేబులోని సొమ్ములు పెట్టి ఏర్పాట్లు చేయించారు. రూ.8 వేలు ప్రభుత్వం కేటాయించినా ఒక్కో బూత్‌కు రూ.10వేల నుంచి రూ.12వేల వరకూ ఖర్చు చేసినట్లు పంచాయతీ కార్యదర్శులు చెప్తున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయినా నేటికీ బిల్లులు చెల్లించకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని మండలాల్లో తహసీల్దార్లు ఆ ఖర్చుల సొమ్మును పంపిణీ చేశారు. ఈ మండలానికి నిధులు రాలేదా.. వచ్చినా చెల్లించడం లేదా అని కార్యదర్శులు మదన పడుతున్నారు. మార్టూరు గ్రామంలో 19 బూత్‌లున్నాయి, వలపర్ల, కోనంకి, కోలలపూడి, నాగరాజుపల్లి ద్రోణాదుల తదితర గ్రామాలలో బూత్‌లు ఎక్కువగా ఉన్నాయి, కనీసం 4బూత్‌లు ఉన్న చోట పంచాయతీ కార్యదర్శులు రూ.30వేల నుంచి 40 వేలదాకా చేతిసొమ్ము పెట్టారు. మార్టూరులో అయితే రూ.లక్షకు పైగానే ఖర్చు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై తహసీల్దార్ సంధ్యశ్రీని వివరణ కోరగా.. డబ్బులు వచ్చాయని వాటిని ఎంపీడీవోకు ఇచ్చామన్నారు. అంతేగాకుండా ఇంకా కొంత డబ్బులు రావాలని వాటికి సంబంధించిన బిల్లులను పర్చూరు ఆర్‌వోకు పంపించామన్నారు.

టిప్పర్ ఢీకొని బైకిస్టుకు గాయాలు

మార్టూరు, జూన్ 6 : మార్టూరు నుంచి డేగరమూడి వెళ్లే సర్వీసు రోడ్ లో శ్రీచైతన్య స్కూల్ సమీపంలో ద్విచక్రవాహనదారుడిని టిప్పర్ ఢీకొన్న సంఘటన గురువారం మధ్యాహ్నం జరిగింది. ఈ ప్రమాదంలో షేక్ యాసిన్ షరీఫ్ అనే యువకుడు కాలికి తీవ్రగాయమైంది. అతను ద్విచక్రవాహనాన్ని రోడ్ పక్కన ఉన్న మెకానిక్ షాపులో బాగుచేయించుకొని రోడ్‌పైకిరాగా మార్టూరు వైపు నుంచి డేగరమూడి వైపు సర్వీసురోడ్‌లో వెళుతున్న టిప్పర్ ఢీ కొన్నది. దాంతో టిప్పర్ ముందు చక్రాల కింద పడిపోయిన ద్విచక్రవాహనదారుడిని కొంతదూరం ఈడ్చుకుపోయింది. అనంతరం గాయాలకుగురైన అతనిని 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గుంటూరులోని చుట్టుగుంట ప్రాంతానికి చెందిన యువకుడు వ్యక్తిగత పనులు నిమిత్తం మార్టూరు వచ్చి మరలా గుంటూరుకు వెళుతుండగా ప్రమాదం జరిగింది. మెరుగైన వైద్యం నిమిత్తం యువకుడ్ని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సుగాలికాలనీవాసి అనుమానాస్పదమృతి

మార్టూరు, జూన్ 6: మార్టూరు గ్రామ పంచాయతీలోని సుగాలికాలనీకి చెందిన మాడావతు బాలాజీనాయక్ (53) అనుమానాస్పదంగా కూరగాయల మార్కెట్ యార్డు పక్కన సుగాలికాలనీకి వెళ్లేరోడ్‌లో మృతిచెందిన సంఘటన జరిగింది. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఏఎస్‌ఐ బాషా కథనం మేరకు.. గత కొన్నిరోజుల నుంచి బాలాజీ నాయక్ కుటుంబ సభ్యులతో కాకుండా విడిగా ఉంటున్నారు. అతను బుధవారం సాయంత్రం తండాలోని ఇంటి నుంచి మార్టూరు కూరగాయల మార్కెట్ వద్దకు ఆటోలో వచ్చారు. తర్వాత ఏం జరిగిందో తెలియదుగాని గురువారం ఉదయం 10గంటల సమయంలో రోడ్డుపక్కన బాలాజీనాయక్ మృతదేహాన్ని కాలనీ వాసులు గమనించారు. తరువాత వారు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి భార్య సోనాబాయితో పాటు బంధువులు వచ్చారు. అతని మృతిపై వారు అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సీఐ రాజశేఖర్‌రెడ్డి ఆస్పత్రి వద్దకు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. తరువాత మృతదేహానికి పోస్టుమార్టమ్ నిర్వహించారు. అతని కుమారుడు గోపీనాయక్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పదమృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ బాషా తెలిపారు.

గ్రంథాలయాలతో బంగారు భవిష్యత్



విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్‌లను అందజేస్తున్న గ్రంథపాలకుడు సుగుణరావు

అద్దంకిటౌన్, మే 6 : కులమత భేదాలు లేకుండా జ్ఞాన సంపాదనకై అందరినీ ఆహ్వానించేది గ్రంథాలయమని, బాలబాలికలు గ్రంథాలయాను వినియోగించుకొని భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని విద్యాన్ జ్యోతి చంద్రమౌళి అన్నారు. అద్దంకి శాఖ గ్రంథాలయంలో గత 23 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం గురువారం గ్రంథపాలకుడు సీహెచ్.సుగుణరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, మ్యాథమెటిక్స్‌లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి అనంతరం వారికి బహుమతులు, సర్టిఫికెట్‌లను అందజేశారు.

నూతన గ్రంథాలయ నిర్మాణానికి స్థలం

అద్దంకి గ్రంథాలయం నూతన భవన నిర్మాణానికి సంబంధించి ఎన్ఎస్‌పీ కాలనీలో 10 సెంట్ల స్థలాన్ని తహసీల్దార్ సర్వే చేసి స్థలాన్ని కేటాయించడం జరిగిందని నూతన భవన నిర్మాణ పోరాట సభ్యుడు మన్నం త్రిమూర్తులు తెలిపారు. ఈ స్థలానికి సంబంధించిన పత్రాలను కలెక్టర్‌కు పంపించామన్నారు. అందరి సహకారంతో దీనిని సాధించుకుందామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ యూదేవపాలన, వీరయ్య, సందిరెడ్డి శ్రీనివాసరావు, రఫీ, దివాకర్‌దత్తు, రమేష్, బాబు, వీర్రాజు, బాలకోటయ్య పాల్గొన్నారు.

మార్టూరులో..

మార్టూరు : గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు గురువారంతో ముగిశాయి. పిల్లలతో చదవడం మాకిష్టం ప్రతిజ్ఞ చేయించినట్లు శాఖ గ్రంథాలయ గ్రంథపాలకుడు పీజే రామారావు తెలిపారు. కొద్ది రోజులుగా పలు నిర్వహించిన పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

చినగంజాంలో..



విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందజేస్తున్న హరిబాబు

చినగంజాం : విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని రిటైర్డ్ అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ అధికారి పర్వతరెడ్డి హరిబాబు, జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు ఎస్.నరసింహారావు అన్నారు. శాఖ గ్రంథాలయం చినగంజాంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం ముగింపు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. గత నెల 15 నుంచి విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకులు ఏఎం లక్ష్మీనరసింహాచార్యులు తెలిపారు. విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు కంప్యూటర్, పుస్తక పఠనం, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్ తదితర విషయాలలో రిసోర్సుపర్సన్‌లు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొన విద్యార్థులకు సర్టిఫికెట్లు, వివిధ పోటీలలో విజేతలైన వారికి బహుమతులను అందజేసినట్లు తెలిపారు. శిబిరానికి సహకారం అందించిన పర్వతరెడ్డి హరిబాబు, సులోచన దంపతులను గ్రంథపాలకులు, రిసోర్సుపర్సన్‌లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిసోర్సుపర్సన్ పల్లపోలు శ్రీబాబు పాల్గొన్నారు.

ఒంగోలు లోక్‌సభలో భారీగా క్రాస్ ఓటింగ్

- ఎమ్మెల్యే అభ్యర్థులకన్నా మాగుంటకు అన్నిచోట్ల తగ్గిన ఆధిక్యత
- క్రాస్ ఓటింగ్‌పై తర్జనభర్జన ప్రారంభం
- వైసీపీ శ్రేణులే అటుఇటు వేసినట్లు అంచనా

ఒంగోలు లోక్‌సభ పరిధిలో టీడీపీ కూటమి అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థుల మధ్య క్రాస్ ఓటింగ్ జరిగింది. క్రాస్ ఓటింగ్ కూడా అధికంగా జరగటం, అందునా టీడీపీ అసెంబ్లీ అభ్యర్థుల కన్నా మాగుంటకు ఓట్లు తక్కువ వచ్చాయి. ఇటు టీడీపీ శ్రేణుల్లోనే కాక యావత్తు రాజకీయవర్గాల్లో ఈ అంశం చర్చనీయాంశమైంది. అసెంబ్లీ అభ్యర్థులకు వచ్చిన ఓట్ల కన్నా 25వేల పైబడిన ఓట్లు మాగుంటకు తక్కువగా వచ్చాయి. అన్నీ అసెంబ్లీ స్థానాల్లో మాగుంట అంతోఇంతో వెనుకబడగా పశ్చిమప్రాంత నియోజకవర్గాల్లో కూడా మాగుంటకు తక్కువ ఓట్లు రావటం విశేషం. ఇటు టీడీపీ కన్నా అటు వైసీపీ శ్రేణులే ఎక్కువగా క్రాస్ ఓటింగ్‌కు పాల్పడటమే మాగుంట అధిక్యత తగ్గటానికి కారణంగా ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఒంగోలు పార్లమెంట్ స్థానంలో భారీగా క్రాస్ ఓటింగ్ జరిగింది. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ అభ్యర్థులకు వచ్చిన స్థాయిలో ఎంపీ అభ్యర్థి మాగుంటకు రాకపోవడం జిల్లాలో చర్చనీయాంశమైంది. ఎన్నికల నోటిఫికేషన్‌కు కొద్దిరోజుల ముందుగా మాగుంట వైసీపీని వీడి టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. తన కుమారుడి రాఘవరెడ్డిని పోటీలో దించాలని మాగుంట భావించగా చివరి క్షణంలో చంద్రబాబు జోక్యం చేసుకొని మాగుంటనే రంగంలో దించారు. మాగుంటకు మద్దతుగా పలు నియోజకవర్గాల్లో వైసీపీ నుంచి కొందరు ముఖ్యులు మరికొందరు సానుభూతిపరులు టీడీపీలో చేరారు. ఇంకొందరు వైసీపీలోనే ఉండి మాగుంటకు సహకరిస్తారని అంచనా వేశారు. తీరా ఎన్నికల ఫలితాలను చూస్తే టీడీపీ అసెంబ్లీ అభ్యర్థుల కన్నా మాగుంటకు తక్కువ ఓట్లు వచ్చాయి.

లోక్‌సభ పరిధిలోని ఐదు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థులు గెలుపొందగా వారికి రమారమీ 84వేల పైచిలుకు ఆధిక్యత లభించింది. ఎర్రగొండపాలెం, దర్శిలో స్వల్ప ఆధిక్యతతోనే వైసీపీ అభ్యర్థులు గెలుపొందారు. ఆ రెండుచోట్ల వైసీపీ అసెంబ్లీ అభ్యర్థులకు సుమారు 8వేల ఆధిక్యత మాత్రమే లభించింది. ఆ ఆధిక్యతను తీసేసినా ఐదు నియోజకవర్గాల్లో గెలుపొందిన టీడీపీ అసెంబ్లీ అభ్యర్థులకు సుమారు 75వేల ఓట్ల ఆధిక్యత కనిపిస్తోంది. అయితే లోక్‌సభ అభ్యర్థి మాగుంట 55వేల ఓట్ల ఆధిక్యతతో మాత్రమే గెలుపొందారు. అన్నీ నియోజకవర్గాల్లో ఈవీఎం ఓట్లు, ఉద్యోగుల ఓట్లు, సర్వీసు ఓట్లు కలిపిన జాబితాల తుది నివేదికలు ఇంకా బయటకు తీయనప్పటికీ గెలుపొందిన టీడీపీ అభ్యర్థుల ఆధిక్యత కన్నా మాగుంటకు సుమారు 25వేల ఓట్ల ఆధిక్యత తగ్గింది.

అన్నిచోట్ల తగ్గిన ఆధిక్యత

ఏడు నియోజకవర్గాల్లోను టీడీపీ కూటమి అసెంబ్లీ అభ్యర్థుల కన్నా మాగుంటకు తక్కువ ఓట్లు వచ్చాయి. ఒంగోలులో దామచర్ల కన్నా సుమారు 3,500 ఓట్లు, కొండపిలో సుమారు 4,669 ఓట్లు, మాగుంటకు తగ్గాయి. కనిగిరిలో మాగుంట కన్నా అసెంబ్లీ నుంచి గెలుపొందిన డాక్టర్ ఉగ్రాకు 8,500 ఓట్లు అధికంగా రాగా, మార్కాపురంలో కందుల కన్నా సుమారు 6,900 ఓట్లు, గిద్దలూరులో అశోక్‌రెడ్డి కన్నా సుమారు 7వేల ఓట్లు మాగుంటకు తక్కువగా వచ్చాయి. కూటమి అభ్యర్థులు ఓడిపోయిన దర్శిలో కేవలం 50 ఓట్లు మాగుంటకు తక్కువగా రాగా, ఎర్రగొండపాలెంలోను మాగుంటకు 5వేల ఓట్లు మాత్రమే తగ్గాయి.

అసలు కారణం అదేనా?

క్రాస్ ఓటింగ్‌కు రెండురకాల కారణాలు ఉండవచ్చని అంచనాలు వేస్తున్నారు. ప్రధానంగా మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల్లో వైసీపీలోని రెడ్డి సామాజికవర్గం ఓటర్ల నుంచి టీడీపీ కూటమి అసెంబ్లీ అభ్యర్థులకు ఓట్ల బదిలీ జరిగిన విషయం జగమెరిగిన సత్యం. మార్కాపురం, కనిగిరిలో అయితే తమ సామాజిక వర్గం వారికి టికెట్ ఇవ్వలేదన్న ఉక్రోషం వైసీపీలోని రెడ్డి నాయకుల్లో వ్యక్తమైంది. దానికితోడు టీడీపీ నుంచి రెడ్డి సామాజికవర్గం రంగంలో ఉండటం ఇద్దరు స్థానికంగా బలమైన ప్రజాసంబంధాలు కల్గి ఉండటం, ముందు నుంచి ఆ సామాజికవర్గ వైసీపీ ఓటర్లపై దృష్టిసారించి పనిచేశారు. గిద్దలూరులోను స్థానికంగా ఉన్న తమ వారికి టికెట్ ఇవ్వలేదనే అసంతృప్తి వైసీపీలోని ఆ సామాజిక నేతల్లో వ్యక్తమైంది. దానికి తోడు టీడీపీ అభ్యర్థికి బలమైన బంధుత్వం ఏర్పడింది. దీంతో ఈ మూడు నియోజకవర్గాల్లోని రెడ్డి ఓటర్లు అసెంబ్లీకి టీడీపీకి వేసి ఒక్క ఓటయినా వైసీపీకి వేయాలన్న ఆకాంక్షతో పార్లమెంట్ వైసీపీకి వేసినట్లు తేటతెల్లమవుతుంది. అందుకు కొన్నిప్రాంతాల్లో స్పష్టమైన సంకేతాలు కూడా బహిరంగంగా కనిపించాయి.

టీడీపీ శ్రేణులు చేశారా?

ఒంగోలు, కొండపిల్లో కూడా అసెంబ్లీ అభ్యర్థుల కన్నా మాగుంటకు ఓట్లు తగ్గటంపై రసవత్తర చర్చ జరుగుతుంది. క్రాస్ ఓటింగ్‌కు టీడీపీ శ్రేణులు కూడా పాల్పడ్డారా? అనే అనుమానం కొందరు వ్యక్తం చేస్తున్నా రు. అయితే, కొత్తగా టీడీపీకి బదిలీ అయిన ఓటర్లే అటుఇటు వ్యవహరించారన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఇంతకన్నా వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న వామపక్ష భావజాల, కాంగ్రెస్ పార్టీ అభిమాన ఓటర్లు, అసెంబ్లీలో టీడీపీకి ఓటు వేసి పార్లమెంట్‌లో బీజేపీని గుర్తు చేసుకొని ఓటు వేయలేక వైసీపీకి లేక కాంగ్రెస్‌కు ఓటు వేయటం ద్వారా మాగుంట ఆధిక్యత తగ్గి ఉండవచ్చని భావిస్తున్నారు.

ఏది ఏమైనా విశ్లేషకుల అంచనా లకు అతీతంగా అసెంబ్లీ అభ్యర్థుల కన్నా మాగుంటకు ఓట్లు తగ్గటం చర్చనీయాంశంగా మారింది.

పంచాయతీ భవనంలో మద్యం బాటిళ్లు

- పాడు కార్యకలాపాలకు సూత్రధారులెవరు?
- విస్తుపోయిన ద్రోణాదుల గ్రామస్థులు



పంచాయతీ భవనంలోని ఓగదిలో ఉన్న బీరుసీసాలు, మద్యం బాటిళ్లు

మార్టూరు, జూన్ 6 : పై ఫొటోలో చక్కటి డబుల్‌కాట్ మంచం.. ఈ మంచంపై మెత్తని పరుపు.. పక్కనే దిండు.. వాటిపై ఏకంగా బీరు సీసాలు, మద్యం బాటిళ్లు ఈ సన్నివేశం చూసి మీరు ఇదేదో లాడ్జిలా ఉంది అనుకుంటే పొరబడినట్లే.. పోనీ ఎవరైనా మందుబాబుల ఇల్లా అనుకుంటే మరింతగా పొరబడినట్లే.. మరి ఈ దృశ్యం మండలంలోని ద్రోణాదుల గ్రామపంచాయతీ భవనంలోని గదిలో అంటే మీరు నమ్ముతారా..? కచ్చితంగా నమ్మాల్సిందే. గురువారం ఈ దృశ్యం చూసి ద్రోణాదుల గ్రామస్థులు విస్తుపోయారు. ఆ సంగతేంటో చూద్దాం.. ద్రోణాదుల గ్రామ పంచాయతీ భవనంపైన పదేళ్ల కిందట మొదటి అంతస్తు భవనం నిర్మించారు. ఈ భవనంలో ఒక గదిని కూడా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ గ్రామ సర్పంచ్ వంకాయలపాటి భాగ్యారావు వైసీపీ పార్టీ మద్దతుదారు కావడంతో టీడీపీ వారు పంచాయతీ కార్యకలాపాలకు కొంచెందూరంగానే ఉన్నారు. కారణాలు ఏమైనా గతంలో గ్రామంలోని సుమారు 50 మందికి పైగా వ్యక్తులపై సర్పంచ్ అట్రాసిటీ కేసులు పెట్టిన విషయం తెలిసిందే. ఇదిలావుండగా టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రానుండడంతో గురువారం కొంతమంది గ్రామస్థులు పంచాయతీ భవనం వద్దకు వచ్చి మొదటి అంతస్తును పరిశీలించారు. గదిలో మద్యం సీసాలు ఉండడంతో గ్రామస్థులు ఆశ్చర్యపోయారు. ఈ గదిని ఎంతకాలం నుంచి ఇలా వినియోగిస్తున్నారని అందరిలో చర్చ మొదలైంది. ఈ గదిలో మద్యం సేవిస్తున్నదెవరు? ఇంకెమైనా అక్రమ కార్యకలాపాలు చేస్తున్నారా..? పంచాయతీ సర్పంచ్ లేదా, సిబ్బంది.. మరెవరైనా ఇతరులు అడ్డదారిలో ఈ భవనాన్ని ఇలా వినియోగిస్తున్నారా? అనే ప్రశ్నలు తలెత్తాయి. సంబంధిత అధికారులు దాని నిగ్గు తేల్చి నోరువిప్పాల్సి ఉంది. గ్రామ నడిబొడ్డున ఉన్న పంచాయతీ భవనంలో ఇలాంటిపాడు చర్యలు తామెప్పుడూ చూడలేదు..గ్రామ పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆగని గ్రావెల్ అక్రమ తరలింపు

- ధర్మవరం చెరువు నుంచి యథేచ్ఛగా తవ్వకం
- ప్రభుత్వం మారినా.. ఆగని వైసీపీ నేతల దందా



ధర్మవరం పెద్ద చెరువు నుంచి గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్‌లు

అద్దంకి, జూన్ 6 : ధర్మవరం చెరువు నుంచి గ్రావెల్ అక్రమ తరలింపు ఇంకా ఆగలేదు. వైసీపీ నేతల కనుసన్నలలో సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో 10 అడుగుల లోతుతో తవ్వకాలు జరిగాయి. రాష్ట్రంలో వైసీపీ అధికారం కోల్పోయిన గ్రావెల్ దందాకు ఆ పార్టీ నేతలు ఫుల్‌స్టాప్ పెట్టలేదు. గురువారం కూడా ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు చేస్తూ సుమారు 20కు పైగా ట్రాక్టర్ల ద్వారా గ్రావెల్ తరలిస్తున్నారు. ధర్మవరం చెరువు నుంచి అద్దంకి పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాలకు, బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెం, వల్లాపల్లి, మార్టూరు మండలం వలపర్ల, పంగులూరు మండలం రామకూరు తదితర గ్రామాలకు గ్రావెల్ తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తుండడం పట్ల గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రావెల్ తరలింపు విషయం తెలుసుకున్న పోలీస్‌లు ధర్మవరం చెరువు నుంచి గ్రావెల్ తరలిస్తున్న ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ ను స్వాధీనం చేసుకున్నారు. ధర్మవరం చెరువు నుంచి గ్రావెల్ తరలింపునకు అధికారులు అడ్డుకట్ట వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



వెంకటేశ్వర్లుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

పోపూరి శ్రీనివాసరావుకు పితృవియోగం

నివాళులర్పించిన ఎమ్మెల్యే ఏలూరి

ఇనగల్లు (పర్చూరు), జూన్ 6 : పర్చూరు మండలం ఇనగల్లు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు పోపూరి శ్రీనివాసరావు తండ్రి పోపూరి వెంకటేశ్వర్లు (65) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పోపూరి నివాసానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఏలూరి వెంట టీడీపీ సీనియర్ నేత ధూళిపల్లి వెంకటస్వామి, మక్కెన శేఖర్‌బాబు, కొల్లా శ్రీనివాసరావు (ఫ్యాక్టరీ), కోడూరి శేషబ్రహ్మాచారి, షేక్ షంషుద్దీన్, అప్పలనేని నరేంద్ర, దాసరి రామకృష్ణ, షేక్ హుస్సేన్, షేక్ బుల్లామేస్త్రీ, షేక్ ట్విన్స్, గోరంట్ల రామకృష్ణ తదితరులు ఉన్నారు. శుక్రవారం గ్రామంలో అత్యంక్రియలు నిర్వహించనున్నట్లు కుమారుడు శ్రీనివాసరావు తెలిపారు.



రవికుమార్‌కు అభినందనలు తెలుపుతున్న ఆర్యవైశ్యులు

గొట్టిపాటికి అభినందనల వెల్లువ

మేదరమెట్ల , జూన్ 6 : ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2009 నుంచి అద్దంకి నియోజకవర్గంలో పోటీ చేస్తున్న రవికుమార్ ఈసారి 25వేల మెజార్టీతో గెలవడం నియోజకవర్గ చరిత్రలోనే రికార్డు. గురువారం కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల నుంచి రవికుమార్‌కు అభినందనలు తెలిపేందుకు చిలకలూరిపేటకు భారీగా తరలివెళ్లారు. ఆర్యవైశ్య నాయకులు మద్దాళి సంజీవరావు, ఆదూరి ప్రసాద్, మేరకం శ్రీనివాసరావు, మద్దాళి రాఘవరావు, పాదర్తి కాజారావు గొట్టిపాటికి అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు. యూటీఎఫ్ మండల నాయకులు హరిబాబు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు రవికుమార్‌ను కలిసి అభినందనలు తెలిపారు. పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపినవారిలో ఉన్నారు. మేదరమెట్లకు చెందిన మేదరమెట్ల శ్రీనివాసరావు (పంతుల శ్రీను), మన్నె ప్రసాద్, మన్నె హనుమంతరావు(వైస్), వడ్లమూడి సురేంద్ర, చావా రాజేష్, రవ్వవరపు బ్రమ్మయ్య ఎమ్మెల్యేను కలిసి అభినందనలు తెలిపారు.

ప్రజలకు పారదర్శకంగా సేవలందించండి

మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి



మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి

చీరాలటౌన్, జూన్ 6 : మునిసిపల్ పరిధిలోని ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి అన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో అధికారులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ముందుగా ఇంజనీరింగ్ విభాగంలో జరుగుతున్న, జరగబోవు పనులు, వీధి దీపాలు, తాగునీరు వంటి అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. అలాగే రెవెన్యూ విభాగం సిబ్బందితో మాట్లాడారు. ఇంటి పన్నుల బకాయిల వివరాలు, ఖాళీ స్థలాల పన్నుల వివరాలు తదితరాలపై చర్చించారు. అంతేకాకుండా పారిశుధ్య విభాగం, జనన, మరణ ధ్రువీకరపత్రాలు వంటి వాటిపై సుదీర్ఘంగా చర్చించారు. పింఛన్ విభాగం వారు జూన్ 2024కు సంబంధించి నూరుశాతం పూర్తి చేయాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఈ ఏసయ్య, శ్యామల, లక్ష్మి, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అద్దంకిలో దొంగల హల్‌చల్

పట్టణంలోని మూడు ఇళ్లు, శ్రీనివాసనగర్‌లో చోరీ



చోరీ జరిగిన రిటైర్డ్ జడ్జి ఇంటిని పరిశీలిస్తున్న సీఐ కృష్ణయ్య

అద్దంకి, జూన్ 6 : అద్దంకిలో దొంగలు హల్‌చల్ చేశారు. అద్దంకి పట్టణంలో తాళాలు వేసి ఉన్న మూడు ఇళ్లలో, మండలంలోని శ్రీనివాసనగర్ లోని ఓ ఇంట్లో కుటుంబసభ్యులు నిద్రిస్తుండగా ఈ చోరీలు జరిగాయి. వివరాలలోకి వెళితే.. మండలంలోని శ్రీనివాసనగర్‌లో బుధవారం రాత్రి 11 గంటల సమయంలో కోనంకి యలమంద కుటుంబ సభ్యులు కొంత మంది ఇంటి ముందు, మరి కొందరు ఇంటి పైన నిద్రిస్తున్నారు. దొంగలు ఇంటి వెనుక తలుపు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా తాళం పగులగొట్టి అందులో ఉన్న 11 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదును అపహరించుకుపోయారు. అర్ధరాత్రి సమయంలో వర్షపు జల్లు పడడంతో ఇంట్లోకి వెళ్లగా చోరీ జరిగిన విషయాన్ని గుర్తించారు. యలమంద కుమారుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని కాకానిపాలెంలో జాగర్లమూడి అనంతమ్మ కాశీ తీర్థయాత్రకు వెళ్లారు. పక్క ఇంట్లో అద్దెకు ఉండే రమణారెడ్డి కూడా భార్య కాన్పుకు పుట్టింటికి వెళ్లారు. రెండు ఇళ్లకూ తాళాలు వేసి ఉన్నాయి. ఇంటి తాళాలు పగులగొట్టి అనంతమ్మ ఇంట్లో 4 సవర్ల బంగారు ఆభరణాలు, రమణారెడ్డి ఇంట్లో 4 గ్రాముల బంగారం చోరీ జరిగింది. మున్సిపల్ కార్యాలయం పక్క బజారులో రిటైర్డ్ జడ్జి కొత్తమాసు మురళీకృష్ణ అచ్యుతరావు కుటుంబ సభ్యులు కొద్ది రోజుల కిందట హైదరాబాద్ వెళ్లారు. దొంగలు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని వెండి వస్తువులు, కొద్దిమేర బంగారు ఆభరణాలను దొంగలించారు. విషయం తెలిసి హైదరాబాద్ నుంచి గురువారం రాత్రి అద్దంకి వచ్చిన మురళీకృష్ణ అచ్యుతరావు పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. చోరీ జరిగిన ఇళ్లను టౌన్ సీఐ కృష్ణయ్య పరిశీలించారు. క్లూస్ టీమ్ బృందం చోరీలు జరిగిన ఇళ్లలో వేలిముద్రలు సేకరించారు. ఒకేసారి 4 ఇళ్లలో చోరీలు జరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతంలో శివారు ప్రాంతాలలో చోరీలు జరగగా బుధవారం రాత్రి పట్టణం నడిబొడ్డున ఇళ్లల్లో చోరీలు జరగడం పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలో పోలీసులు రాత్రిపూట గస్తీని మరింత పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

వైదనలో రెండు వర్గాలపై కేసులు

బల్లికురవ, జూన్ 6 : మండలంలోని వైదన గ్రామంలో ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా జరిగిన ఘర్షణలో వైసీపీ, టీడీపీ పార్టీకి చెందిన 17 మందిపై ఇరువర్గీయుల ఫిర్యాదుల మేరకు రెండు కేసులు గురువారం నమోదు చేశామని ఎస్ఐ రవిశంకర్ రెడ్డి తెలిపారు. వైదన గ్రామానికి చెందిన బొమ్మిశెట్టి బ్రహ్మయ్య, కూలి విజయస్వామి మధ్య మంగళవారం ఘర్షణ జరిగింది. ఈసందర్భంగా రెండు వర్గాలకు చెందిన వారు గాయపడి వైద్యశాలలో చేరారు. బ్రహ్మయ్య ఫిర్యాదు మేరకు విజయస్వామి మరో పది మందిపై అలానే విజయస్వామి ఫిర్యాదు మేరకు బ్రహ్మయ్య మరో ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భార్యాభర్తలకు తీవ్రగాయాలు

అద్దంకి, జూన్ 5 : ఆటో అదుపు తప్పి గ్రిల్స్‌ను ఢీకొట్టడంతో మహిళకు తీవ్రంగా యాలయ్యా యి. స్థానికుల తెలిపిన వివరాలి వి. మండలంలోని కలవకూరుకు చెందిన భార్యాభర్తలు కుంచాల శ్రీను, రమణ అమ్ముకునేందుకు మామిడికాయలను ఉలవపాడు లో కొనుగోలు చేసి తమ ఆటోలో తీసుకు వస్తుండగా గురువారం పట్టణంలోని రామ్‌నగర్ వద్ద కు వచ్చే సరికి అ దుపు తప్పి రోడ్డు మార్జిన్‌లో గ్రిల్స్‌ను ఆటో ఢీకొట్టింది. రమణ కు తీవ్రగాయాలు కాగా ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. భర్త శ్రీనుకు స్వల్పగాయాలయ్యాయి. చక్రాయపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి స్వల్ప గాయాలయ్యాయి.

ప్రసన్నాంజనేయస్వామికి కదళీ ఫలార్చన



అద్దంకి, జూన్ 6 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో గురువారం అమవాస్య సందర్భంగా అరటి పండ్ల తో పూజ నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యంలో స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

మహిళా మార్ట్ బోర్డు తొలగింపు

అద్దంకి, జూన్ 6 : టీడీపీ ప్రభుత్వ పాలనలో పేదలకు అన్నం పెట్టిన అన్న క్యాంటీన్‌లను వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రద్దు చేసింది. ఈ నేపథ్యంలో అద్దంకిలోని అన్న క్యాంటీన్ భవనంలో జగనన్న మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశారు. మెప్మా సభ్యుల చేత బలవంతంగా సరుకులు కొనుగోలు చేయించారు. టీడీపీ అధికారంలోకి రావడంతో మున్సిపల్ అధికారులు గురువారం మహిళా మార్ట్ బోర్డును తొలగించారు.

బాబు పాలనతో స్వర్ణయుగం

- అభివృద్ధే లక్ష్యంగా ముందుకు
- ఎమ్మెల్యే గొట్టిపాటి

అద్దంకి, జూన్ 6 : రాష్ట్రానికి చంద్రబాబు పాలనతోనే స్వర్ణయుగం రానున్నదని అద్దంకి ఎమ్మెల్యే గొ ట్టిపాటి రవికుమార్ అ న్నారు. ఎమ్మెల్యేగా వరుసగా 5వసారి విజయం సాధించిన గొట్టిపాటి రవికుమార్ ను గురువారం నియోజకవర్గంలోని పలు గ్రామాలు, అద్దంకి పట్టణ టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ అద్దంకి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రకాశం జిల్లాలో కలిపేందుకు ప్రాధాన్యతనిస్తామన్నారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తానన్నారు. ప్రజలందరి ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా టీడీపీ ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. భారీ మెజార్టీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇది ప్రజలందరి విజయమని గొట్టిపాటి అభివర్ణించారు.



గొట్టిపాటికి అభినందనలు తెలుపుతున్న కౌన్సిలర్‌లు, నేతలు

కోటప్పకొండకు పాదయాత్ర

మొక్కు తీర్చుకున్న టీడీపీ శ్రేణులు

సంతమాగులూరు, మే 6: మండలంలోని పాతమాగులూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఎమ్మెల్యేగా గొట్టిపాటి రవికుమార్ గెలవాలని, రాష్ట్రంలో మళ్లీ చంద్రబాబు ప్రభు త్వం ఏర్పాటు కావాలని టీడీపీ శ్రేణులు కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామిని మొక్కుకున్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి రావడం తోపాటు గొట్టిపాటి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. దీంతో గురువారం సంతమాగులూరు మండలం పాతమాగులూరు గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు కోటప్పకొండకు పాదయాత్రగా వెళ్లి త్రికోటేశ్వరస్వామిని దర్శించుకుని, కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సజ్జా అమ్మారావు, పరిమి హనుమంతరావు, చల్లా బ్రహ్మారావు, మాదా కోటేశ్వరరావు, చల్లా శ్రీనివాసరావు, యన్నం కోటయ్య, గుమ్మా జ్యోతి, చల్లా శివాంజనేయులు, చల్లా నాగేశ్వరరావు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



పాదయాత్రగా వెళ్తున్న పాతమాగులూరు నాయకులు

లోకేష్‌ను కలిసిన కొండయ్య

చీరాల, జూన్ 6 : చీరాల నియోజకవర్గ ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య గురువారం టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్‌ను ఆయన నివాసంలో కలిశారు. కొండయ్య తన కుమారులు గౌరీ అమర్‌నాథ్, మహేంద్రనాథ్‌లతో కలసి లోకేష్‌ను కలిశారు. లోకేష్‌ను జీడిపప్పు దండతో సత్కరించారు. ఈ సందర్భంగా వారి మధ్య కొంతసేపు రాజకీయ సంభాషణ జరిగింది.



లోకేష్‌కు బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కొండయ్య, ఆయన కుమారులు

కొండయ్యకు, కృష్ణప్రసాద్‌కు శుభాకాంక్షలు

చీరాల : చీరాల నియోజకవర్గ ఎమ్మెల్యేగా, బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీగా గెలుపొందిన ఎంఎం కొండయ్య, తెన్నేటి కృష్ణప్రసాద్‌లకు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ శుభాకాంక్షలు తెలిపారు. గురువారం వైసీపీ నాయకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గెలుపొందిన వారు నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతూ, సుపరిపాలన సాగించాలని ఆకాంక్షించారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షిక వేడుకలు

బల్లికురవ, జూన్ 6 : మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో గురువారం వరసిద్ధి వినాయక స్వామి దేవాలయ 14 వార్షిక వేడుకలు వైభవంగా జరిగాయి. గ్రామానికి చెందిన భక్తులు వినాయకుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి ఇంకొల్లు మధుబాబు వరసిద్ధి వినాయకుడిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

దుర్మార్గ పాలన నుంచి ప్రజలకు విముక్తి

టీడీపీ విజయోత్సవ సంబరాలు

చినగంజాం, జూన్ 6 : దుర్మార్గ పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగిందని టీడీపీ బాపట్ల పార్లమెంట్ వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడు మోటుమర్రి రామసుబ్బారావు అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హ్యాట్రిక్ విజయం సాధించిన సందర్భంగా వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి మందిర ప్రాంగణంలో టీడీపీ ఆర్య వైశ్య నాయకులు కేకు కట్ చేసి గురువారం విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ముందుగా అమ్మవారికి రామసుబ్బారావు ఆధ్వర్యంలో నాయకులు పూజలు నిర్వహించి, మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కోట శివరామకృష్ణ, టీడీపీ ఆర్యవైశ్య నాయకులు బెల్లంకొండ రమేష్‌బాబు, శనగపల్లి సుబ్రహ్మణ్యం, బయ్యా సతీష్‌కుమార్, వలివేటి పవన్‌కుమార్, కందేపి ప్రభాకర్, నూనె స్వాములు, పొట్టి రమేష్, వి.రాజాలక్ష్మణపర్సు, వి.రాఘవరావు, శివప్రసాద్, వి.మణికంఠ, మోటుమర్రి కుమార్, ఆర్యవైశ్య యువత పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఆర్య వైశ్య నాయకులు

మొక్కులు తీర్చుకున్న శ్రేణులు

ఇంకొల్లు, జూన్ 5 : ఏలూరి సాంబశివరావు అఖండ మెజార్టీతో గెలుపొందడంతో ఇంకొల్లు సాయిబాబా మందిరంలో 24 గంటల ఏకాహం నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఎన్నికలకు ముందు భక్తులు టీడీపీ అధికారంలోకి రావాలని మొక్కుకున్నారు. కూటమి విజయం సాధించడంతోపాటు ఏలూరి హ్యాట్రిక్ గెలవడంతో గురువారం మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

బధిరుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

అద్దంకిటౌన్, మే 6 : అద్దంకిలోని బధిరుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల నిర్వాహకులు పూనూరి ఆరోగ్యం తెలిపారు. చైతన్య మహిళా మండలి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అద్దంకిలో 25 ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం వారి సహకారంతో నిర్వహిస్తున్న బధిరుల ఆశ్రమ పాఠశాలలో 2024- 25 విద్యా సంవత్సరానికి 1 నుంచి 10వ తరగతి వరకు ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. 4 నుంచి 16 సంవత్సరాలలోపు వినికిడిలోపం, మాటలు రాని, బుద్ధి మందత్వంవారు ప్రవేశానికి అర్హులని, రాష్ట్రంలోని ఏ ప్రాంతానికి చెందిన వారైనా అడ్మిషన్ పొందవచ్చన్నారు. వివరాలకు అద్దంకి బధిరుల ఆశ్రమ పాఠశాల, 9290083319, 8978923919, 9676699034 ఫోన్ నంబర్‌లకు సంప్రదించాలని కోరారు.



కాలినడకన శ్రీశైలం వెళ్తున్న టీడీపీ నేతలు

శ్రీశైలంకు పాదయాత్ర

మొక్కు తీర్చుకునేందుకు వెళ్లిన రేణంగివరం టీడీపీ నేతలు

పంగులూరు, జూన్ 6 : సార్వత్రిక ఎన్నికలలో అద్దంకి శాసనసభ్యునిగా గొట్టిపాటి రవికుమార్ గెలిచిన సందర్భంగా శ్రీశైల దేవస్థానంలో మొక్కు తీర్చుకునేందుకు టి.డి.పి. నేతలు రేణంగివరం నుండి కాలినడకన పాదయాత్ర చేపట్టారు. గ్రామానికి చెందిన టి.డి.పి. నేతలు ఎల్లాల నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ అమృతపూడి హోబు, శివరాత్రి వీరయ్య, బోరెడ్డి శివారెడ్డితో పాటు మరి కొందరు శ్రీశైలం దేవస్థానానికి చేరుకుని తమ మొక్కు తీర్చుకునేందుకు గురువారం చేపట్టిన పాదయాత్రను మండల టి.డి.పి. అధ్యక్షులు రావూరి రమేష్ పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల టి.డి.పి. నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, మస్తాన్‌వలి, సహదేవుడు, ఆదిరెడ్డి, ధూళిపాళ్ళ కోటేశ్వరరావు, అల్లంనేని స్వామి, జగన్, కోమటి ప్రసాదు, వరపర్ల సుబ్బారావు, గుడిబండ్ల ఆదిరెడ్డి, జాగర్లమూడి శ్రీను పలువురు మహిళలు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

గొట్టిపాటిని కలిసేందుకు తరలివెళ్లిన శ్రేణులు

సార్వత్రిక ఎన్నికలలో ఘన విజయం సాధించిన స్థానిక శాసనసభ్యుడు గొట్టిపాటి రవికుమార్‌ను కలిసేందుకు పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు గురువారం చిలకలూరిపేటకు తరలివెళ్లారు. మండలంలోని రామకూరు, కోటపాడు, తూర్పు తక్కెళ్ళపాడు, అలవలపాడు, ముప్పవరం తదితర గ్రామాలకు చెందిన నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వెళ్లి తమ అభిమాన నేత గొట్టిపాటికి శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన ఎన్నికల కోడ్

నెల్లూరు (హరనాథపురం) : సార్వత్రిక ఎన్నికల ఘట్టం ముగియడంతో గురువారం సాయంత్రం కోడ్ ముగిసినట్టు కలెక్టర్ హరినారాయణన్ ప్రకటించారు. మార్చి 16న జిల్లాలో కోడ్ అమలులోకి వచ్చిందని, 82 రోజులపాటు ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు చేసినట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి వివిధ బృందాలను నియమించి ఎన్నికల ప్రక్రియను పూర్తిగా పర్యవేక్షించినట్లు తెలిపారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తయినట్లు తెలిపారు.

నాటికన్నా నేడు ఘనం!

- భారీగా పెరిగిన కూటమి ఓట్ల షేరింగ్
- 2014లో 44.1 శాతం.. ఇప్పుడు 55.54 శాతం
- వైసీపీకి అప్పట్లో 48.9, ఇప్పుడు 39.91 శాతం
- అవినీతి, అరాచకం, అధిక ధరల కారణంగా కొట్టుకుపోయిన సంక్షేమం
- రాష్ట్రం బాగు కోసం కూటమికి జై కొట్టిన జనం


సంవత్సరం	పోలైనవి	కూటమి	వైసీపీ
2014	17,10,292	7,51,844	8,32,991
2024	15,74,029	8,72,838	6,28,295

2014 ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీల కూటమి పోటీ చేసింది. రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది. 2024లోనూ ఈ మూడు పార్టీలు కూటమిగా ఏర్పడ్డాయి. విజయదుందుభి మోగించాయి. తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది. ఈ రెండు ఎన్నికల మధ్య ఓట్ల షేరింగ్‌లో మాత్రం భారీ తేడా కనిపిస్తోంది. గతానికి, ఇప్పటికి కూటమి ఓట్ల శాతం భారీగా పెరిగింది. వైసీపీకి ఓట్లు మాత్రం తగ్గిపోయాయి. కూటమి ఓటు షేరింగ్ పెరగడానికి వైసీపీ షేరింగ్ తగ్గడానికి ప్రధాన కారణం ఐదేళ్ల వైసీపీ పాలనలో వైఫల్యాలే అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

నెల్లూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : 2014లో తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చింది. కానీ జిల్లాలో వైసీపీకే ఎక్కువ ఓట్లు వచ్చాయి. ఆ ఎన్నికల్లో పోల్ అయిన ప్రతి వంద ఓట్లలో వైసీపీకి 48.9 శాతం ఓట్లు వచ్చాయి. అంటే దాదాపుగా 50 శాతం ఓట్లు వైసీపీకే పడ్డాయి. కానీ ప్రస్తుత ఎన్నికల్లో అధికార పార్టీ హోదాలో ఉండి పోటీ చేసిన వైసీపీకి కేవలం 39.91 శాతం ఓట్లు మాత్రమే పడ్డాయి. అంటే 9 శాతం ఓట్లు తగ్గాయి. ఊహకందని రీతిలో ప్రజలు వైసీపీ ప్రభుత్వాన్ని తిరస్కరించారు. దీనికి ప్రధాన కారణాల్లో అవినీతి మొదటిదనే వాదన వినిపిస్తోంది. 2019 ఎన్నికల్లో జగన్ అనూహ్య విజయం సాధించిన క్రమంలో అవినీతిని ప్రజలు అంగీకరించారనే వాదన బలంగా వినిపించింది. అయితే ప్రస్తుత ఎన్నికల ఫలితాలలో అది తప్పని తేలిపోయింది. ప్రజలు అవినీతిని సహించరనే నిజం స్పష్టమయ్యింది.

● ఎన్నెన్నో ఆరోపణలు

2019 ఎన్నికలకు పూర్వం జగన్ మీద వచ్చిన అవినీతి ఆరోపణలు కాగితాలు, లెక్కలు, నివేదికలు, సీబీఐ, ఈడీ కార్యాలయాల వరకే పరిమితం అయ్యింది. ఇది ప్రజలకు పెద్దగా అర్థం కాలేదు. ఆ కారణంగానే ప్రజలు జగన్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలను విశ్వసించలేదు. పైగా వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మరణం తాలూకు సానుభూతి అవినీతి ఆరోపణల ప్రభావాన్ని తగ్గించింది. అయితే ఈ ఎన్నికల్లో జగన్ అవినీతికి పాల్పడుతున్నాడని ప్రతిపక్ష పార్టీలు చేసిన ఆరోపణలను ప్రజలు నమ్మారు. నాశిరకం మద్యం అమ్మకాల ద్వారా రూ.వేల కోట్లు వెనకేసుకోవం, ఇసుక అమ్మకాల్లో జగన్ దోచుకొంటున్నాడనే ఆరోపణలను నమ్మారు. దీనికితోడు స్థానిక నాయకుల అవినీతి ప్రజల కళ్లకు కట్టినట్లు కనిపించింది.



ఇసుక, క్వారీలు, సిలికా, భూ ఆక్రమణలు, మామూళ్లు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు వీటన్నింటిని ప్రజలు ప్రత్యక్షంగా చూశారు. కరెంటు బిల్లులు చూసి గుండెలు బాదుకున్నారు. ఉద్యోగాలు లేక చేతికందిన బిడ్డలు వీధులమ్మడి తిరగడం చూశారు. వీటన్నింటికి మించి ఐదేళ్ల పాటు ఏదో తెలియని అభద్రత భావంతో గడిపారు. ఇవన్నీ జగన్ సంక్షేమ పథకాలను మింగేశాయి. నవరత్నాలు జగన్ ఇంటి నుంచి ఇవ్వడం లేదు కదా అనే అభిప్రాయాన్ని కలిగించాయి. మచ్చుకైనా కనిపించని అభివృద్ధి, జీతాల కోసం ఉద్యోగులు, పించన్ల కోసం విశ్రాంత ఉద్యోగులు అనుభవించే నరకయాతన ఇవన్నీ ప్రజల్లో రాష్ట్ర కాంక్షను రగిలించాయి. సంక్షేమ పథకాల కింద డబ్బులు తీసుకొంటున్న వారు సైతం రాష్ట్రం నాశనం అయిపోతుందబ్బా అనే మాటే అన్నారు. ఈ కారణాలు వైసీపీ ఓట్ల శాతానికి భారీగా తగ్గించేశాయి.

● రాష్ట్రం బాగుపడాలనే కాంక్ష

ఆసియా ఖండ వాసులకు పుట్టిన గడ్డ మీద, దేశం మీద ప్రేమాభిమానాలు ఎక్కువని చరిత్రకారులు అంటారు. 2014, 2024 ఎన్నికల ఫలితాలను గమనిస్తే ఇక్కడి ప్రజలకు కూడా రాష్ట్రం మీద మమకారం ఎక్కువ అనే చెప్పక తప్పదు. రాష్ట్రం విడిపోయిన తరువాత జరిగిన తొలి ఎన్నికల 2014లో కూడా ప్రజలు రాష్ట్రం మీద మమకారం ప్రదర్శించారు. హైదరాబాద్‌ను కోల్పోయిన రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు సీఎం కావాలని అనుకున్నారు. రాష్ట్ర విభజన జరగకుండా ఉండి ఉంటే ఆ ఎన్నికల ఫలితాలు మరోలా ఉండేవేమో అనే అభిప్రాయాలు ఉన్నాయి. కానీ రాజధాని కూడా లేకుండా వీధిన పడిన రాష్ట్రానికి చంద్రబాబు దిశాదశ చూపిస్తారనే నమ్మకంతో ప్రజలు ఆయన్ను సీఎంను చేసుకున్నారు. ఇప్పుడు 2024లో కూడా అదే ఫీలింగ్ నాశనం అవుతున్న రాష్ట్రాన్ని కాపాడుకోవాలని అనే ఫీలింగ్ ప్రజల్లో కనిపించిందనే వాదన వినిపిస్తోంది. అరాచకాన్ని, అభద్రతా భావాన్ని, అభివృద్ధి శూన్యాన్ని అంగీకరించని జనం జగన్ పాలనపై తిరుగుబాటు చేశారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీలనివ్వను అనే ప్రతిజ్ఞత పొత్తుకు జనసేనాని పవన్ కల్యాణ్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలు హర్షించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రం సహకారం అవసరమని, అందుకోసం బీజేపీతో పొత్తు పెట్టుకోవడం మంచి నిర్ణయమని మెజారిటీ ప్రజలు అంగీకరించారు. రాష్ట్రం బాగుపడా లనే బలమైన నిర్ణయంతో కూటమికి ఓట్లు వేశారు. ఆ కారణంగానే 2014 ఎన్నికల్లో ఇదే కూటమికి జిల్లాలో 44.1శాతం ఓటు షేరింగ్ జరిగితే 2024లో 55.54 శాతం ఓట్లు పడ్డాయి. అంటే 11.5 శాతం ఓట్లు అదనంగా వచ్చాయని పరిశీలకులు భావిస్తున్నారు.



అయ్యోయ్యో.. డబ్బులు పోయనే !

● పందేలు కాసిన వైసీపీ నేతల అంతర్మథనం

పలేటివారిపాలెం, జూన్ 6: కందుకూరులో ఎన్డీఏ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావు గెలుస్తాడని లక్షకు రూ.2 లక్షలు, లక్షకు లక్షన్నర, లక్షకు లక్షా డెబ్బై వేలు, లక్షకు లక్షా ఎనభైవేలు ఇస్తామని టీడీపీ నాయకులు ఆఫర్ ఇచ్చారు. ఇందుకు వైసీపీ నాయకులు కొందరు ఓకే చెప్పారు. ఈ క్రమంలో మండలంలో రూ. 10 కోట్లకు పైగానే పందేలు నడిచినట్లు తెలుస్తోంది. అలాగే పలానా గ్రామంలో వైసీపీ కంటే టీడీపీకి ఎక్కువ ఓట్లు వస్తాయని, రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, వైసీపీ కంటే టీడీపీకి ఎక్కువ సీట్లు వస్తాయని కూడా గ్రామాల్లోరూ. కోట్లు పందేలు కాశారు. ఆరా మస్తాన్ సర్వే వైసీపీకి అనుకూలంగా ఇవ్వడంతో టీడీపీ నాయకులు రూ.లక్షకు రూ. రెండు లక్షలు ఆఫర్ చేయడంతో వైసీపీ నేతలు జోరుగా పందేలు పెట్టారు. ఇలా వైసీపీ నాయకులు పందేలు కాసి రూ.10 కోట్లకుపైగానే పోగొట్టుకున్నారు. దీంతో వారు అటు అధికారం పాయె.. ఇటు డబ్బులు పాయె.. అంటూ మథనపడుతున్నారు.



చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న వేమిరెడ్డి దంపతులు, కోటంరెడ్డి సోదరులు, బీద రవిచంద్ర

చంద్రబాబును కలిసిన నేతలు

నెల్లూరు (వైద్యం) : ఎన్నికలో ఘనవిజయం సాధించి టీడీపీ నాయకులు గురువారం ఉండవల్లిలోని ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడును కలిశారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చంద్రబాబును కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు. భారీ మెజారిటీతో గెలుపొందిన వేమిరెడ్డి దంపతులను చంద్రబాబు అభినందించారు. అలాగే వీరు నారా లోకేష్‌ను కూడా కలిశారు. వీరి వెంట నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన తమ్ముడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కూడా చంద్రబాబును కలిశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవి చంద్ర కూడా చంద్రబాబును కలిశారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభంజనం సృష్టించిందని ఇది చారిత్రాత్మక విజయమని బీద వెల్లడించారు.

కల్యాణ వైభోగమే!

- కమనీయంగా ఆదిదంపతుల వివాహ వేడుక
- భక్తులతో కిక్కిరిసిన జొన్నవాడ

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 6 : వేదపండితుల మంత్రోచ్ఛరణ, మంగళవాయిద్యాలు, భక్తులే పెళ్లిపెద్దలుగా జొన్నవాడ క్షేత్రంలో గంగా, కామాక్షితాయి సమేత శ్రీమల్లికార్జున స్వామివారి కల్యాణం గురువారం అట్టహాసంగా జరిగింది. ఇక్కడ జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామిఅమ్మవార్ల కల్యాణ వైభోగాన్ని కనులారా వీక్షించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తజనం తరలివచ్చింది. ఆలయ ముఖమండపంలో ప్రత్యేక పుష్పాలంకరణ, సుగంధ పరిమళాలతో ఏర్పాటు చేసిన వేదికపై ఉత్సవర్లను కొలువుదీర్చారు. స్వామి, అమ్మవార్ల ఎదురుకోలు సంప్రదాయం ఎంతగానో ఆకట్టుకుంది. కాగా, ఉభయకర్తలు స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు, పీతాంబరాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ వేడుక భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఏసీ శ్రీనివాసులు, ఈఓ గిరికృష్ణ, డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు సూరా ప్రదీప దంపతులతో పాటు సీఐ హైమారావు తదితరులు పాల్గొన్నారు. కామాక్షితాయి కల్యాణానికి వచ్చిన భక్తులు చదివింపులుగా రూ.2,18,211 సమర్పించుకున్నారు. అలాగే క్యూఆర్ కోడ్ ద్వారా కొంత మంది రూ.7,914 సమర్పించుకున్నారు.



ఆదిదంపతుల కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

● తెప్పపై విహరిస్తూ..

గురువారం రాత్రి గంగ, కామాక్షి సమేతుడిగా శ్రీమల్లికార్జునస్వామివారు పెన్నానదిలో హంస ఆకారంతో ప్రత్యేకంగా రూపొందించిన తెప్పపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. నదిలో ఏర్పాటు చేసిన పలు శబ్దాలు, రంగురంగుల బాణాసంచా కాల్చడం ఆకట్టుకుంది. నది బ్రిడ్జిపైన, బ్రిడ్జి నుంచి ఆలయ సమీపం వరకు పెన్నానదికి ఇరువైపులా భక్తజనం పోటెత్తింది. కోడ్ ముగియడంతో ఆలయ చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి కూడా పాల్గొన్నారు. కాగా, గురువారం రోజున భక్తులు తరలిరావడంతో నిత్యాన్నదాన సదనంతోపాటు టీటీడీ సత్రం ఆవరణలో కండక్టర్ సుధాకర్, ఆలయ సమీపంలో గౌరీశంకర్ ఫ్లవర్ డెకరేషన్స్ యజమాని దామరమడుగు శ్రీనివాసులు, కాశీ అన్నపూర్ణేశ్వరి అన్నదాన సదనంలో అన్నదానం చేశారు. స్థానిక ఆలయ పురోహితులు గొల్లనపల్లి బ్రదర్స్ ఆధ్వర్యంలోనూ బ్రాహ్మణ సామాజిక వర్గం భక్తులకు అన్నదానం నిర్వహించారు.





పెన్నానదిలో హంస ఆకారంలో రూపుదిద్దుకున్న తెప్ప, ఉత్సవర్లను తీసుకొస్తున్న భక్తులు

'సోమశిల' ఖాళీ!

● డ్యాంలో పూర్తిగా అడుగంటిన నీరు

అనంతసాగరం, జూన్ 6 : నీటిమట్టం పడిపోతుండటంతో సోమశిల డ్యాం బోసిపోతోంది. ఎండ తీవ్రతతో ఉన్న జలాలు ఆవిరి రూపాంలో వృథ కావడం, ఎగువ నుంచి చుక్కనీరు కూడా రాకపోవడంతో జలాశయంలో గంగమ్మ పాతాళానికి చేరుకొంది. నీటి లభ్యత లేక అందవిహీనంగా మారుతున్న పరిస్థితిలో ఇక కొన్ని రోజుల్లోనే జలాశయ అడుగుభాగం బయట పడే సూచనలు కనిపిస్తున్నాయి. జలాశయం ఎగువన ఇప్పటికే సుమారు 50 నుంచి 100 అడుగుల మేరకు కొండ చరియలు బయటపడిన దృశ్యాలు చూసేవారికి ఆందోళన కలిగిస్తున్నాయి. కొన్ని రోజుల క్రితం నైరుతి రుతుపవనాలు వచ్చినా ఆశించిన మేరకు వర్షం కురవని పరిస్థితి. ఇక సాగు అవసరాలకు నీరు లేక అన్నదాతలు ఖరీఫ్‌కు విరామం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే అన్ని వేళలా డెల్టాలో నీటి లభ్యత ఉండే అవకాశం ఉన్నా ఈసారి కొన్నిచోట్ల బోర్లకు నీరుతగ్గి పొలాలు బీడుగా మారుతున్న దుర్భర పరిస్థితి కనిపిస్తోంది. సహజంగా ఆగస్టు నుంచి శ్రీశైలం- పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా తెలుగు గంగకు నీరు వచ్చే అవకాశం వుంది. అయితే అప్పటి వరకు నీటి అవసరాలు తీర్చుకొనేందుకు అవసరమైన మార్గాలను అన్వేషిస్తూ ఇంజనీర్లు తలలు పట్టుకొంటూనే డ్యాంలో ఉన్న నీటిని ఎగువ నుంచి వరదలు వచ్చే వరకు పొదుపుగా సర్దు బాటు చేసుకొనేలా కసరత్తు చేస్తున్నారు.





మేకపాటి రాజమోహన్‌రెడ్డి



విక్రమ్‌రెడ్డి

మేకపాటి కోటకు బీటలు!

- ఆత్మకూరులో ఓటమితో వైసీపీలో అంతర్మథనం
- ఉదయగిరిలోనూ తప్పని పరాభవం

ఆత్మకూరు/ఉదయగిరి రూరల్, జూన్ 6 : వైసీపీ ముఖ్యనేత, నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి కుటుంబానికి కీలకమైన ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో ప్రస్తుత ఎన్నికల్లో భంగపాటు తప్పలేదు. ఆత్మకూరులో వరుసగా రెండుసార్లు, ఉప ఎన్నికల్లోనూ గెలుపొందిన మేకపాటి కుటుంబానికి ఈసారి పరాజయం తప్పలేదు. ఆ కుటుంబం నుంచి బరిలో దిగిన మేకపాటి విక్రమ్‌రెడ్డిపై టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి 7,718 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మేకపాటి కుటుంబానికి అత్యధిక మెజారిటీ తెచ్చిపెట్టే సొంత మండలం మర్రిపాడుతో పాటు అనంతసాగరం మండలంలో సైతం ఈ ఎన్నికల్లో గట్టి దెబ్బ తగలింది. ఆత్మకూరు రూరల్‌తోపాటు మున్సిపాలిటీ పరిధిలోనూ టీడీపీ పట్టు సడలలేదు. కౌంటింగ్‌కు ముందు ఆత్మకూరు మున్సిపాలిటీలో వైసీపీకే ఆధిక్యత వస్తుందనే అంచనాలు తలకిందులయ్యాయి. సమీకరణలు తారుమారయ్యాయి. ఊహించని విధంగా ఈసారి ఎన్నికల్లో వైసపీ ఆధిపత్యం ఉన్న అనంతసాగరం, మర్రిపాడు, సంగం మండలాల్లో ఆ పార్టీకి ఆధిక్యతకు గండి పడింది.

● సొంత మండలం నుంచే..

వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డికి తన సొంత మండలం మర్రిపాడులో 2019 ఎన్నికల్లో 5062 ఓట్లు వస్తే ఈ ఎన్నికల్లో 1,136 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఇక అనంతసాగరం మండలంలో 2019లో 7592 ఓట్లు వస్తే ఈ ఎన్నికల్లో 802, ఏఎస్‌పేట మండలంలో కేవలం 691 ఓట్లు మాత్రమే వైసీపీకి మెజారిటీ ఓట్లు వచ్చాయి. ఇక ఆత్మకూరు, సంగం, చేజర్ల మండలాల్లో టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి తన ఆధిక్యతను కొనసాగించారు. సంగం మండలంలో 3,446 ఓట్లు, చేజర్ల మండలంలో 2,321, ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో 2064, ఆత్మకూరు రూరల్‌లో 1203 ఓట్ల ఆధిక్యతను సాధించారు. ఇక ఉదయగిరిలోనూ మేకపాటి కుటుంబానికి భంగపాటు తప్పలేదు. వైసీపీ తరఫున మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ఎన్డీఏ కూటమి నుంచి కాకర్ల సురేష్ బరిలో నిలిచారు. కాకర్ల సురేష్‌కు 1,01,537 ఓట్లు, మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి 91,916 ఓట్లు దక్కాయి. దీంతో 9,621 ఓట్లు ఆధిక్యతతో కాకర్ల సురేష్ విజయం సాధించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో కాకర్ల సురేష్‌కు 1,810 ఓట్లు రాగా, మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి 933 ఓట్లు దక్కాయి.

● కలిసిరాని సంక్షేమ పథకాలు

ఈ నియోజకవర్గాల్లో వైసీపీ ఓటమికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా వైసీపీ నేతలు గెలుపుపై అతి నమ్మకం ప్రదర్శించారు. జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు, సంక్షేమ కార్యక్రమాలే గెలిపిస్తాయని, దానికితోడు కోట్ల రూపాయలు ఖర్చు చేయడంతో తప్పక గెలుస్తామని పూర్తిగా నమ్మకం పెట్టుకున్నారు. ఇదే కొంపముంచింది. మరోవైపు జగన్మోహన్‌రెడ్డి వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, వృద్ధులు, మహిళలపై ఎక్కువ ఆశ పెట్టుకున్నారు. వీటితోపాటు వైసీపీ విజయానికి దోహద పడుతుందనుకున్న నవరత్నాలు ఆశించిన మేర ఫలితాలు ఇవ్వలేకపోయాయి.

నిత్యావసరాల్లో కోత.. కార్డుదారుల ఆందోళన

● బియ్యం, అరకొరగా చక్కెర పంపిణీ



లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనం

ఉదయగిరి రూరల్, జూన్ 6: పౌరసరఫరాల ద్వారా నిరుపేదలకు అందుతున్న నిత్యావసర సరుకుల్లో కోత విధిస్తూనే ఉంది. నిన్నమొన్నటి వరకు అరకొరగా పంపిణీ చేసే కందిపప్పు, గోధుమపండి, రాగిపిండిని పూర్తిగా నిలిపి వేసింది. చక్కెర మాత్రమే పంపిణీ చేస్తోంది. అదీ కార్డుదారుడు చక్కెర అని అడిగితే ఇస్తున్నారు. దీంతో పేదలకు పూర్తిస్థాయిలో సరుకులు అందడం లేదు. ప్రతినెలా అందించే కందిపప్పును వైసీపీ ప్రభుత్వం గతేడాదిగా అరకొరగానే సరఫరా చేసింది. సార్వత్రిక ఎన్నికల సమయంలోనైనా నూరు శాతం కుటుంబాలకు ఇస్తారని ఎదురుచూసిన కార్డుదారులకు నిరాశే మిగులుతోంది. జిల్లాకు ప్రభుత్వం కందిపప్పు అరకొరగా కేటాయించడంతో పూర్తిస్థాయి లబ్ధిదారులకు అందడం లేదు. ఉదయగిరి సివిల్ సప్లయ్ గోదాం పరిధిలో సీతారామపురం, వరికుంటపాడు, ఉదయగిరి, మర్రిపాడు మండలాల్లో 38వేల కార్డులున్నాయి. జూన్‌నెలకు సంబంధించి బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేసి కందిపప్పు పంపిణీ చేయక పోవడంతో కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలోనైనా అన్నిసరుకులు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముమ్మరంగా బీసీజీ వ్యాక్సినేషన్



కోటవీధిలో బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

సీతారామపురం, జూన్ 6: అయ్యవారిపల్లి, సోంపల్లి, నారాయణంపేట్ట, సీతారామపురం, బోడసిద్దాయపల్లి, పండ్రంగి పబ్బులేటిపల్లిల్లోని 221మంది వయోజనులకు గురువారం వైద్య సిబ్బంది బీసీజీ వ్యాక్సిన్లు వేశారు. కార్యక్రమాన్ని వైద్యాధికారి స్వప్న పరిశీలించి మాట్లాడారు. క్షయవ్యాధి సోకకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ మజీద్, ఎంపీహెచ్ఎస్ రియాజ్, ఎంపీఎస్ క్రిష్ణమ్మ, హెల్త్‌అసి స్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు బేబి, వసంత, సుహాషిణి, మేరీ, బీబి పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన కాకర్ల సురేష్ దంపతులు



నారా లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాకర్ల దంపతులు, కుమార్తె ధాత్రి

ఉదయగిరి రూరల్/ వింజమూరు, జూన్ 6: ఉండవల్లిలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను గురువారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఆయన సతీమణి ప్రవీణలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎన్నికల్లో ఘనవిజయం సాధించడం, వైసీపీ కంచుకోటను బద్దలు కొట్టి మునుపెన్నడూలేని మెజార్టీ సాధించడంతో కా కర్ల సురేష్‌ను లోకేష్ ఆలింగనం చేసుకొని అభినందించారు. ఉదయగిరి అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని లోకేష్ సూచించినట్లు కాకర్ల తెలిపారు. తొలుత విజయ వాడ కనకదుర్గాదేవి ఆలయంలో పూజలు నిర్వహించారు. వారివెంట కుమార్తె ధాత్రి ఉన్నారు.

ఎమ్మెల్యే ఆనం, ఎంపీ వేమిరెడ్డికి అభినందనలు



ఎమ్మెల్యే ఆనంను సన్మానించిన కంచి పరమేశ్వరరెడ్డి తదితరులు

ఆత్మకూరు : ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలకు గురువారం పలువురు నేతలు అభినందనలు తెలిపారు. సాంబశివ చారిటబుల్ ఛైర్మన్ కంచి పరమేశ్వర రెడ్డి, బీజేపీ సీని యర్ నాయకలు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కుదు ముల సుధాకర్‌రెడ్డితో పాటు సో మవరపు యానాదిరెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, రామాల హరి ప్రసాద్‌రెడ్డి నెల్లూరుకు వెళ్లి వారిని కలసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని కోరారు.

రహదారిపైనే మురుగునీరు



రహదారిపై నిల్వ చేరిన మురుగు నీరు

ఉదయగిరి రూరల్, జూన్ 6: స్థానిక శ్రీనగర్‌కాలనీలోని ప్రధానరోడ్డుపై మురుగునీరు నిల్వ చేరడంతో కాలనీవాసులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు కాలువలు పూడికతో నిండిపోవడంతో మురుగు నీరంతా రోడ్డుపై పారుతూ పరిశుభ్రత నెలకొంది. దీనికితోడు పాదాచారులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారుతోంది. మురుగునీరు దోమలకు ఉత్పత్తి కేంద్రంగా మారి దుర్వాసన వస్తుందని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి మురుగునీరు రోడ్డుపై నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొనసాగుతున్న టీడీపీ సంబరాలు



వెంగారెడ్డిపాళెంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల సంబరాలు



జంగాలకండ్రికలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ శ్రేణులు

సంగం, జూన్ 6: మండలంలోని జంగాలకండ్రిక, చెన్నవరపాడు, వెంగారెడ్డిపాళెంలో గ్రామాల్లోని టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి స్థానికులకు పంచిపెట్టారు. వెంగారెడ్డిపాళెంలో సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ గెలుపు సంబరాలు చేసుకున్నారు.

పరిశుభ్రతను పాటించాలి

ఉదయగిరి రూరల్, జూన్ 6: ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ వ్యాధులకు దూరంగా ఉండాలని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి శివకల్పన సూచించారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా గురువారం గండిపాళెం గురుకుల పాఠశాలలో కీటక జనితవ్యాధుల నుంచి పిల్లలను రక్షించేందుకు తరగతి గదులు, మరుగుదొడ్లలో మలాథియన్ ద్రావణాన్ని పిచికారి చేయించారు. అనంతరం విద్యార్థులకు డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యాలపై అగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటిం చాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, హెల్త్ అసిస్టెంట్ చంద్రమౌళి పాల్గొన్నారు.

బెట్టింగులతో నాయకుల డీలా!

● ఆర్థికంగా చితికిపోయిన సామాన్య కుటుంబాలు

ఆత్మకూరు, జూన్ 6: ఎన్నికల ఫలితాలపై నరాలు తెగే ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి రావడం.. ఆత్మకూరులో టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డి గెలుపొందడంతో బెట్టింగుబాబుల ఆశలు నీరుగారిపోయాయి. రూ.50 వేలకు రూ.75వేలు, రూ.లక్షకు రూ.లక్షన్నరపై ఇస్తామని వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య పందెలు నడిచాయి. ఆత్మకూరు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి గెలుపుతో డబ్బు పోగొట్టుకున్న బెట్టింగు రాయుళ్లు డీలా పడ్డారు. మే 13న పోలింగ్ ప్రక్రియ పూర్తయిన్నపటి నుంచి వైసీపీయే ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని కొందరు, స్థానికంగా వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గెలుస్తాడని మరికొందరు, టీడీపీ గెలుస్తుందని ఇంకొందరు బెట్టింగులు జోరుగా చేపట్టారు. ఓట్లు లెక్కింపునకు మూడురోజుల ముందు టీడీపీ గెలుస్తుందని, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అవుతాడని కొన్నిసర్వేలు వెల్లడించాయి. మరికొన్ని సర్వేలు వైసీపీ అధికారంలోకి వస్తుందని తెలిపాయి. బెట్టింగ్ బాబులు వైసీపీ గెలుస్తుందనే ధీమాతో వేలలో పందెలు కాసిన వారికి వైసీపీ ఓటమితో ఆర్థికంగా ఎంతో మందికి ఎదురుదెబ్బ తగిలింది. పందేల ఆశతో కొన్ని కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి బయటకు చెప్పలేక కంటిచూపు తప్ప నోరు మెదపని పరిస్థితి ఏర్పడింది. గెలుపు ఓటములు సహజంగా స్వీకరించాలే తప్ప బెట్టింగ్‌లు జోలికి వెళ్లి ఆర్థికంగా కోలుకోలేని దెబ్బతినరాదని వచ్చే ఎన్నికల్లో అయినా ఆశిద్దాం.

విద్యార్థులకు పోటీలు

సంగం, జూన్ 6: స్థానిక శాఖ గ్రంథాలయంలోని వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన, తెలుగు పద్య పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని లైబ్రియన్ రవీంద్రరెడ్డి పర్యవేక్షించారు.

అంకాళమ్మ ఆలయంలో అన్నదానం

అనంతసాగరం, జూన్ 6: స్థానిక సోమశిల రోడ్డులో వెలసిన గ్రామదేవత అంకాళమ్మ ఆలయంలో గురువారం అమావాస్య పూజలు నిర్వహించారు. ఉభయకర్తగా చల్లా అవినాష్ రెడ్డి వారి కుటుంబసభ్యులు అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొన్నారు. ఆలయధర్మకర్త బట్రెడ్డి కృష్ణారెడ్డి, చల్లా శివారెడ్డి పాల్గొన్నారు.



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

ఆక్రమిత పొలాల పరిశీలన

చేజర్ల, జూన్ 6: ఆదురుపల్లి సమీపంలోని చిత్తలూరు వరద కాలువను సమీప పొలాల రైతులు ఆక్రమించి పైన ఉన్న పొలాలకు దారి లేకుండా చేశారు. ఈ విషయంపై పలుమార్లు రైతులు అధికారులకు ఫిర్యాదు చేసినా వైసీపీ నా యకుల ఒత్తిడి మేరకు పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో గ్రామస్థుల ఫిర్యాదు మేరకు గురువారం ఇరిగేషన్ ఏఈ సురేష్ స్థానిక రైతులతో కలసి కాలువలను పరిశీలించారు. ఆక్రమణ జరిగిన విషయం వాస్తవం అని, త్వరలో ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కాలువలపై మూతలు మరిచారు

ఉదయగిరి రూరల్, జూన్ 6: పట్టణంలోని దిలావర్‌భాయ్‌వీధి, శ్రీనగర్‌కాలనీ, కోళ్ల వీధి, యాదవపాళెం, బీసీ కాలనీల్లో కొన్ని నెలల క్రితం నూతనంగా మురుగు కాలువలు నిర్మించారు. వాటిపై మూతలు అరకొరగా ఏర్పాటు చేయడం, మరికొన్ని ప్రాంతాల్లో అసలు ఏర్పాటు చేయకపోవడంతో పాదచారులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కాలువల్లో చెత్తాచెదారం నిండి దుర్వాసన వస్తుందని స్థానికులు వాపోతున్నారు. దీనికి తోడు కొన్ని ప్రాంతాల్లో కాలువలు సక్రమంగా నిర్మించకపోవడంతో మురుగు నీరు ముందుకు వెళ్లడం లేదని, కాలువల నిర్మాణ సమయంలోనే ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

కరెంటు పోతే కష్టాలే..!

● నిరుపయోగంగా మారిన జనరేటర్

● మరమ్మతులకు నోచుకోని ఇన్‌వర్టర్లు

● తహసీల్దార్ కార్యాలయంలో ఇదీ దుస్థితి



ఎండలోనే ఏర్పాటు చేసిన జనరేటర్

వరికుంటపాడు, జూన్ 6: స్థానిక తహసీల్దారు కార్యాలయానికి ఏళ్ల తరబడి కరెంటు కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. నిత్యం ఉద్యోగులు, ప్రజలతో రద్దీగా ఉండే కార్యాలయానికి కనీస వసతులు సమకూర్చుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. విధి నిర్వహణకు ఎలాంటి ఆటంకం ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి కార్యాలయ ఆవరణలో జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. ప్రారంభంలో బాగానే వినియోగం సాగింది. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ ఉండటం వలన మొరాయించేది. ప్రస్తుతం పనిచేయక నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం వాటిని పట్టించుకొనే నాథులే కరువయ్యారు. అనంతరం ఏర్పాటు చేసుకున్న ఇన్‌వర్టర్లు సైతం మరమ్మతులకు నోచుకోలేదు. దుమ్ము, ధూళితో నిండి వెక్కిరిస్తున్నాయి.



మూలన పడేసిన ఇన్‌వర్టర్లు

ప్రస్తుతం వేసవి ప్రభావంతో విద్యుత్ సర ఫరాలో అంతరాయం తలెత్తుతుండడంతో ఉక్కపోతను తట్టుకోలేక ఉద్యోగులు, సిబ్బంది నానాయాతన అనుభవిస్తున్నారు. వీరికి తోడు పనులపై వచ్చిన ప్రజలు సైతం కరెంటు ఎప్పుడు వస్తుందా అంటూ ఆశగా ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కొద్దిపాటి వర్షానికే బోగోలులో నిలిచిన నీరు



బోగోలు ప్రధాన రోడ్డులో నిలిచి ఉన్న వర్షపునీరు

బిట్రగుంట, జూన్ 6: బోగోలు ప్రధాన రోడ్డుపై కొద్దిపాటి వర్షానికే నీరు నిల్వ చేరడంతో గురువారం పాదచారులు, ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండల ప్రధాన నాయకులు ఉంటున్న బోగోలులోనే రోడ్లను పట్టించుకోకపోతే మిగిలిన పంచాయతీల్లో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి జయలక్ష్మి, ఈవో పీఆర్డీ శ్రీదేవి సంఘటనా స్థలానికి చేరుకొని మోటార్‌తో నీటిని తరలించే చర్యలు చేపట్టారు.

కలిగిరి : మండలంలో గురువారం చిరుజల్లులు పడ్డాయి. ఈ జల్లులతో వాతావరణం చల్లబడటంతో ప్రజలు సేదతీరారు. రుతుపవనాలు చురుకుగా కదులుతుండగా ఆకాశం మబ్బులుపట్టి చల్లటి గాలులు వీచాయి.

కూటమి విజయం.. కార్యకర్తల సంబరం



జలదంకిలో ఎన్డీఏ నేతల సంబరాలు



బిట్రగుంటలో మాలేపాటికి సత్కారం



అల్లూరులో బీద గిరిధర్‌కి సన్మానం

అల్లూరు, జూన్ 6 : సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం సాధించడంతో తమతమ నాయకులకు కార్యకర్తలు శుభాకాంక్షలు తెలుపుకుంటున్నారు. అల్లూరు టీడీపీ కార్యాలయంలో గురువారం నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్‌ను మండలంలోని నాయకులు, కార్యకర్తలు కలుసుకొని అభినందనలు తెలిపారు. శాలువాలు, పూలమాలలతో ఆయన్ను సత్కరించారు.

బిట్రగుంట,(దగదర్తి): సమష్టి కృషితోనే విజయం సాధించ గలిగామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు అన్నారు. దగదర్తి మండలం కేకేగుంట, సున్నపుబట్టి పంచాయతీలకు చెందిన పలువురు నాయకులు గురువారం మాలేపాటికి పూలమాలలు వేసి శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నగళ్ల ఆనంద్, బెల్లంకొండ శ్రీనివాసులు, వల్లపు మల్లికార్జున, హరికృష్ణ, వెంకటేశ్వర్లు, రాంప్రసాద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం : కందుకూరు ఎమ్మెల్యేగా ఇంటూరి నాగేశ్వరరావు గెలుపొందడంతో స్థానిక వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, రిటైర్డ్ హెచ్ఎం. కండే మాలకొండయ్య, అర్థాకుల బాబు(వెంకటేశ్వరరావు)ల నేతృత్వంలో అంకమ్మ ఆలయంలో గురువారం 101 కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు గాలంకి ప్రసాద్, అడపా రంగయ్య జి బాలనారాయణ, అడపా కృష్ణ, అర్థాకుల పెదసత్యం, అర్థాకుల చిన సత్యం, మీరావళి తదితరులు కొబ్బరికాయలు కొట్టి, పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ బాలకోటయ్య, సజ్జల మాల్యాద్రి, పెద అంజయ్య, అనిల్, వెంకటేశ్వర్లు చంద్రమౌళి పాల్గొన్నారు.



వలేటివారిపాలెం : అంకమ్మ ఆలయంలో 101 టెంకాయలు కొట్టిన వాల్మీకి సంఘం నాయకులు

జలదంకి : మోదీ, చంద్రబాబు విజయంపై స్థానిక ఎన్డీఏ కూటమి కార్యాలయంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు గురువారం సంబరాలు చేసుకున్నారు. ముందుగా కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి, కావలి ఎమ్మెల్యేలుగా కాకర్ల సురేష్, కావ్య క్రిష్ణారెడ్డిలు గెలుపొందడం ఆనందంగా ఉందన్నారు. వీరి నాయకత్వంలో జలదంకి మండలం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో నేతలు పచ్చా పెంచలయ్యానాయుడు, కంచర్ల వినోద్‌నాయుడు, కోర్సిపాటి మాధవరెడ్డి, చిత్తాబత్తిన మస్తాన్‌రెడ్డి, కూరపాటి చిన్నా, నక్కా మాధవరావు, నిమ్మలపల్లి రామ్‌చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కరేడు విద్యార్థుల ప్రతిభ

ఉలవపాడు, జూన్ 6 : కరేడు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాని(ఎన్ఎంఎంఎస్)కి ఎంపికైనట్లు హెచ్ఎం పీ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి చదువుతున్న ఆసోది భాను ప్రకాష్‌రెడ్డి, కటారి శ్రీకన్య గత డిసెంబర్‌లో జరిగిన జాతీయ ఉపకార వేతనం పరీక్షలు రాసి ప్రతిభ కనపరిచారని తెలిపారు. వీరికి ఏడాదికి రూ. 12,000 చొప్పున నాలుగేళ్లపాటు ఉపకార వేతనం అందుతుందని పేర్కొన్నారు.వారిని హెచ్ఎం తోపాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ బొడ్డు శ్రీధర్‌రెడ్డి, గ్రామస్థులు అభినందించారు.

861 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, జూన్ 6: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి గురువారం రైతులు మొత్తం 952 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకువచ్చారు. వేలంలో 17 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 861బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-29, ఆర్‌ఆర్-7, సీఆర్-38, జంపింగ్‌లాట్స్-17 కారణాలతో 91బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.331, కనిష్ఠ ధర రూ.205, సగటు ధర రూ.282.30గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

మిగుల సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కలిగిరి, జూన్ 6: ఏపీ మోడల్ స్కూల్‌లో 7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏ శ్రీను తెలిపారు. అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈనెల 11వతేదీలోపు పాఠశాలలో అందజేయాలని ఆయన తెలిపారు.

పేదలకు బిర్యానీ పంపిణీ

కావలిటౌన్, జూన్ 6: మీకోసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం బుడమగుంట గిరిజనకాలనీలో పేదలకు చికెన్ బిర్యానీ పొట్లాలు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు రాయపాటి దిలీప్ మాట్లాడుతూ ఎన్ఆర్ఐ కట్టా నోయల్, స్వర్ణలత దంపతుల కుమారుడు అలెన్‌పాల్ పుట్టిన రోజు సందర్భంగా చికెన్ బిర్యానీ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దిపూర్ పీపుల్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు చేవూరి చిన్న, సంస్థ బాధ్యులు రవికుమార్, మారుతీరామారావు, నూర్జహాన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిక్షణ



విద్యార్థినికి బహుమతి అందచేస్తున్న దాత

ఉలవపాడు, జూన్ 6 : స్థానిక శాఖా గ్రంథాలయంలో 20 రోజులుగా జరిగిన వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు గురువారం ముగిశాయని గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు తెలిపారు. ప్రతిరోజు ఆటల పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు దాతల సాయంతో బహుమతులు అందచేశామని చెప్పారు. గ్రంథాలయం స్థల, భవన నిర్మాణ దాత దేవరపల్లి వెంకటక్రిష్ణారెడ్డి జ్ఞాపకార్థం కుమార్తె కోటిరెడ్డి సుచరితారెడ్డి, చింతం కోటిరెడ్డి జ్ఞాపకార్థం మనవుడు చింతం నిషాంత్‌రెడ్డిలు విజేతలకు బహుమతులు అందచేశారని వివరించారు.

వీపీఆర్‌కు కేంద్ర మంత్రి పదవి ఇవ్వాలి

కావలి, జూన్6: సేవాతత్పరుడు అయిన నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి కేంద్ర మంత్రి పదవి ఇవ్వాలని కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. వేమిరెడ్డి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, నెల్లూరు ఎంపీగా పోటీచేసి అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలుపొందాడన్నారు. ఎన్డీఏలో భాగస్వామ్యంగా ఉన్న టీడీపీ కేంద్ర మంత్రి వర్గంలో కూడా భాగస్వామ్య కానున్నందున వేమిరెడ్డికి మంత్రి పదవి ఇస్తే జిల్లాతో పాటు రాష్ట్రం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు.

ఎమ్మెల్యే ఇంటూరికి అభినందనల వెల్లువ



ఎమ్మెల్యే నాగేశ్వరరావును అభినందిస్తున్న బీజేపీ నాయకులు

కందుకూరు, జూన్ 6: కందుకూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఇంటూరి నాగేశ్వరరావుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఆయనకు అభినందనలు తెలిపేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పోటీపడుతున్నారు. దీంతో అటు బడేవారిపాలెంలోని ఆయన నివాసం వద్ద ఇటు కందుకూరులోని టీడీపీ కార్యాలయం వద్ద గురువారం తిరునాళ్ల వాతావరణం కనిపించింది. ఉదయం నుంచి వేలాదిమంది పార్టీ నాయకులు, కార్యకర్తలతోపాటు వివిధ వర్గాలకు చెందిన ప్రముఖులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని వ్యాపారులతోపాటు వివిధరంగాలలో ప్రముఖులు బడేవారిపాలెం వెళ్లి నాగేశ్వరరావుకు అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి ప్రత్యేక వాహనాలలో తరలివచ్చిన కార్యకర్తలు, టీడీపీ అభిమానులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. కాగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గట్టమనేని హరిబాబు ఆధ్వర్యంలో ఆపార్టీ నాయకులు జొన్నాదుల రాఘవయ్య, మన్నేపల్లి వరప్రసాదరావు, అమలనాథుని మాల్యాద్రినాయుడు, బొర్రా కోటేశ్వరరావు, జి. మోజెస్, జగన్నాథం వైకుంఠం, మాటూరి రమేష్ నాయుడు తదితరులు నాగేశ్వరరావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యమ నేత పాలస్‌కు ఘన నివాళి



పాలస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కందుకూరు, జూన్ 6: బలహీనవర్గాల హక్కుల సాధన, కూలీల సమస్యల పరిష్కారం కోసం తుదిశ్వాస వరకు ఉద్యమించిన నేత పాలస్ అని సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి బీ సురేష్‌బాబు పేర్కొన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం పాలస్ వర్థంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మురళి, ఆనంద్‌మోహన్, రాము, బాలబ్రహ్మాచారి, ఉప్పుటూరి మాధవరావు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరులో రెండురోజులుగా మోస్తరు వర్షం

కందుకూరు, జూన్ 6: నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బుధవారం రాత్రి, గురువారం ఉదయం ఓ మోస్తరు జల్లులు పడటంతో రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నెలలుగా ఎండలతో అల్లాడిపోయిన ప్రజలు చిరుజల్లులతో ఉపశమనం పొందారు. తొలకరి జల్లులతో నేల పదును కానప్పటికీ రానున్న రెండుమూడు రోజులు ఈ ప్రాంతంలో వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణశాఖ అంచనాతో భూమి పదునవుతుందన్న ఆశాభావంతో ఉన్నారు. కొన్నేళ్లుగా జూన్ చివరివారం వరకు ఈ ప్రాంతానికి నైరుతి రుతుపవనాలు రాకపోగా ఈ ఏడాది దాదాపు పదిహేను రోజులు ముందుగానే నైరుతి పలకరించటంతో ఈ ఏడాది ఆశాజనకమైన వర్షాలు కురుస్తాయన్న రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో విస్తారంగా సాగుచేసి ఉన్న జామాయిల్, ఇతర సామాజిక వనాలకు ఈ వర్షంతో ఎంతో మేలు జరుగుతుందని రైతులు చెబుతున్నారు. అలాగే కొట్టుడుకు వచ్చిన జామాయిల్‌కు కూడా ఈ వర్షాలతో నీరుచేరి లాభం జరుగుతుందన్నారు. మరోవైపు అదునులో తొలకరి జల్లులు కురవడంతో పచ్చిరొట్ట పైర్లు సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

వలేటివారిపాలెంలో కానిరాని పారిశుధ్యం



వలేటివారిపాలెం బీసీ కాలనీ సమీపంలో ప్రధాన రహదారి పక్కన మురుగు కాలువలో పేరుకపోయిన చెత్త

వలేటివారిపాలెం, జూన్ 6 : వలేటివారిపాలెం గ్రామంలో దోమలు విజృంభిస్తున్నాయి. సాయంత్రం అయితే చాలు జనంపై దాడి చేస్తున్నాయి. దోమలు నివారణకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టడం లేదు. మురుగు కాలువల్లో చెత్తచెదారం తొలగించడంలేదు. దీంతో మురుగు కాలువల్లో గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగి నీరు ముందుకు కదలడం లేదు. ఫాగింగ్ చేయడం లేదు. దీంతో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు.

● ఫాగింగ్ యంత్రాలు ఉన్నా...

దోమలు నియంత్రణకు కాలువల్లో ఆయిల్ బాల్స్ వేయాలి. లార్వా పెరగకుండా మందులు పిచికారీ చేయాలి. యంత్రాలతో ఫాగింగ్ చేయాలి. దోమలు నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య చర్యలు చేపట్టాలి.